https://epaper.dksaardyamlochaatimpu.com

E-mail: dkchaatimpu80@gmail.com RNI. NO. APTEL/2008/26737

డీకే సారధ్యంలో

చాటింపు

తెలంగాణ దిన పత్రిక

హైదరాబాద్ సంపుటి : 18 సంచిక : 17 ఎడిటర్ : పూసాల శ్రీనివాస్ మంగళవారం,అక్టోబర్,13, 2026 పేజీలు : 8 వెల : రూ.1/-


“అక్షరమే ఆయుధంగా...
ప్రజలే బలంగా...
18 ఏళ్లుగా విశ్వసనీయతతో సాగుతున్న
‘డీకే చాటింపు’ అక్షర ప్రస్థానం.”
18th Anniversary
డీకే చాటింపు
18 వసంతాలు... ప్రజల విశ్వాసం...
నిజాన్ని నిర్భయంగా చాటే ‘డీకే చాటింపు’ కి
హృదయపూర్వక వార్షికోత్సవ శుభాకాంక్షలు.
నిజాన్ని చాటుతూ...
ప్రజల గొంతుకగా నిలుస్తూ...
18 ఏళ్ల విజయవంతమైన ప్రస్థానం —
డీకే చాటింపు.
17 ఏళ్ల అక్షర ప్రయాణం..
ప్రజల అదరటే చిరస్థాయి బలం...
మరిన్ని విజయవంతమైన సంవత్సరాలకు
నాంది.

రోడ్లపై కాదు..

ఆధారాలతో ఈసీ వద్దకు వెళ్లండి

ఢిల్లీలో ఇండియా కూటమి నిరసనలపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ స్పందన



న్యూఢిల్లీ,అక్టోబర్,12:ఇండియా కూటమి ఆధ్వర్యంలో ఢిల్లీలో చేపట్టిన నిరసన కార్యక్రమాలపై బీజేపీ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ స్పందించారు. ఈ ఆందోళనల వల్ల రాజధాని ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ప్రతిపక్ష నేతలు ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలని ఆయన అన్నారు. సోమవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఈటల... ప్రతిపక్షాల తీరుపై పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరిగాయని ఆరోపణలు చేసేవారు, అందుకు సంబంధించిన ఆధారాలతో ఎన్నికల సంఘాన్ని సంప్రదించాలని ఈటల సూచించారు. “ఎన్నికల సంఘం నుంచి అపాయింట్‌మెంట్ తీసుకుని, మీ వద్ద ఉన్న ఆధారాలను సమర్పించండి. అంతేగానీ, ఇలా రోడ్లెక్కి ప్రజలను ఇబ్బంది పెట్టడం సరికాదు” అని ఆయన అన్నారు. గతంలో బీహార్‌లో ‘ఓట్ల దొంగతనం’ జరిగిందని ఇలాగే ఆరోపించారని, కానీ దాని ఫలితం ఏమైందో గుర్తుచేసుకోవాలని అన్నారు. బీహార్ ఎన్నికల నుంచి ఇండియా కూటమి గుణపాఠం నేర్చుకోవాలని ఈటల హితవు పలికారు. ప్రతిపక్షాలు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ పోరాడటం నేర్చుకోవాలని ఆయన సూచించారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ‘చలో ఢిల్లీ – మార్చ్ ఫర్ డెమోక్రసీ’ పేరుతో ఇండియా కూటమి సుప్రీంకోర్టుకు పాదయాత్ర తలపెట్టిన విషయం తెలిసిందే. ఈ నిరసనల కారణంగా ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించడంతో పాటు, కొన్ని మెట్రో స్టేషన్లను మూసివేశారు.

‘ఇప్పుడు దేశమంతా జంతర్ మంతర్ అవుతుంది’..

నిరసన వేదిక గుర్తింపు రద్దుపై అభిజీత్ దిప్కే



న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో నిరసనలకు వేదికగా ఉన్న జంతర్ మంతర్‌కు ఆ హోదాను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే స్పందించారు. ఇప్పుడు దేశమంతా ‘జంతర్ మంతర్’ అవుతుందని ఆయన పేర్కొన్నారు. సోమవారం ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ‘వారు (కేంద్రం) జంతర్ మంతర్‌ను అధికారిక నిరసన స్థలం జాబితా నుంచి తొలగించారు. అవును, అది ఇకపై నిరసన స్థలం కాదు. ఏదేమైనా ఒక పిరికి నియంత దానిని యుద్ధ క్షేత్రంగా మార్చేశారు. ఇక దేశమంతా జంతర్ మంతర్ అవుతుంది’ అని అందులో పేర్కొన్నారు. అలాగే, ఈ రోజు జంతర్ మంతర్‌కు ఉన్న ‘నిరసన ప్రదేశం’ హోదాను ప్రధాని మోదీ రద్దు చేశారని, రేపు ఆయన ప్రజాస్వామ్యాన్నే రద్దు చేస్తారని మరో పోస్ట్‌లో మండిపడ్డారు.

‘ఆ నియంతకు అసలు సమస్య నిరసన ప్రదేశం కాదు. ప్రజలు నిరసన తెలపడం అనే భావనే ఆయనకు సమస్య’ అని విమర్శించారు. గుర్తించే హోదాను రద్దు చేస్తూ ఢిల్లీ పోలీస్ కమిషనర్ అనురాగ్ కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ‘కమిటీ సిఫార్సుల ఆధారంగా, నిరసన వేదికగా జంతర్ మంతర్‌కు ఉన్న గుర్తింపును రద్దు చేశారు. నిరసనలు లేదా ప్రదర్శనలు నిర్వహించడానికి రామ్‌లీలా మైదానం, బురారీ మైదానం, సీబీడీ మైదానం అనే మూడు కొత్త ప్రదేశాలను నిర్దేశించారు’ అని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. ఈ మూడు కొత్త ప్రదేశాలలో నిరసనలు నిర్వహించడానికి సంబంధించిన ప్రామాణిక కార్యనిర్వహణ విధానాలను వేర్వేరుగా జారీ చేస్తామని ఢిల్లీ పోలీసులు తెలిపారు.

భారత్‌లో నేపాల్, బంగ్లాదేశ్ తరహా అస్థిరతకు కుట్ర

- హరీశ్ సాల్వే సంచలన ఆరోపణలు- భారత్‌లో నేపాల్, బంగ్లాదేశ్ వంటి పరిస్థితులు సృష్టించేందుకు ప్రయత్నాలునిరసనల వెనుక విదేశీ శక్తులు, నిధులు ఉన్నాయని అనుమానం-మోదీ ప్రభుత్వ పురోగతిని అడ్డుకోవడమే లక్ష్యంగా కుట్రలు-ఇవి ప్రజా ఉద్యమాలు కావని, ఎక్కువ కాలం నిలవవని స్పష్టీకరణ -సోషల్ మీడియా ద్వారా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపణ



న్యూఢిల్లీ,అక్టోబర్,12:భారతదేశంలో నిరసనల పేరుతో నేపాల్, బంగ్లాదేశ్‌లో మాదిరిగా అస్థిరతను సృష్టించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని సీనియర్ అడ్వకేట్, భారత మాజీ సొలిసిటర్ జనరల్ హరీశ్ సాల్వే సంచలన ఆరోపణలు చేశారు. దేశంలో అశాంతిని రెచ్చగొట్టడంలో విదేశీ శక్తుల పాత్ర ఉండొచ్చని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. ‘ఐఏఎన్ఎస్’ వార్తా సంస్థకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. కొన్ని నిరసన కార్యక్రమాలకు విదేశాల నుంచి నిధులు అందుతున్నాయని తాను విశ్వసిస్తున్నట్లు సాల్వే తెలిపారు. ప్రభుత్వ పురోగతిని అడ్డుకోవడానికి కొన్ని గ్రూపులు ప్రయత్నిస్తున్నాయని, ప్రదర్శనల కోసం ఇంత డబ్బు ఎక్కడి నుంచి వస్తోందని ఆయన ప్రశ్నించారు. పొరుగు దేశాల్లో రాజకీయ పరిణామాలను ప్రస్తావిస్తూ.. “నేపాల్, శ్రీలంక, బంగ్లాదేశ్‌లో జరిగిన గందరగోళం వెనుక ఎవరున్నారనే దానిపై సందేహం ఉందా? నాఅభిప్రాయం ప్రకారం, ఈ సంఘటనల వెనుక విదేశీ శక్తులు ఉన్నాయి” అని అన్నారు. భారత్‌లోనూ అలాంటి ధోరణే కనిపిస్తోందని, దీప్కే, సౌరవ్ దాస్ వంటి కొందరు ఆకస్మికంగా నిరసనలకు నాయకులుగా ముందుకొస్తున్నారనిసాల్వే ఆరోపించారు. జర్మనీ వంటి దేశాల్లో నివసించే కొందరు ఇక్కడ ఎలా నాయకులుగా చలామణి అవుతున్నారని, ఈ కార్యకలాపాలకు వారికి నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయని ప్రశ్నించారు.

లైంగిక వేధింపుల కేసులో కాంగ్రెస్ ఎంపీ.. బీజేపీ మహిళా మోర్చా భారీ ధర్నా



న్యూఢిల్లీ,అక్టోబర్,12:దేశ రాజధాని ఢిల్లీ నగరం బీజేపీ మహిళా మోర్చ భారీ ధర్నా అట్టుడికిపోయింది. జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ) మాజీ ప్రొఫెసర్, ఇన్నర్ మణిపూర్ కాంగ్రెస్ లోక్‌సభ ఎంపీ అంగోమ్‌చా బిమల్ అకోయిజాం లైంగిక వేధింపులకు పాల్పడినట్టు యూనివర్సిటీ కమిటీ నిర్ధారించింది. వైవా పరీక్షలు, అకడమిక్ మార్కుల ప్రయోజనాల నెపంతో విద్యార్థినులను లైంగిక కోరికలు తీర్చాలని ఒత్తిడి చేశారని, క్యాంపస్‌లోని తన నివాసానికి పిలిపించుకుని అనుచితంగా ప్రవర్తించారని ఆరోపిస్తూ దాదాపు 11 మంది విద్యార్థినులు యూనివర్సిటీ యాజమాన్యానికి ఫిర్యాదు చేశారు. దీనిపై జేఎన్‌యూ అంతర్గత కమిటీ సమగ్ర విచారణ జరిపి, ఆయన దోషిగా తేలడంతో ప్రొఫెసర్ పదవి నుంచి తక్షణమే తొలగిస్తూ (డిస్మిస్) ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నివేదిక ఆధారంగా జేఎన్‌యూ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ ఇచ్చిన ఫిర్యాదుతో ఢిల్లీలోని వసంత్ కుంజ్ నార్త్ పోలీస్ స్టేషన్‌లో భారతీయ న్యాయ సంహిత సంబంధిత సెక్షన్ల కింద ఆయనపై ఎఫ్ఐఆర్ కూడానమోదైంది. మరోవైపు విద్యార్థినులను మోసపూరితంగా వేధించిన ఎంపీబిమల్‌ను తక్షణమే అరెస్ట్ చేయాలని,కాంగ్రెస్ పార్టీ నుంచి శాశ్వతంగా బహిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ సహా వివిధ విద్యార్థి సంఘాలు, బీజేపీ శ్రేణులు ఢిల్లీతో పాటు దేశవ్యాప్తంగా భారీ ఎత్తున నిరసన ప్రదర్శనలు చేపట్టాయి. విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చేలా వ్యవహరించిన ప్రజాప్రతినిధికి కాంగ్రెస్ అధిష్ఠానం రక్షణ కల్పించే ప్రయత్నం చేస్తోందని మహిళా మోర్చా నేతలు మండిపడ్డారు. ఢిల్లీ నగరంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన బీజేపీ మహిళా ఎంపీలు, ఇతర నేతలు కాంగ్రెస్ తీరుపై విమర్శలు చేశారు. దీంతో ఆ ప్రాంతం మొత్తం ఉద్రిక్తంగా మారింది.

ఎల్ నినో పేరుతో ప్రభుత్వం కాలక్షేపం

రైతులకు ప్రత్యామ్నాయ ఉపాధి ఏదని ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హరీష్ రావు

మంత్రుల సమావేశం రద్దుపై తీవ్ర ఆగ్రహం



హైదరాబాద్,అక్టోబర్,12:రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావం తీవ్రంగా ఉన్నప్పటికీ ప్రభుత్వం కనీస స్పందన లేకుండా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రభుత్వ వైఖరిని ఎండగడుతూ ఆయన మీడియాతో మాట్లాడుతూ రైతుల జీవితాలతో పాలకులు చెలగాటమాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల ద్వారా రైతు వేదికల వద్దకు రావాలని ఉదయం సమాచారం పంపి, మళ్లీ చివరి నిమిషంలో దాన్ని రద్దు చేయడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న అత్యంత గంభీరమైన సమస్యపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి కొరవడిందని ఆరోపించారు. తొమ్మిది నెలల క్రితమే శాస్త్రవేత్తలు , కేంద్ర ప్రభుత్వం ఎల్ నినో ముప్పుపై రాష్ట్రాన్ని అప్రమత్తం చేసినప్పటికీ, నాప ప్రభుత్వం పట్టించుకోలేదని హరీష్ రావు విమర్శించారు. అప్పుడు ఎలాంటి చర్యలు తీసుకోని పాలకులు, ఇప్పుడు మాత్రం ఉచిత సలహాలు ఇస్తున్నారని ఎద్దేవా చేశారు.

పంటలు వేయవద్దని చెబుతున్న ప్రభుత్వం, మరి ఆ రైతుల, రైతు కూలీల బతుకుల మాటేమిటని నిలదీశారు. కూలీలకు ఉపాధి కల్పించకుండా, ప్రత్యామ్నాయఏర్పాట్లు చేయకుండా చేతులు దులుపుకుంటున్నారని విమర్శించారు. గత బీఆర్ఎస్ హయాంలో అద్భుతమైన సంక్షేమ చర్యల వల్ల వలసలు పూర్తిగా నిలిచిపోయి ప్రజలు ఊర్లలోనే ఉన్నారని, కానీ నేడు కాంగ్రెస్‌పాలనలో మళ్లీ వలసల గోస మొదలైందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో తాగు,సాగు నీటి సమస్యపై చర్చించాల్సిన మంత్రుల సమావేశాన్ని అర్ధాంతరంగా రద్దు చేసి పాలకులు దిల్లీ ప్రయాణాలు పెట్టుకోవడం సిగ్గుచేటని హరీష్ రావు దుయ్యబట్టారు. రాష్ట్రంలో ప్రతి వైఫల్యానికి ఎల్ నినోతో లింక్ పెట్టి తప్పించుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. చివరికి బొగ్గు కొరతను కూడా ఎల్ నినో ఖాతాలోనే వేస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే రాష్ట్రం నేడు ఈ దుస్థితిని ఎదుర్కొంటోందని విమర్శించారు. తెలంగాణ హక్కులను గాలికొదిలి, కృష్ణా జలాలను ఆంధ్రప్రదేశ్ వైపు తరలించుకుపోతున్నా ఇక్కడి ప్రభుత్వం చూస్తూ ఊరుకుంటోందని, చివరికి కుప్పం వరకు నీళ్లు తీసుకెళ్తున్నా పట్టించుకోవడం లేదని హరీష్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

సర్కార్ పై కోర్టు దిక్కరణ పిటిషన్ కు సిద్ధమవుతున్న సోమయ్య..



డీకే చాటింపు ప్రతినిధి, (హైదరాబాద్):

రాష్ట్ర ప్రభుత్వంపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకునేందుకు పిటిషనర్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య సిద్ధమవుతున్నారు. మీడియా అక్రెడిటేషన్ కమిటీలలో టీడబ్ల్యూజేఎఫ్ యూనియన్‌కు ప్రాతినిధ్యం ఇవ్వాలని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం జారీ చేసిన కీలక ఉత్తర్వుల గడువు ముగిసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వంఈ ఉత్తర్వులను అమలు చేయకపోవడం పై పిటీషనర్ మామిడి సోమయ్య తీవ్ర ఆవేదన చెందుతూ, ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పులను, ఆదేశాలను నిర్ణీత కాలంలోగా అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగానికి ఉంటుంది. ఒకవేళ ఆ నిబంధనలను పాటించకపోతే, దానిని న్యాయవ్యవస్థను ధిక్కరించినట్లు భావిస్తూ ‘కోర్టు ధిక్కరణ చట్టం,1971 (జశీఅ్‌వఎజూ్ శీట జశీబతీం్ూష్, 1971) కింద తగినచర్యల కోసం బాధితులు కోర్టును ఆశ్రయించవచ్చు.

రాష్ట్ర, జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీలలో తమ టీడబ్ల్యూజేఎఫ్ సంఘానికి ప్రాతినిధ్యం ఇవ్వకపోవడాన్ని సవాలు చేస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. కేసును విచారించిన హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని టీడబ్ల్యూజేఎఫ్ కు అన్ని జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీ (డీఎంఏసీ)లలో ప్రాతినిధ్యం ఇవ్వాలని గత ఆగస్టు 3న హైకోర్టు ఆదేశించింది.

ఈ ఆదేశాలను ఆరు వారాల్లోగా అమలు చేయాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది.కోర్టు ఆదేశాల అమలు గడువు ముగిసినా ఆదేశాలను అమలు చేయకుండా సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీంతో పిటీషనర్ మామిడి సోమయ్య తిరిగి హైకోర్టును ఆశ్రయించి రాష్ట్ర ప్రభుత్వంపై కోర్టు ధిక్కరణ కేసు వేయ డానికి సిద్ధమవుతున్నారు.ఇటీవలి కాలంలో వివిధ ప్రభుత్వ విభాగాలు న్యాయస్థానాల ఆదేశాలను నిర్లక్ష్యం చేయడంపై హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. ఈ నేపథ్యంలోనే, తమకు అను కూలంగా వచ్చిన తీర్పుపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోక పోవడంతో, బాధ్యులైన ఉన్నతాధికారులపై కోర్టు ధిక్కరణ కేసు దాఖలు చేసేందుకు పిటిషనర్ మామిడి సోమయ్య తరపు న్యాయవా దులు ముసాయిదా సిద్ధం చేస్తున్నట్టు సమాచారం.

విద్యావంతుల మౌనం సమాజానికి చేటు

- భారాస ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్



డీకే చాటింపు ప్రతినిధి, (హైదరాబాద్): యువతే మార్పుకు పునాదని విద్యావంతుల మౌనం సమాజానికి చేటని భారాస ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ స్పష్టం చేశారు. చదువుకున్నవారి నిర్లిప్తతతోనే అనర్హులు అందలమెక్కుతున్నారని ఆయన అన్నారు.కాంగ్రెస్ మార్క్ పాలనపై పట్టభద్రుల తిరుగుబాటుకు వేళైందన్నారు.కేటీఆర్ దార్శనికతతో హైదరాబాద్‌కు భారీ పెట్టుబడులు వచ్చాయని దాసోజు ప్రస్తావించారు,20 లక్షల ప్రైవేట్ ఉద్యోగాలు రేవంత్ రెడ్డి చేతగానితనంతో హైదరాబాద్ ఖ్యాతి నాశనమైందని ఆయన ఆరోపించారు.అర్హులైన ప్రతి పట్టభద్రుడు దరఖాస్తు–18 ద్వారా ఓటు నమోదు చేసుకోవాలన్నారు. హైదరాబాద్ – మహబూబ్ నగర్ – రంగారెడ్డి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సమీక్షలో దాసోజు శ్రవణ్ పిలుపునిచ్చారు.చరిత్రలో ఏ గొప్ప ఉద్యమమైనా,ఏ విప్లవాత్మక మార్పు అయినా యువత భాగస్వామ్యంతోనే సాధ్యపడిందని,సమాజంలో ప్రతి మార్పునకు యువకులే అసలైన పునాదని అని శ్రవణ్ స్పష్టం చేశారు.రాబోయే హైదరాబాద్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పట్టభద్రుల ఓటు నమోదు, గెలుపు వ్యూహాలపై ఖైరతాబాద్ నియోజకవర్గం సోమాజిగూడ విభాగం మాజీ కార్పొరేటర్ మహేష్ యాదవ్, బీఆర్ఎస్వీ నాయకుడు మధుకర్ యాదవ్ ఆధ్వర్యంలో పట్టభద్రులతో ప్రత్యేక సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన దాసోజు శ్రవణ్ ఓటు హక్కు ప్రాధాన్యత, ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై దిశానిర్దేశం చేశారు.సమావేశంలో సోమాజిగూడ, ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, నియోజకవర్గ పరిధిలోని పెద్ద సంఖ్యలో పట్టభద్రులు, యువకులు పాల్గొన్నారు.

ఒమన్ తీరంలో ట్యాంకర్‌పై డ్రోన్ దాడి.. ఇద్దరు భారత నావికుల గల్లంతు



ఒమన్ తీరంలోని సోహార్ యాంకరేజ్ వద్ద ఒక పెట్రో ట్యాంకర్‌పై డ్రోన్ దాడి జరిగింది. నిన్న చోటుచేసుకున్న ఈ ఘటనలో ఇద్దరు భారతీయ నావికులు గల్లంతయ్యారు. ఇద్దరి కోసం స్థానిక కోస్ట్ గార్డ్ బృందాలు గాలింపు చర్యలను ముమ్మరం చేశాయి.పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని ఆయన తెలిపారు. మస్కట్‌లోని భారత రాయబార కార్యాలయం కూడా స్థానిక అధికారులతో సంప్రదింపులు జరుపుతూ, సహాయక చర్యలను నిశితంగా పర్యవేక్షిస్తోందని ఆయన వెల్లడించారు.

కార్మిక చట్టాలను,హక్కులను ఏకపక్ష నిర్ణయాలతో కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్న ప్రభుత్వాలు..



బెల్లంపల్లి (డీకే చాటింపు) కార్మిక చట్టాలను మానవ హక్కులను చివరికి ప్రపంచ ఆరోగ్య సూత్రాలను అమలు పరచకుండా ఏకపక్ష నిర్ణయాలతో కార్మిక వర్గాన్ని మానసిక శోభకు గురిచేయడం శోచనీయం ఏఐటీయూసీ కేంద్ర ఉపాధ్యక్షులు మిట్టపల్లి వెంకటస్వామి అన్నారు. సోమవారం శాంతిఖని మైన్ లో గేట్ మీటింగ్ కి ముఖ్యఅతిథిగా సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ మిట్టపల్లి వెంకటస్వామి, విచ్చేసి తెలంగాణ రాష్ట్రంలో జరిగిన ఆర్టీసీ గుర్తింపు ఎన్నికల్లో దోపిడి వర్గ ప్రభుత్వాలకు కార్మిక వర్గ దృక్పథం తెలియని సంఘాలకు సంపూర్ణ రాజకీయ చైతన్యంతో ఆర్టీసీ కార్మికులు మద్యానికి, విచ్చలవిడి డబ్బుల పంపిణీ విధానాలను, పాలకుల మోసపూరిత విధానాలను గుర్తించిన కార్మిక వర్గం ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా ఎర్రజెండాను ఐక్య కూటమిని ఆదరించి 77 డిపోలలో ఆర్టీసీ కార్మికులు విజయ బావుటా ఎగిరివేయడం శుభ పరిణామంగా భావిస్తూ ఆర్టీసీ కార్మిక వర్గానికి సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ విప్లవ ధన్యవాదాలు తెలిపారు .ఈ నేపథ్యంలో సింగరేణి కంపెనీలో రాజకీయ జోక్యాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని కోరుచున్నాము. సింగరేణి లో కార్మికులను కట్టు బానిసల కంటే హీనంగా వ్యవహరిస్తున్న సింగరేణి యాజమాన్యం తమ తప్పుడు విధానాలను విరమించుకోవాలి. సింగరేణి కంపెనీకి రావలసిన బకాయిలు ట్రాన్స్కో జెన్కో నుండి ఇవ్వవలసిన 59 వేల కోట్లు బకాయిలను కంపెనీకి వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ 13వ తారీకు హైదరాబాదులో విద్యుత్ సంస్థల ముందు జరుగు మహా ధర్నాను జయప్రదం చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు.ఈ సందర్భంలోనే సింగరేణి సంస్థలో మెడికల్ బోర్డులో ప్రపంచ ఆరోగ్య సూత్రాలను పాటించకుండా సింగరేణి మెడికల్ గైడ్లైన్స్ ను అమలు చేయకుండా ఏ రకమైన ఉద్యోగానికి అర్హత లేని కార్మికులను కూడా ఫిట్ ఫర్ సేమ్ జాబు అంటూ వైద్య అధికారులు కార్మికులను, కార్మిక కుటుంబాలను మానసిక క్షోభ కు గురిచేయడాన్ని మానవ హక్కుల ఉల్లంఘన కిందికి వస్తుంది కాబట్టి యజమాన్యం మానవ దృక్పథంతో మెడికల్ చేసి కార్మిక కుటుంబాలలో ప్రతి ఒక్కరికి ఉద్యోగం ఇవ్వాలని సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేస్తున్నాం.అన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏఐ టి యుసి రత్నం ప్రవీణ్, ఫిట్ కార్యదర్శి. బ్రాంచ్ కార్యదర్శి మంతెన రమేష్, రత్నం ఐలయ్య, ఏఐటీయూసీ పట్టణ అధ్యక్షులు, దాడి రమేష్,సహయ కార్యదర్శి ,రామకృష్ణ, అంజత్ ఖాన్,రాజేశం,ఎస్కే మైన్ మైన్స్ కమిటీ సభ్యులు సేఫ్టీ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రూ.2 కోట్లతో బీరప్పగడ్డ గౌడ శ్మశాన వాటిక అభివృద్ధి నిధులను మంజూరుచేయించిన పరమేశ్వర్ రెడ్డి

ధన్యవాదాలు తెలిపిన ఉప్పల్ గౌడ సంఘం



మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా(డీకే చాటింపు): ఉప్పల్ బీరప్పగడ్డలోని గౌడ శ్మశాన వాటికను రూ.2 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి చెప్పారు. ఉప్పల్‌లోని గౌడ కులస్తులు, సంఘం ప్రతినిధులతో కలిసి ఆయన సోమవారం మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసీ) కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డిని కలిశారు. బీరప్పగడ్డలోని గౌడ శ్మశాన వాటిక అభివృద్ధికి నిధులను కేటాయించాలని కోరారు. దీంతో కమిషనర్ రూ.2 కోట్లను మంజూరు చేశారు. సకాలంలో టెండర్ ప్రక్రియను సైతం పూర్తి చేసి పనులను చేపట్టేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో కమిషనర్‌కు, పరమేశ్వర్ రెడ్డికి గౌడ సంఘం ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో ఇదే శ్మశాన వాటిక అభివృద్ధికి రూ.48 లక్షలు మంజూరు అయ్యాయని పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. అయినా పూర్తి స్థాయిలో అభివృద్ధి పనులకు నిధులు సరిపోయే అవకాశం లేదన్నారు. ఇదే విషయాన్ని ఎంఎంసీ కమీషనర్ దృష్టికి తీసుకెళ్లి మొత్తం రూ.2 కోట్లను మంజూరు చేయించినట్లు పరమేశ్వర్ రెడ్డి వెల్లడించారు.ఈ కార్యక్రమంలో బజారు జగన్నాథ్ గౌడ్, వర్కాల మదన్ గౌడ్, బజారు నవీన్ గౌడ్, బింగి జగదీష్ గౌడ్, బుత్కూరి మదన్ గౌడ్, బింగి బుచ్చి గౌడ్, వంశీ గౌడ్ పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

- రూ.5,420 నగదు,ఐదు సెల్‌ఫోన్లు,పెకముక్కలు స్వాధీనం.. - నారాయణపేట రూరల్ ఎస్సై సతీష్ రెడ్డి..



నారాయణపేట,(డీకే చాటింపు): నారాయణపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తిరుమలాపురం గ్రామంలో పేకాట నిర్వహిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు సోమవారం నారాయణపేట రూరల్ ఎస్సై ఎస్.సతీష్ రెడ్డి తన సిబ్బందితో కలిసి పేకాట శిబిరంపై దాడి నిర్వహించారు.ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను పోలీసులు గుర్తించి పట్టుకున్నారు.వారి వద్ద నుంచి పేకాటకు సంబంధించిన నగదు రూ. 5,420తో పాటు ఐదు సెల్‌ఫోన్లు,పెకముక్కలను స్వాధీనం చేసుకొని గేమింగ్ యాక్ట్ ప్రకారం ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.గ్రామాలు, పట్టణాల్లో చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.అసాంఘిక కార్యకలాపాలపై ప్రజలకు ఏవైనా సమాచారం తెలిస్తే వెంటనే లోకల్ పోలీసులకు తెలియజేయాలనీ కోరారు.

సరస్వతి నగర్ కు మంచినీటి సౌకర్యం కల్పించాలి

- కలెక్టర్ ప్రజావాణిలో సమస్యను విన్నవించిన కౌన్సిలర్,కాలనీవాసులు...



నారాయణపేట,(డీకే చాటింపు):

నారాయణపేట మున్సిపాలిటీలోని మూడో వార్డు సరస్వతి నగర్ కాలనీకి మంచినీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ ఆ వార్డు కౌన్సిలర్ కాకర్ల నారాయణమ్మ కాలనీ వాసులతో కలిసి సోమవారం జిల్లా కలెక్టరేట్ ప్రజావాణిలో ఓ వినతి పత్రాన్ని సమర్పించారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ కాకర్ల నారాయణమ్మ మాట్లాడుతూ గత 6నెలల నుంచి సరస్వతి నగర్ లో మంచినీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మంచినీటి సరఫరా చేసేందుకు కృషి చేయాలన్నారు.కాలనీలో 100 నుంచి 150 కుటుంబాలు ఉన్నాయని గత ఆరు నెలల ముందు కాలనీకి మిషన్ భగీరథ పైప్ లైన్ వేశారు.భగీరథ పైప్ లైన్ లో మంచినీటి రావడంలేదని ఆమె తెలిపారు.సరస్వతి నగర్లో నెలకొన్న నీటి సమస్యను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆమె కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు.

క్షీణించిన ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యం..!



పాకిస్తాన్‌లో పలు కేసుల్లో జైలులో ఉంటున్న ఆ దేశ మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యం క్షీణించింది. దీంతో ఆందోళన వ్యక్తం చేస్తూ ఆయన కుటుంబ సభ్యులు సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో ఇమ్రాన్‌ను తక్షణమే ఆసుపత్రికి తరలించి చికిత్స అందించాలని ధర్మాసనం మంగళవారం నాడు ఆదేశాలు జారీ చేసింది. 48 గంటల్లోగా ఇమ్రాన్‌ను షిఫా ఇంటర్నేషనల్ ఆస్పత్రికి తరలించాలని కోర్టు ఆదేశించింది. సెప్టెంబరు 16 వరకు అక్కడే వుంచాలని పేర్కొంది. ఈ మేరకు ఇమ్రాన్ ప్రతినిధి నయీమ్ హైదర్ ఎక్స్ పోస్టులో తెలిపారు. క్రికెట్ నుండి రాజకీయాలకు మళ్ళిన ఇమ్రాన్ (73) 2023 ఆగస్టు నుండి జైల్లోనే వున్నారు. పలు కేసుల్లో ఆయన దోషిగా తేలడంతో జైలు శిక్ష అనుభవిస్తున్నారు. 2022లో తాను పదవీచ్యుతుడైన తర్వాత రాజకీయ కక్ష సాధింపు చర్యలతో మోపిన కేసులని ఆయన వాదిస్తున్నారు. కాగా గతేడాది కాలంగా తమ తండ్రి ఆరోగ్యం క్షీణిస్తోందని ఆయన కుమారులు ఆందోళన వ్యక్తం చేస్తూనే వున్నారు. జైల్లో వుండగా ఆయన కుడి కంటి చూపు పోయిందని లాయర్లు కూడా చెబుతున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా పాక్ సుప్రీం కోర్టు జారీ చేసిన ఆదేశాలు స్వాగతించదగ్గవని పాకిస్తాన్ తెహ్రీక్ ఇ ఇన్సాఫ్ (పిటిఐ) ప్రతినిధి జుల్ఫీకర్ బుఖారి చెప్పారు. ఇది ముందే జరిగి వుంటే ఇంతలా ఆరోగ్యం దిగజారి వుండేది కాదని వ్యాఖ్యానించారు.

పూజిత ఎన్మేవ్ లో అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు







నిజామాబాద్ ప్రతినిధి అక్టోబర్ 12 (డీకే చాటింపు): నిజాంపేట్ పరిధి బాచుపల్లి పూజిత ఎన్మేవ్ లో ఆదివారం బతుకమ్మ పండుగ ఘనంగ నిర్వహించరు. పూజిత బతుకమ్మ కమిటీ,పూజిత ఎన్మేవ్ వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన సంబరాలలో కాలనీ మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.వివిధ రకాల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించారు. గత కొన్ని సంవత్సరాలుగా పూజిత ఎన్మేవ్ బతుకమ్మ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బతుకమ్మ సంబరాలు బాచుపల్లిలో ప్రత్యేక గుర్తింపు పొందుతూ, మారుమోగుతున్నాయి. ఈ సంవత్సరం కూడా మన ఆడబిడ్డల నమ్మకాన్ని వమ్ము చేయకుండా, వారి ఆశలు మరియు ఆకాంక్షలకు అనుగుణంగా బతుకమ్మ సంబరాలను విజయవంతంగా నిర్వహించి, బతుకమ్మ కమిటీ తన బాధ్యతను మరోసారి నిరూపించుకుంది. ఈ వేడుకలపై నమ్మకం ఉంచి, ప్రతి ఒక్కరూ భాగస్వాములై సంబరాలను విజయవంతం చేసిన పూజిత ఎన్మేవ్ నివాసితులందరికీ కమిటీ వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలియారు. బతుకమ్మలను ఎంతో అందంగా అలంకరించి, మన సంస్కృతి సంప్రదాయాలకు మరింత శోభను తీసుకొచ్చిన ప్రతి ఆడపడుచుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ వేడుకల నిర్వహణకు సహకరించిన రోడ్-1లోని ప్రతి అపార్ట్‌మెంట్ నివాసితులకు, అలాగే కాలనీలోని ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు. చిన్నా పెద్దా, ఆడా మగా అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ నిన్నటి బతుకమ్మ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొని, ఆనందంగా గడిపి, అనంతరం బతుకమ్మ కమిటీ ఏర్పాటు చేసిన విందును స్వీకరించడం ఎంతో సంతోషాన్ని ఇచ్చింది. అందరి సహకారం, ఆదరణ, నమ్మకమే కమిటీకి నిజమైన బలంఅని అభివర్ణించారు. మన సంస్కృతి మన గౌరవం... మన బతుకమ్మ మన ఆత్మగౌరవం! బతుకమ్మ సంబరాలు -- ఐక్యతకు నిలువెత్తు సాక్ష్యం అని కొనియాడారు. ఒక పండుగను నిర్వహించడం మాత్రమే కాదు, వివిధ ప్రాంతాలకు చెందిన కుటుంబాలందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి, అందరిలోనూ ఐక్యతా భావాన్ని నింపిన అద్భుతమైన వేడుక ఇది. సుమారు 500 మంది పాల్గొన్న నిన్నటి కార్యక్రమం ఒక్కటే ఒక గొప్ప సందేశాన్ని ఇచ్చింది --- మన ప్రాంతాలు వేరైనా, మనమంతా ఒక్కటే మన మధ్య ప్రాంతాల పేరుతో ఎలాంటి విభజనలు లేవని, మన సంప్రదాయాలు, సంస్కృతి, ఆత్మీయత మనందరినీ ఒకే కుటుంబంగా కలుపుతాయని ఈ వేడుకలు మరోసారినిరూపించాయి.అందరినీ కలిపిన ఆటపాటలు, ఉత్సాహ భరితమైన సంబరాలు,ప్రతి ఒక్కరికీ ఆత్మీయ ఆతిథ్యం, భోజన ఏర్పాట్లు ఘనంగా ఉన్నాయ న్నారు.ఒక కార్యక్రమం విజయవంతం కావాలంటే ప్రణాళిక అవసరం... కానీ అనుకోకుండా పెరిగిన బాధ్యతలను కూడా చిరునవ్వుతో స్వీకరించి, వచ్చిన ప్రతి ఒక్కరికీ ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలంటే గొప్ప సమన్వయం అవసరం. ఆ విషయంలో మన బతుకమ్మ కమిటీ సభ్యులు తమ అంకితభావాన్ని చాటుకున్నారు అని కొనియాడార్కూజుఔూ కుటుంబ ఐక్యతకు, మన సంస్కృతిపై మనకున్న ప్రేమకు, ఒకరికొకరం తోడుగా నిలిచే మన ఆత్మీయతకు నిలువెత్తు సాక్ష్యం!ఇలాంటి వేడుకలు మరెన్నో జరగాలని, మనమంతా ఇదే ఐక్యతతో, ప్రేమతో, పరస్పర సహకారంతో ముందుకు సాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని అన్నారు.

హోరాహోరీగా కొనసాగుతున్న రెజ్లింగ్ పోటీలు

- ఉమ్మడి పది జిల్లాల నుంచి సుమారు 200 మంది క్రీడాకారులు హాజరు...

-కానుకుర్తి గ్రామంలో 70వ ఎస్ జి ఎఫ్ అండర్-14 రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలు...









నారాయణపేట,(డీకే చాటింపు): దామరగిద్ద మండలం కానుకుర్తి గ్రామంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత రెండు రోజులుగా కొనసాగుతున్న 70వ ఎస్ జి ఎఫ్ అండర్-14 రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలు నువ్వానేనా అన్నట్లు కొనసాగుతున్నాయి.అన్ని జట్ల నుంచి వచ్చిన క్రీడాకారులు అద్భుతమైన ఆటతీరును ప్రదర్శించారు. రాష్ట్రంలోని ఉమ్మడి పది జిల్లాల నుండి సుమారు 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారని నిర్వాహకులు తెలిపారు.బరువు ఆదరితంగా జరిగే ఈ పోటీలు ఆ కేటగిరీలో సెలెక్ట్ అయిన క్రీడాకారులు ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీలో పాల్గొంటారని,కుస్తీ పోటీలు మన పురాణాల కాలం నుంచి మన చరిత్రలో ఒక భాగం అని ఎస్ జి ఎఫ్ నారాయణపేట జిల్లా సెక్రెటరీ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి వెంకటేష్ శెట్టి,జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షులు నర్సిములు,కార్యదర్శి రవికుమార్,ఆర్గనైజింగ్ సెక్రెటరీ రామకృష్ణ రెడ్డి, మెంబర్ సాయినాథ్,కోచ్ శ్రీనివాస్,వ్యాయమ ఉపాధ్యాయులు వెంకటప్ప, బాలరాజు,రాజశేఖర్, నర్సింహా రెడ్డి,బస్వరాజు, బీరప్ప,శశికాంత్ రెడ్డి,రాజేష్, రమేష్ పాల్గొన్నారు.ఈ కుస్తీ పోటీలను తిలకించడానికి కానుకుర్తి గ్రామ పెద్దలు యువత పెద్దఎత్తున తరలివచ్చారు.

సరస్వతి నగర్ కు మంచినీటి సౌకర్యం కల్పించాలి

- కలెక్టర్ ప్రజావాణిలో సమస్యను విన్నవించిన కౌన్సిలర్,కాలనీవాసులు



నారాయణపేట,(డీకే చాటింపు): నారాయణపేట మున్సిపాలిటీలోని మూడో వార్డు సరస్వతి నగర్ కాలనీకి మంచినీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ ఆ వార్డు కౌన్సిలర్ కాకర్ల నారాయణమ్మ కాలనీ వాసులతో కలిసి సోమవారం జిల్లా కలెక్టరేట్ ప్రజావాణిలో ఓ వినతి పత్రాన్ని సమర్పించారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ కాకర్ల నారాయణమ్మ మాట్లాడుతూ గత 6నెలల నుంచి సరస్వతి నగర్ లో మంచినీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మంచినీటి సరఫరా చేసేందుకు కృషి చేయాలన్నారు.కాలనీలో 100 నుంచి 150 కుటుంబాలు ఉన్నాయని గత ఆరు నెలల ముందు కాలనీకి మిషన్ భగీరథ పైప్ లైన్ వేశారు.భగీరథ పైప్ లైన్ లో మంచినీటి రావడంలేదని ఆమె తెలిపారు.సరస్వతి నగర్లో నెలకొన్న నీటి సమస్యను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆమె కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు.

డీకే చాటింపు
తెలంగాణ దిన పత్రిక
మంగళవారం,అక్టోబర్,13, 2026

ఇది ఉద్వేగం కాదు..
మనిషిలో దాగిన క్రూరత్వం!

చిన్నారులపై జరుగుతున్న లైంగిక దాడులు, హత్యలు కేవలం చట్టపరమైన సమస్యలు మాత్రమే కావు. ఈ నేరాల వెనుక దాగి ఉన్న క్రూర మనస్తత్వం, సామాజిక వైఫల్యాలు, నైతిక సంక్షోభం గురించి విశ్లేషించే కథనం. చిన్నారులపై జరుగుతున్న అత్యాచారాలు, వాటి తర్వాత వెలుగులోకి వస్తున్న అమానుష హింస, హత్యలు సమాజాన్ని కుదిపేస్తూనే ఉన్నాయి. ప్రతి సంఘటన తర్వాత ఒకే రకమైన ఆవేదన వ్యక్తమవుతోంది. కొవ్వొత్తుల ర్యాలీలు జరుగుతున్నాయి. న్యాయం కోసం నినాదాలు వినిపిస్తున్నాయి. కఠిన శిక్షల కోసం డిమాండ్లు పెరుగుతున్నాయి. కానీ ఈ ఆగ్రహం, దుఃఖం , ఆందోళనలు, మానసిక సంఘర్షణలు అసలు మూలాన్ని వెతకడంలో అలసిపోతున్నాయి . ఇలాంటి నేరాలకు పాల్పడే వ్యక్తుల మానసిక ప్రవృత్తి ఏమిటి? అది ఒక్క క్షణపు ఉద్వేగమా? లేక వారి వ్యక్తిత్వంలోనే దాగి ఉన్న ఏదైనా చీకటా? లేదా వారి జీవితం, వారి స్వతఃసిద్ధ మానసిక కోణం ఇలాంటప్పుడే బయటపడుతోందా!? ఇన్నాళ్లు మనం దానిని ఇగ్నోర్ చేశామా? ఇవే ఆ మూలాలు.. ఇలాంటి నేరాలు జరగగానే ఆ క్రూరుడిని ఒక గాటన కట్టేస్తాం “అదుపు తప్పిన కోరిక”, “క్షణిక ఉద్వేగం”, “ఆవేశం” వంటి అనేక పొరల మాటున అతను చేసిన గాయాన్ని మర్చిపోతున్నాం. కానీ వయసుతో సంబంధం లేకుండా, పరిస్థితుల అంశం లేస్యమాత్రమైనా లేకుండా చిన్నారులపై, మహిళలపై, జరిగే అత్యాచారాలను, వాటి తర్వాత జరిగే హత్యలను పరిశీలించినప్పుడు ఇవన్నీ అసంపూర్ణాలు కదా!. అవును ఒకవేళ అది నిజంగానే ఒక్క క్షణపు ఉద్వేగమే అయితే, ఆ దారుణ కృత్యానికి ముందూ, వెనుకా కనిపించే పాశవిక హింస సంగతి ఏమిటి? చిన్నారి భయాన్ని చూస్తూ, చిన్నారి లేదా ఆమె అసహాయతను గమనిస్తూ, ఆ బాధను గ్రహిస్తూ కూడా తనను తాను మనిషిగా మరచిపోయి మృగత్వాన్ని కొనసాగించడం ఏ రకపు ఉద్వేగం? తన తనకాలమాన పరిస్థితులు, తన సోషల్ స్టేటస్, అందులో తాను అప్పటివరకూ పొందిన పేరు అన్నీ వదిలేసి కేవలం తన పశుత్వాన్ని మాత్రమే తాను నిరూపించుకోవడానికి సిద్ధపడటం ఏమిటి !

పోనీ నేరం జరిగిన తర్వాత అయినా తనను తాను గుర్తిస్తున్నారా? హత్యలకూ దిగుతున్నారు అదీ అత్యంత కర్కశంగా.. ఎవిడెన్స్‌ను చెరిపేయడానికి తొక్కకూడని దారులు తొక్కుతూ ఒక తప్పుకు వంద తప్పులు చేస్తూ పోతున్నారు? బయటపడతాననే భయంతో బాధితులకు ఇంకా ఇంకా నరకం చూపెడుతున్నారు. అసలిక్కడి వాస్తవం క్షణిక ఉద్వేగం కాదు. అతని లోపలి ఎన్నో రోజుల క్రూరత్వం. ఒక చిన్నారి కన్నీళ్ల కంటే తన కోరిక పెద్దదిగా కనిపిస్తోంది, ఒక చిన్నారి ప్రాణం కంటే తన రక్షణ ముఖ్యమైపోతోంది, ఎదుటివారి బాధను గుర్తించలేని నైతిక పతనం ఇది. ఒక మనిషి మరొక మనిషిని మనిషిగా చూడలేని స్థితి ఇది. సైకాలజీ దీనిని మానవత్వాన్ని హరించడంగా నిర్వచిస్తుంది. అంటే ఎదుటివారి వ్యక్తిత్వం, హక్కులు, బాధ అన్నీ అదృశ్యమై, అతను లేదా ఆమె కేవలం ఒక వస్తువుగా మారిపోవడం, తన ఆనందం, తన మానసిక వికారం తీర్చుకోవడానికి వారు ఒక ఆటబొమ్మగా వీరి దృష్టికి కనిపించడం. పోనీ ఇది క్షణకాలపు ఉద్వేగం కాదు, ఇది వారి వ్యక్తిత్వంలో భాగమే అనుకుంటే, అటువంటి వ్యక్తులను మనం ఎలా గుర్తించాలి? ఎవరిని నమ్మాలి? ఎవరిని అనుమానించాలి? ఇలాంటి నేరాలు చేసే వారు మనకేం రాక్షసుల్లా కనిపించరు. వారి ముఖాలపై క్రూరత్వం రాసి ఉండదు. వారు కుటుంబ సభ్యులుగా, బంధువులుగా, పొరుగువారిగా, సహోద్యోగులుగా, కొన్నిసార్లు సమాజంలో అత్యంత గౌరవనీయులుగా కూడా ఉంటారు.”అతను అలాంటి వాడని అనుకోలేదు.” అనేంత మంచివాడిగా మన మధ్య తిరుగుతూ మనతోనే జీవిస్తుంటారు. ఇదే ఇప్పటి సమాజం ఎదుర్కొంటున్న అసలైన సవాలు, ఒకానొక చీకటిని గురించిన భయం. ఇది కేవలం ఒక వ్యక్తి సమస్య కాదు.



ఆచార్య జయశంకర్ ప్రతిభా పురస్కారాల ప్రదానం

ప్రతిభావంతులైన విద్యార్థులు, ఉత్తమ ఉద్యోగులకు ఘన సత్కారం



కరీంనగర్, అక్టోబర్ 11: (డికె చాటింపు) విశ్వకర్మ (విశ్వబ్రాహ్మణ) ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్, కరీంనగర్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కళాభారతి వేదికగా ఆచార్య జయశంకర్ ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్య,ఉద్యోగ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన వారిని ప్రోత్సహించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఎస్ఎస్సీ, ఇంటర్మీడియట్, డిగ్రీ, ఇంజనీరింగ్, ఐఐటీ, నీట్ తదితర పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో పాటు పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, ఉత్తమ ఉద్యోగులు, పదోన్నతులు పొందిన ఉద్యోగులను ఏడు విభాగాల్లో ఎంపిక చేసి సత్కరించారు. దాదాపు 100 మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు నగదు పురస్కారాలతో పాటు అసోసియేషన్ రూపొందించిన ప్రశంసాపత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, వేవా రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్ చారి హాజరయ్యారు. అలాగే జిల్లా నాయకులు కట్ట రవీంద్రాచారి, గద్దె జగదీశ్వర్ చారి, కనపర్తి దివాకర్, వెలిచాల వెంకటస్వామి, , కార్యదర్శి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ వేడుకకు సుమారు వెయ్యి మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉద్యోగులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారని నిర్వాహకులు తెంపారు.

సమాజాభివృద్ధిలో పద్మశాలి ల పాత్ర అమోఘం

కామారెడ్డి జిల్లా పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు బోడ సాయిలు



నిజామాబాద్ ప్రతినిధి అక్టోబర్ 12 (డీకే చాటింపు): కామారెడ్డి జిల్లా పద్మశాలి సంఘం ఎన్నికలు తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షులు వాళ్లకాటి రాజకుమార్ ఆధ్వర్యంలో జరిపారు.జిల్లా అధ్యక్షులుగా సిరిగధ లక్ష్మినరసింహులు ఉపాధ్యక్షులుగా కౌలాస్ గ్రామ వాసి బోడ సాయిలు ప్రమాణ స్వీకారం చేశారు. ఆదివారం కామారెడ్డి జిల్లా కేంద్రం లో జరిగిన కార్యక్రమం లో కార్యదర్శిగా మెరిగే దత్తాత్రి ,కోశాధికారి సబ్బాని ధర్మపురి మరియు కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. జుక్కల్ నియోజకవర్గం లో పద్మశాలి సమాజం లో చురుకైనా పాత్ర పోషిస్తూ మార్కండేయ మందిరాల నిర్మాణానికి కృషి చేస్తున్న బోడ సాయిలు సేవలను గుర్తించి ఆయన్ను జిల్లా ఉపాధ్యక్షులు గా ఎంపికచేయడం పట్ల జుక్కల్ వాసులు హర్షం వ్యక్తం చేశారు.తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షులు వాళ్లకాటి రాజకుమార్ మాట్లాడుతూ మార్కండేయ మందిరాలు ఏర్పాటులో కృషి చేస్తున్న సాయిలు ను అభినందించారు.జిల్లా అధ్యక్షులు సిరిగధ లక్ష్మి నరసింలు మాట్లాడుతూ పద్మశాలిల అభివృద్ధికి కృషి చేస్తామని,ప్రభుత్వ పరంగా నిధులు రాబట్టడానికి కృషి చేస్తామని సమావేశంలో అన్నారు. కార్యక్రమం లో జుక్కల్ పద్మశాలి సంఘం నాయకులు దోమల అశోక్, దోమల నాగనాథ్, సుభాష్, దుర్మవర్ హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.

బంగారు మైసమ్మ ఆలయంలో దుర్గామాత

నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే గడ్డం వినోద్...



బెల్లంపల్లి (డీకే చాటింపు)పట్టణంలోని కన్నాల హైవే వద్ద ఉన్న శ్రీ బంగారు మైసమ్మ ఆలయంలో దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆలయానికి విచ్చేసి దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ రత్నం సుకుమారి, బెల్లంపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు బండి ప్రభాకర్, మాజీ మున్సిపల్ చైర్మన్ మత్తమారి సూరిబాబు,మాజీ పట్టణ అధ్యక్షులు ముచ్చర్ల మల్లయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నర్సింగ రావు,ఆలయ కమిటీ అధ్యక్షులు గెల్లి రాజలింగు, ఆలయ కోశాధికారులు అనుముల సత్యనారాయణ, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కనిగంటి కుమారస్వామి,ఆలయ కమిటీ సభ్యులు మెరుగు రమేష్, రాకేష్, కాంగ్రెస్ యువ నాయకులు రత్నం ప్రదీప్, గెల్లి రామకాంత్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సేయింట్ అంటోనీస్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం..



బెల్లంపల్లి(డీకే చాటింపు) పట్టణం లోని సెయింట్ ఆంటోనీస్ హైస్కూల్‌కు చెందిన 2004-2005 బ్యాచ్ పూర్వ విద్యార్థులు 21 ఏళ్ల తర్వాత ఒక్కటయ్యారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి సుమారు 40 మంది మిత్రులు హాజరుకాగా, నాటి స్కూల్ రోజులు, పాత జ్ఞాపకాలనునెమరువేసుకుంటూ గడిపిన క్షణాలు అందరిలోనూ ఉద్వేగాన్ని నింపాయి. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఈ సందర్భంగా వారు ఘనంగా సత్కరించి,జ్ఞాపికలను అందించారు. అలాగే పూర్వ విద్యార్థులందరూ కలిసి స్కూల్‌ను సందర్శించి నాటి మధుర క్షణాలను గుర్తుచేసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఆనాటి ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు

రబీ సీజన్‌లో ప్రభుత్వము రైతాంగాన్ని ఆదుకోవాలి

రైతాంగ సమస్యల పరిష్కారంకై జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం ఇచిన ఏఐకేఎంఐ జిల్లా అధ్యక్షులు వేల్పూరు భూమయ్య



నిజామాబాద్ ప్రతినిధి అక్టోబర్ 12(డీకే చాటింపు): రాష్ట్రమంతటా ఎల్నినో ప్రభావం వల్ల రైతులు వేసుకున్న పంటలు కొన్ని ప్రాంతాలలో ఎండిపోయినవి. మన జిల్లాలో అంత తీవ్రంగా లేకపోయినా చేతికి వస్తున్న పంటను కాపాడేందుకు నీళ్లందకా కరెంటు కోతల వల్ల రైతులు ఆందోళన చెందుతు న్నారని భూమయ్య అన్నారు. పగటిపూటనే 12 గంటల కరెంటును సప్లై చేయాలి . అవసరమైతే గుత్ప, ఆలీసాగర్, లిఫ్టుల ద్వారా నీటిన విడుదల చేయాలి అని ప్రజావాణి లో వినతి పత్రం ఇచ్చారు. రైతులకు ముందుగా అధికారులు చెప్పిన విధంగా రబి లో ఆరుతడు పంటలకు వెళ్లాలని అన్నారని ఇప్పుడేమో ప్రభుత్వం వద్దంటుంది అని వారు అన్నారు.కనీసం బోర్ల వద్ద, చెరువుల వద్ద, కొద్దిమేర కైనా ఆరుతడి పంటలకు అనుమతిని ఇవ్వాలని భూమయ్య అన్నారు మొక్కజొన్న, పొద్దు తిరుగుడు, నువ్వులు, పెసర, మినుములు, తదితర పంటలకు విత్తనాలు రాజ.రా రైతులకుఉచితంగా మిగిలిన రైతులకు 80 శాతం సబ్సిడీతో అందించాలి. చెరుకు పంట కూడా ఆరుతడి పంట అయినందున చీజూఖీ సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీని తెరిపించి రైతులకు చెరుకుపంటవైపుమళ్ళించాలి యంత్ర లక్ష్మీలో 80% సబ్సిడీలు యంత్రాలను రైతులకు అందించి వారిని సాగు వైపు ప్రోత్సహించాలి. పాత రుణాలు రీ షెడ్యూల్ చేసి కొత్తగా రైతులకు రుణాలు, ఎరువులు, విత్తనాలు, అందించాలి. పశుగ్రాసము కొరతను నివారించేందు కుగాను గడ్డి విత్తనాలను 80% సబ్సిడీతో రైతుకు అందించి పాడి పశువు లను కాపాడాలని పశువులను, గొర్రె మేకలను కాపాడాలి కోరారు.మధ్యలో ఆగిపోయిన మంచి 21వ ప్యాకేజీ పనులను తగిన నిధులు కేటాయించి సత్వరమే పనులను ప్రారంభించి పూర్తి చేయాలి ఈ ప్యాకేజీ కింద నిజాంబాద్ రూరల్ నియోజకవర్గం పరిధిలోని 7 మండలాలు 77 గ్రామాలలో తాండలకు కలిపి 84 వేల ఎకరాలకు పంట సాగుకు నీరు అందించవచ్చు అని అన్నారు .ఇప్పటికైనా ఎండిన పంటలు ఉంటే ఆ రైతు పంటను పరిశీలించి నష్టపరిహారం ఎకరానికి 35 వేల రూపాయలుఅందించాలి ఇప్పటికే రైతు చేతికి వచ్చిన ధాన్యం వడ్లను నిలువ చేసు కొనేందుకు గాను గోదాములను కేటాయించి అట్టి దాన్యంపై 80% రుణం అందించాలని అఖిలభారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ తరపున రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం అని అన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేశెట్టి సాయిరెడ్డి, కె. గోపాల్, అగ్గు చిన్నయ్య, రాపాని గంగాధర్, బి. సాయిలు, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయ నిర్మాణానికి 630 సిమెంటు బ్యాగులు విరాళం అందజేసిన వినయ్ కుమార్ రెడ్డి



ఆర్మూర్ విలేఖరి అక్టోబర్ 12 (డీకే చాటింపు) ఆర్మూర్ నియోజకవర్గ పరిధిలోని నందిపేట్ మండల కేంద్రంలో గల శ్రీ కేదార్ కేదారేశ్వర ఆలయ ఆశ్రమంలో అయ్యప్ప ఆలయాన్ని నిర్మిస్తున్న నేపథ్యంలో ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి నాయకులు వినయ్ కుమార్ రెడ్డి తన వంతు సహకారంగా ఆలయ నిర్మాణానికి 630 సిమెంటు బ్యాగులు ఆదివారం రోజున అందజేశారు సుమారు రెండు లక్షల పైచిలుకు చినుకు గల సిమెంట్ బస్తాలను వినయ్ కుమార్ రెడ్డి అందజేశారు అయ్యప్ప ఆలయ కమిటీ నిర్మాణ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. డొంకేశ్వర్ నందిపేట మండలాలకు చెందిన అయ్యప్ప స్వామి భక్తులు కూడా ధన్యవాదాలు తెలియజేశారు ఆలయ అభివృద్ధికి ఇలాంటి సహకారం అందించడం అభినందనీయమని శ్రీ మంగి రాములు మహారాజు గారు పేర్కొన్నారు

పెన్షన్ తొమ్మిది వేలకు పెంచాలి

మజ్దూర్ జనతా పార్టీ విజ్ఞప్తి



నిజామాబాద్ అక్టోబర్ 12 (డీకే చాటింపు): కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ ద్వారా కార్మికులకు నెల సర్వేన కార్మికులకు పెన్షన్ అమౌంట్ పెంచాలని మజ్దూర్ జనతా పార్టీ అధ్యక్షుడు రాపల్లి శ్రీనివాస్ కోరారు. బీడీ కార్మికులు రాజీనామా అనంతరం వారికి 6000 పెన్షన్ అందించాలని అలాగే దినసరి వేతనంపై ఔట్సోర్సింగ్ ద్వారా పనిచేస్తున్న కార్మికులకు 9000 పెన్షన్ అందించాలని ఈ మేరకు దేశ ప్రధాని రాష్ట్రపతి ఆర్థిక శాఖ మంత్రి కార్మిక శాఖ మంత్రి ఈపీఎఫ్ఓ పాలకవర్గానికి లేఖలు రాశారు. జీఎస్టీ ద్వారా కేంద్రానికి వస్తున్న నిధుల నుండి ఒక శాతం ఈ కార్మికులకు కేటాయించాలని విన్నవించారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఉద్యోగులకు 20వేల నుంచి లక్ష రూపాయల వరకు పెన్షన్ వస్తుందని మరి అదే పని చేస్తున్న దినసరి కార్మికుల పట్ల కూడా సానుభూతితో వ్యవహరించి పెన్షన్ మొత్తాన్ని పెంచాలని కోరారు. సోమవారం నుండి శుక్రవారం వరకు సోషల్ మీడియా ద్వారా కేంద్ర ప్రభుత్వానికి తెలియజేయాలని కార్మికులకు విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం ఈపీఎఫ్ఓలో పెన్షన్ పెంపుకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈపీఎస్ 1995 చట్టం మరియు 2026 చట్టం అనుసరించి సవరించాలని పేన్షన్ పెంచాలని కోరారు.

దుబాయ్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు..

నిజామాబాద్ ప్రతినిధి అక్టోబర్ 12(డికె చాటింపు): ఎమిరేట్స్ తెలంగాణ కల్చరల్ అసోసియేషన్ (జుజూ) ఆధ్వర్యంలో దుబాయ్‌లో నిర్వహించిన బతుకమ్మ సంబరాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని చాటిచెప్పాయి. ఈ వేడుకలకు తెలంగాణ నుంచి ప్రత్యేక అతిథిగా విచ్చేసిన నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్త మాజీ మంత్రి బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి , కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ,మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్ ,జీవన్ రెడ్డి ,షకీల్ ,ఎన్ఆర్ఐ గ్లోబల్ కోఆర్డినేటర్ మహేష్ బిగాల లను జుజూ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ వేడుకలకు వేలాదిగా తరలివచ్చిన తెలంగాణ మహిళలు, సోదర సోదరీమణులు బతుకమ్మ ఆటపాటలతో సందడి చేశారు. తెలంగాణ సంప్రదాయ పాటలతో పాటు “జై తెలంగాణ.. జై కేసీఆర్.. కారే రావాలి సారే రావాలి మళ్లీ” అంటూ నినాదాలు, పాటలతో వేడుకల ప్రాంగణం మార్మోగింది. దుబాయ్‌లో జరుగుతున్న ఈ సంబరాలను చూస్తుంటే తెలంగాణలోనే ఉన్నామా అన్న అనుభూతి కలిగిందని ఆనందం వ్యక్తం చేశారు. విదేశీ గడ్డపై ఉంటూ కూడా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ, భావితరాలకు వాటిని పరిచయం చేస్తున్న జుజూ ప్రతినిధులను, బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న తెలంగాణ ఆడపడుచులను, సోదర సోదరీమణులను బిగాల గణేశ్ గుప్త అభినందించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తూ, తెలంగాణ ఆడపడుచు లందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.





కల చెదిరింది..కథ ముగిసింది..!!

ఎన్నో ఆశలు..ఎన్నెన్నో కలలు..!!

-నారాయణపేట వ్యవసాయ మార్కెట్ కమిటీకి పర్సన్ ఇంచార్జి నియమాకం...
-పర్సన్ ఇన్చార్జిగా ఏడిఎం బాల మణెమ్మ...
-ఉత్తర్వులు జారీ... -కొత్త పాలకవర్గంపై నేతల ఆశలు...



PROCEEDINGS OF THE DIRECTOR OF AGRICULTURAL MARKETING
GOVERNMENT OF TELANGANA HYDERABAD.
Present:: Rahul Raj P.S., I.A.S.,

AGM/STRY/S-III/257144/2020 Date. 12--10-2026

Sub:- Agrl. Mktg. Dept; - Appointment of Person-in-charge to the Agricultural Market Committee, Narayanpet, Narayanpet District - Orders - Issued.

Ref:- 1. Government Memo No.6663/MKT.I/2018-1, Dated.01-11-2018 of Agriculture & Cooperation (MKT-I) Dept.
2. G. O. Rt. No. 682, Dated.16-09-2024 of Agriculture & Cooperation (MKT-I) Department.
3. AGM/STRY/S-III/257144/2020, Dt.29-08-2026 of DoAM,Hyderabad.
4. Govt. Memo No6036/Mktg-I(1)/2026 Dt.06-10-2026 of Agriculture & Cooperation (MKT-I) Department.

@@@@@@

ORDER:-
On expiry of the term of constituted body of Agril. Market Committee, Narayanpet, Narayanpet District., the District Marketing Officer, (ADM) Mahabubnagar is hereby appointed as Person-in-Charge, Agricultural Market Committee, Narayanpet under section 6 (3) (a) of Telangana (AP & LS) Markets Act, 1966 to manage day-to-day affairs of Agricultural Market Committee, Narayanpet until the Market Committee is re-constituted.

The District Marketing Officer, (ADM) Mahabubnagar is hereby instructed to take charge as Person-in-Charge, Agricultural Market Committee, Narayanpet immediately and submit compliance report.

Director of Marketing (FAC)

To
The District Marketing Officer, (ADM) Mahabubnagar.
Copy to
The Secretary, AMC, Narayanpet to take necessary action.
The District Marketing Officer, Narayanpet for information.
The Regl. Joint Director/Deputy Director of Marketing, Hyderabad for information.
Copy submit to the District Collector, Narayanpet for information.

Digitally signed by P S RAHUL RAJ
Date: 09-10-2026 11:32:27

నారాయణపేట,(డీకే చాటింపు):
పాలకవర్గం పొడిగింపుపై ఎన్నో ఆశలు..ఎన్నెన్నో కలలు..!!నేడు..రేపు అంటూ రోజులు గడుపుతూ వచ్చిన నారాయణపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ తాజా మాజీ చైర్మన్ నిరాశే ఎదురైంది.గత నెల15న పదవి కాలం ముగిసింది. పాలకవర్గం పదవీకాలం ముగిసిన నేపథ్యంలో కచ్చితంగా తిరిగి తాము కొనసాగుతామని ఆశించిన మాజీ చైర్మన్ కు ప్రస్తుతం నిరాశ పరిచిందని చెప్పవచ్చు.మేమే..తిరిగి ఆరు నెలలపాటు కొనసాగుతా మని..మరో నేత అయితే ఐదేళ్ల వరకు మేమే ఉంటామని తమ పాలకవర్గం పదవి కాలం ముగిసినప్పటినుంచి ప్రచారం చేసుకుంటున్న మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కు ఎవరు ఊహించని రీతిలో రాష్ట్ర మార్కెటిం గ్ అధికారులు తెరదించారు. గత నెల పాలకవర్గం పదవీకాలం ముగిసిన నేపథ్యంలో ఆ పాలకవర్గం స్థానంలో సోవ ారం నారాయణపేట వ్యవసాయ మార్కెట్ కమిటీకి పర్సన్ ఇన్చార్జినీ నియమించారు.ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి.పర్సన్ ఇంచార్జి నియామకంతో ఇన్ని రోజుల పాటు ఈ పదవిపై ఎన్నో ఆశలు పెట్టుకున్న తాజా మాజీ చైర్మన్ కు నిరాశ కబురు అందింది..!

పర్సన్ ఇన్చార్జిగా బాల మణెమ్మ...
నారాయణపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవీకాలం తాజాగా ముగిసినందున డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్ అధికారి పర్సన్





ఇన్చార్జినీ నియమించారు.నారాయణపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా ఉన్న సదాశివరెడ్డి పదవీ కాలం గత నెల15న ముగిసిన విషయం పాఠకులకు విధితమే.తిరిగి తమ పదవీకాలం పొడిగింపు కోసం మాజీ చైర్మెన్ పట్టు విడవని విక్రమార్కునిగా ఎన్నో ప్రయత్నాలు చేసిన ఫలితం లేకపోయింది. గతంలో మాదిరిగా తమ సెంటిమెంట్ ను మరో మారు పునరావృత్తం చేసి హైదరాబాద్ లో మకాం వేసి సింహాసనంపై అధిష్టించాలని విశ్వ ప్రయత్నాలు చేశారు. తీరా వారి ఆశలపై తెలంగాణ ప్రభుత్వం డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చరల్ మార్కెటింగ్ అధికారులు నీళ్లు చల్లారు. నారా యణపేట వ్యవసాయమార్కెట్ కమిటీ పాలకవర్గం గడువు ము గిసినందున మహబూబ్ నగర్ జిల్లా మార్కెటింగ్అధికారి(ఏడిఎం) బాల మణెమ్మను పర్సన్ ఇన్చార్జిగా నియమిస్తూ,కొత్త కమిటీ వచ్చే వరకు రోజువారీ వ్యవహారాలు చూడాలని ఆదేశించారు.

చైర్మన్ స్థానంపై ఎందరో ఆశలు
నారాయణపేట వ్యవసాయ మార్కెట్ పాలకవర్గం పదవీ కాలం ముగిసి పర్సన్ ఇంచార్జ్ నియామకంతో చైర్మన్ స్థానాన్ని ఆశిస్తున్న పలువురు నేతల్లో మళ్లీ ఆశలు చిగురించాయి. వ్యవసాయ మార్కెట్ పాలకవర్గం పదవీకాలం ముగియడం..పర్సన్ ఇంచార్జీ నియామకం జరగడంతో మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం తాజాగా అధికార పార్టీలోని మిగతా నేతలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు.దాంతో రాజకీయ వేడి రాజుకుంది.
పర్సన్ ఇంచార్జి నియామకంతో కొత్త పాలక వర్గానికి గ్రీన్ సిగ్నల్ లభించింది అని చెప్పవచ్చు. కొత్త కమిటీలో పదవులు దక్కించుకోవాలని ఆశావహులు ఎన్నో రోజుల నుంచి లాబీయింగ్కు తెర లేపినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

నాడు ఆర్డర్ కాపీ రాక ముందే ప్రమాణస్వీకారం
మార్కెటింగ్ అధికారుల నుంచి నూతన పాలకవర్గం నియమాకం జరిగినట్లు ఆర్డర్ కాపీ వచ్చిన తర్వాతనే ఎక్కడైనా ప్రమాణస్వీకారం కార్యక్రమం జరుగుతుంది. కానీ నారాయణపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రస్తుతం పదవి కాలం ముగిసిన పాలకవర్గం ప్రమాణస్వీకారం మాత్రం అందర్నీ ఆశ్చర్య పరిచింది.
16.09.2024 రోజున(ఆర్డర్ రాకున్నప్పటికీని)ప్రమాణ స్వీకారం చేయడంతో అంత తొందర ఎందుకు వచ్చిందని అప్పట్లో ప్రతి ఒక్కరు చర్చించుకోవడం జరిగింది. కానీజీవో ఆలస్యమైన..జీవో నెంబర్ 682,తే దీ16-09- 2024 న ఉన్నప్పటికీ మార్కెటింగ్ డైరెక్టర్ ఆమోదముద్ర తెలిపిన తేదీ మాత్రం19-09-2024 ఉండడం విశేషం.నాడు ఆర్డర్ కాపీ రాకముందే ప్రమాణస్వీకారం చేసి నేడు కూడా అదే స్థాయిలో మరోసారి పదవిలో కొనసాగాలని ఆశించిన మార్కెట్ కమిటీ తాజా మాజీ చైర్మన్ కు ప్రభుత్వం నుంచి నిరాశే ఎదురైంది.

చేదెక్కిన చక్కెర..

ముంబై : దేశంలో పెరుగుతున్న చక్కెర ధరలను నియంత్రించడానికి, రాబోయే పండుగ సీజన్‌లో తగినంత లభ్యతను నిర్ధారించడానికి కేంద్ర ప్రభుత్వం అనేక ముఖ్యమైన చర్యలు తీసుకుంది. ప్రభుత్వం ప్రకారం చక్కెర ధర జూలై 20న కిలోగ్రాముకు రూ..48.18 నుండి ఆగస్టు 20 నాటికి కిలోగ్రాముకు రూ.55.70కి పెరిగింది. ప్రభుత్వం మార్కెట్ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, అనవసరమైన ధరల పెరుగుదల, నిల్వలు, కృత్రిమ కొరతలను నివారించడానికి చర్యలు తీసుకుంటోంది పండగల వేళ 10 లక్షల టన్నుల చక్కెర దిగుమతికి అనుతించింది కేంద్రం. చక్కెర వ్యాపారులకు 400 టన్నుల స్టాక్ లిమిట్‌ను విధించింది. అయితే చక్కెర నిల్వలపై కేంద్రం కఠినంగా వ్యవహరిస్తోంది.ఇటీవలి చక్కెర ధరల పెరుగుదలకు ఇథనాల్ ఉత్పత్తిని నిందించడం సరికాదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇథనాల్ కోసం మళ్లించే చక్కెర వాటా 2022-23లో సుమారు 12% నుండి 2025-26 నాటికి సుమారు 9%కి తగ్గుతుంది. అంతేకాకుండా, దేశంలో ఉత్పత్తి అయ్యే ఇథనాల్‌లో సుమారు ముప్పావు వంతు ఇప్పుడు ధాన్యాల నుండి, ప్రధానంగా మొక్కజొన్న నుండి ఉత్పత్తి అవుతోంది.ప్రస్తుత చక్కెర ధరల పెరుగుదలకు అనేక కారణాలు ఉన్నాయని ప్రభుత్వం చెబుతోంది. వాటిలో ఊహించిన దానికంటే తక్కువ దేశీయ చక్కెర ఉత్పత్తి, పండుగ సీజన్‌కు ముందు పెరిగిన డిమాండ్, చెరకు పంటకు వాతావరణం వల్ల కలిగిన నష్టం, ప్రపంచవ్యాప్తంగా చక్కెర సరఫరా కొరత, పరిశ్రమలోని కొన్ని వర్గాలలో ఊహాగానాలు, నిల్వలు వంటివి ఉన్నాయి.చెరకు పండించే రాష్ట్రాలు మొదట్లో అంచనా వేసిన సుమారు 343 లక్షల మెట్రిక్ టన్నులతో పోలిస్తే, ప్రస్తుత సీజన్‌లో చక్కెర ఉత్పత్తి సుమారు 306 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉంటుందని అంచనా వేసింది. చెరకు పంటలో రెడ్ రాట్, టాప్ బోరర్ తెగుళ్లు, అలాగే అధిక వర్షపాతం వల్ల ఏర్పడిన నీటి నిల్వ కారణంగా ఉత్పత్తి దెబ్బతింది.అంచనా వేసిన దానికంటే ఉత్పత్తి తక్కువగా ఉన్నప్పటికీ, అక్టోబర్‌లో కొత్త క్రషింగ్ సీజన్ ప్రారంభమయ్యే వరకు దేశీయ అవసరాలను తీర్చడానికి దేశంలో తగినంత చక్కెర నిల్వలు అందుబాటులో ఉన్నాయి .ప్రపంచవ్యాప్తంగా కూడా చక్కెర ధరలు పెరుగుతున్నాయి. చక్కెర సరఫరా కొరత అనేది ప్రపంచవ్యాప్త పరిణామం, ఇది భారతదేశానికే పరిమితం కాదు. 2026-27 సంవత్సరానికి ప్రపంచ చక్కెర కొరత సుమారు 33 లక్షల మెట్రిక్



టన్నులుగా అంచనా వేయగా, వాతావరణ పరిస్థితులపై ఆందోళనలు ప్రపంచ దృక్పథాన్ని మరింతగా ప్రభావితం చేశాయి. ఫలితంగా అంతర్జాతీయ చక్కెర ధరలు 30 జూన్ 2026న టన్నుకు ఏ474 నుండి 20 ఆగస్టు 2026 నాటికి టన్నుకు ఏ552కు భారీగా పెరిగాయి. రెండు నెలల కన్నా తక్కువ వ్యవధిలోనే 16% పైగా పెరుగుదల నమోదైంది. ఇథనాల్ కార్యక్రమం రైతులకు సహాయపడి, చక్కెర మిల్లులను బలోపేతం చేసింది.భారతదేశం సాధారణంగా సంవత్సరానికి సుమారు 320-340 లక్షల మెట్రిక్ టన్నుల చక్కెరను ఉత్పత్తి చేస్తుంది. అయితే దేశీయ వినియోగం సుమారు 280-290 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉంటుంది . ఉత్పత్తి అధికంగా ఉన్న సంవత్సరాలలో, అదనపు నిల్వలు చక్కెర మిల్లుల నిధులను నిలిపివేసి, చెరకు రైతులకు చెల్లింపులను ఆలస్యం చేయగలవు. అదనపు చక్కెరను ఇథనాల్ వైపు మళ్లించడం ఈ నిర్మాణాత్మక సమస్యను పరిష్కరించడంలో సహాయపడి, చక్కెర మిల్లుల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచింది.ఫలితాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. 2026 ఆగస్టు 20 నాటికి, 2025-26 చక్కెర సీజన్‌కు సంబంధించిన చెరకు బకాయిలలో 97 శాతాన్ని రైతులకు ఇప్పటికే చెల్లించారు. చక్కెర మిల్లుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడటంతో, ప్రభుత్వ మద్దతుపై వాటి ఆధారపడటం కూడా తగ్గింది. 2014 నుండి 2021 మధ్య చక్కెర పరిశ్రమకు సుమారు రూ. 14,600 కోట్ల సబ్సిడీని అందించగా, 2021-22 నుండి అటువంటి సబ్సిడీ ఏదీ ప్రకటించబడలేదు. అదే సమయంలో వినియోగదారులకు చక్కెర ధరలు దీర్ఘకాలంలో స్థిరంగా ఉన్నాయి. ఆగస్టు 2024 మరియు జూలై 2026 మధ్య సంవత్సరానికి సుమారు 3% మాత్రమే పెరిగాయి . నిల్వలకు వ్యతిరేకంగా, సరఫరాను పెంచడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

రాయదుర్గంలోని భూములు రికార్డు ధర

హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం రాయదుర్గంలోని భూములు రికార్డు ధర పలికాయి. తాజాగా నిర్వహించిన ఆన్‌లైన్ వేలంలో ఎకరా భూమి రూ.264 కోట్ల భారీ ధర పలికింది. ఓజో రియాలిటీ సంస్థ అంత ధర పలికి భూములు దక్కించుకుంది. అధిక ధర పలికి మొత్తం 5.25 ఎకరాలను అదే సంస్థ వేలంలో సొంతం చేసుకుంది. దాదాపు 3 నెలల కిందట జరిగిన వేలంలో ఇదే సర్వే నెంబర్‌లో ఎకరా భూమి ఏకంగా రూ.237 కోట్లు పలికిన విషయం తెలిసిందే. తాజాగా ఈ రికార్డు బద్ధలుకొట్టి హైదరాబాద్ రియల్ ఎస్టేట్ కొత్త పుంతలు తొక్కుతోంది. భూముల వేలానికి సుప్రీంకోర్టు లైన్ క్లియర్ చేయడంతో సర్వే నంబర్ 83/1లోని 5.25 ఎకరాలను ఆన్‌లైన్లో వేలం వేశారు.రంగారెడ్డి జిల్లాలోని రాయదుర్గం పాన్‌మక్తాలో 11 ఎకరాల టీజీఐఐసీ భూముల వేలం ప్రక్రియను నిలిపివేసుందుకు దేశ సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు శుక్రవారం నాడు నిరాకరించింది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం ఇందులో జోక్యం చేసుకోబోమని స్పష్టం చేసింది. గతంలో స్టే ఇచ్చిన కంచ గచ్చిబౌలి భూములకు, వేలం వేసే ప్రాంతానికి 5 కి.మీ దూరం ఉందని, రెండింటికీ సంబంధం లేదని తెలంగాణ ప్రభుత్వం తరపున అభిషేక్ మను సింఘ్వీ స్పష్టం చేయడంతో జువ్వాడి ప్రణయ్ సింహారావు దాఖలు చేసిన పిటిషన్‌ను సీజేఐ ధర్మాసనం తిరస్కరించింది. ఇంకా ఈ విషయంపై ఏమైనా వివాదాలుంటే తెలంగాణ హైకోర్టులోనే తేల్చుకోవాలని పిటిషనర్లకు సుప్రీంకోర్టు సూచించింది.ఇప్పటికే ఈ వేలంపై



మధ్యంతర స్టే ఇచ్చేందుకు తెలంగాణ హైకోర్టు సింగిల్ జడ్జీలు కూడా ఇదివరకే నిరాకరించారు. ల్యాండ్ రిఫార్మ్స్ ట్రిబ్యునల్ (ఎల్ఆర్‌టీ)ను ఆశ్రయించినట్లు లేదా విచారణ పెండింగ్‌లో ఉన్నట్లు ఆధారాలు లేవని జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ పేర్కొనగా, ఎస్. రవీంద్రనా థ్ దాఖలు చేసినమరొక పిటిషన్‌పై జస్టిస్ నగేష్ భీమపాక ప్రభుత్వం, హెచ్ఎం డీఏలను కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. ఈ కేసు తదుపరి విచారణను సెప్టెంబరు 19కి వాయిదా వేయడం తెలిసిం దే. దీంతో ఎకరాకు రూ.175 కోట్ల కనీస ధరతో టీజీఐఐసీ చేపట్టిన ఆన్‌లైన్ వేలానికి మార్గం సుగమమైంది. అయితే టీజీఐఐసీ ఆన్‌లైన్లో భూమల వేలం నిర్వహించగా రికార్డు స్థాయిలో ఎకరా 264 కోట్లు పలికింది. దాదాపు మూడు నెలల కిందట నిర్వహించిన వేలంలో ఇక్కడి భూమి ఎకరా రూ. 237 కోట్లు పలికిన విషయం తెలిసిందే.

ధనుష్ పొలిటికల్ ఎంట్రీ...?



చెన్నై: తమిళ స్టార్ ధనుష్ చుట్టూ పొలిటికల్ ఎంట్రీకి సంబంధించిన చర్చ రోజురోజుకీ పెరుగుతోంది. తాజాగా ఆయన సోషల్ మీడియా ప్రెజెన్స్‌ను మరింత బలోపేతం చేసేందుకు.. రాజకీయ పార్టీల డిజిటల్ టీమ్స్ తరహాలో ప్రత్యేకంగా ఓ ఐటీ వింగ్ ఏర్పాటు చేస్తున్నారనే టాక్ వినిపిస్తోంది.ఈ డిజిటల్ టీమ్ కోసం దాదాపు ?1 కోటి వరకు ఖర్చు చేయనున్నారనే ప్రచారం జరుగుతోంది. సోషల్ మీడియాలో ధనుష్‌కు సంబంధించిన కంటెంట్‌ను పర్యవేక్షించడం, ఫ్యాన్ బేస్‌ను మరింత యాక్టివ్‌గా మార్చడం, ఆయన కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడం వంటి బాధ్యతలు ఈ టీమ్ చూసుకోనుందని టాక్.ఇది నిజమైతే.. కేవలం సినిమా ప్రమోషన్ కోసం ఏర్పాటు చేస్తున్న టీమ్ కంటే చాలా పెద్ద వ్యవస్థగా ఉండొచ్చనే చర్చ మొదలైంది. ముఖ్యంగా తమిళనాడులో రాజకీయ పార్టీల ఐటీ వింగ్స్ సోషల్ మీడియా నేరేటివ్, గ్రౌండ్ లెవల్ కమ్యూనికేషన్, డిజిటల్ క్యాంపెయిన్లలో కీలకంగా మారిన నేపథ్యంలో.. ధనుష్ కూడా అదే తరహా వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారన్న వార్త ఆసక్తిని పెంచుతోంది.ఇప్పటికే ధనుష్ ఫ్యాన్ క్లబ్స్‌లో కదలికలు పెరిగాయి. సంక్షేమ కార్యక్రమాలు చేయాలని అభిమానులకు ఆయన పిలుపునివ్వడం, ఫ్యాన్ క్లబ్ కార్యకలాపాలు విస్తరించడం, కొన్ని ప్రాంతాల్లో వాటిని మరింత వ్యవస్థీకృతం చేయడం వంటి పరిణామాలు పొలిటికల్ ఎంట్రీ ఊహాగానాలకు మరింత బలం చేకూరుస్తున్నాయి.అయితే.. ధనుష్ రాజకీయాల్లోకి వస్తున్నారన్నది ఇప్పటివరకు అధికారికంగా ప్రకటించలేదు. ?1 కోటి ఖర్చుతో ఐటీ వింగ్ ఏర్పాటు చేస్తున్నారన్న వార్తకు కూడా ధనుష్ లేదా ఆయన టీమ్ నుంచి అధికారిక ధృవీకరణ లేదు.కానీ వరుసగా జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే.. ధనుష్ విషయంలో అసలు సినిమా ఏంటి, పొలిటికల్ స్కెచ్ ఏంటి అనేది ఇప్పుడు తమిళనాట ఆసక్తికరంగా మారింది

మరో ఎంపీకి అమాత్య యోగం!



హైదరాబాద్ : కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరుగుతుందన్న ప్రచారం నేపథ్యంలో తెలంగాణ నుంచి ఒకరికి అవకాశం వస్తుందన్న సమాచారంపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. ఇటీవల చేపట్టిన బీజేపీ కేంద్ర కమిటీ విస్తరణలో తెలంగాణ నుంచి ఎవరికీ అవకాశం ఇవ్వకపోవడం, అదే సమయంలో రాష్ట్రానికి చెందిన ఇద్దరు ప్రముఖ నేతలను జాతీయ కార్యకర్గం నుంచి తప్పించడంతో ఈ ప్రచారానికి ఊతమిస్తుందని చెబుతున్నారు. రాష్ట్రంలో బీజేపీకి 8 మంది ఎంపీలు ఉండగా, ఇప్పటికే ఇద్దరు మంత్రులుగా వ్యవహరిస్తున్నారు. పునర్వ్యవస్థీకరణలో మరొకరికి చాన్స్ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నారని అంటున్నారు.మరో రెండేళ్లలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ హాట్ ఫేవరెట్ గా పోటీ ఇవ్వాలంటే రాష్ట్రంలో బీజేపీ నేతలు మరింత క్రియాశీలంగా పనిచేయాలని కేంద్ర పెద్దలు భావిస్తున్నట్లు చెబుతున్నారు. ప్రస్తుతం ప్రతిపక్షాన్ని వెనక్కి నెట్టి ఆ స్థానంలో పోటీ ఇవ్వడమే కాకుండా, అధికారంలోకి రావాలంటే పార్టీని ఇంకా విస్తరించాలని బీజేపీ అగ్రనేతలు భావిస్తున్నారని చెబుతున్నారు. తమ లక్ష్యానికి చేరువ కావాలంటే పార్టీని పరిగెత్తించాలని, ఇందుకోసం నేతలకు కొత్త పదవులతో ప్రోత్సహించాలని అధిష్టానం ఆలోచిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో త్వరలో జరగబోయే కేంద్ర మంత్రి వర్గ విస్తరణలో తెలంగాణ నుంచి కచ్చితంగా ఒకరికి అవకాశం వస్తుందని అంచనా వేస్తున్నారు. రాష్ట్రంలో 8 మంది ఎంపీలు ఉండగా, ఇప్పటికే ఇద్దరు కేంద్ర మంత్రులుగా ఉన్నారు. ఇంకా మిగిలిన ఆరుగురిలో ఒకరికి చాన్స్ ఇస్తారా? లేక బయట రాష్ట్రాల నుంచి పార్లమెంటుకు ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్రానికే చెందిన ఎంపీలకు అవకాశం ఇస్తారా? అనేది హాట్ టాపిక్ అవుతోంది. ప్రస్తుతం రాష్ట్రానికి చెందిన ఇద్దరు బీజేపీ నేతలు బయట రాష్ట్రాల నుంచి రాజ్యసభ సభ్యులుగా పనిచేస్తున్నారు. వీరిలో సంఘ్ నేపథ్యం ఉన్న ఓబీసీ మోర్చా మాజీ అధ్యక్షుడు లక్ష్మణ్, బీసీ ఉద్యమ నాయకుడు ఆర్.కృష్ణయ్య ఉన్నారు. లక్ష్మణ్ ఉత్తర్‌ప్రదేశ్ నుంచి కృష్ణయ్య ఏపీ నుంచి రాజ్యసభ సభ్యులుగా ఉన్న విషయం తెలిసిందే. ఈ పరిస్థితుల్లో రాష్ట్రానికి చెందిన 8 మందిలో ఎవరికి మంత్రి పదవి లభిస్తుందనేది విస్తృత చర్చగా ఉందని చెబుతున్నారు. ప్రధానంగా అనేక సమీకరణాలను పరిశీలిస్తున్న బీజేపీ అధిష్టానం బీసీ, మహిళ కోటాలో ఒకరికి అవకాశం ఇవ్వాలని భావిస్తున్నట్లు చెబుతున్నారు. అయితే ఇప్పటికే బీసీ కోటాలో కరీంనగర్ పార్లమెంటు సభ్యుడు బండి సంజయ్ మంత్రిగా ఉండటంతో రాష్ట్రానికి చెందిన మహిళా నాయకురాలు డీకే అరుణ మంత్రి పదవి రేసులో ముందున్నట్లు ప్రచారం జరుగుతోంది. డీకే అరుణను మంత్రి వర్గంలోకి తీసుకోవాలనే ఆలోచనతోనే ఆమెను బీజేపీ జాతీయ ఉపాధ్యక్ష పదవి నుంచి తప్పించారని చెబుతున్నారు. కేంద్రం చెప్పిన కారణమేంటి? ప్రస్తుత సమీకరణాలను పరిశీలిస్తే కేంద్ర మంత్రివర్గంలో డీకే అరుణకు చోటిచ్చే పరిస్థితులే ఎక్కువగా కనిపిస్తున్నాయని అంటున్నారు. డీకే అరుణ సీనియార్టీ, సామాజిక నేపథ్యంతో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని దీటుగా ఎదుర్కొనే సామర్థ్యం ఆమెకు అడ్వాంటేజ్ గా చెబుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత ప్రాంతానికి చెందిన అరుణ అన్నిరకాలుగా సీఎం స్పీడుకు బ్రేకులు వేయగలరని చెబుతున్నారు. చీలక తేవడానికి అరుణ నాయకత్వం ఉపయోగపడుతుందనే ఆలోచన చేస్తున్నారని అంటున్నారు. అయితే ఆమెకు దీటుగా బీసీ నేత లక్ష్మణ్ పేరు కూడా ఎక్కువగా వినిపిస్తోందని అంటున్నారు.

2027 జనాభా లెక్కల్లో కుల గణనపై

కేంద్రం వైఖరిని ప్రశ్నించిన జైరాం రమేష్....



న్యూఢిల్లీ : 2027 జనాభా లెక్కల్లో కులానికి సంబంధించిన వివరాలను సేకరించే విధానం "ఉద్దేశపూర్వకంగానే లోపభూయిష్టంగా" ఉందని కాంగ్రెస్ కమ్యూనికేషన్ విభాగం ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ విమర్శించారు. ఈ విధానం వెనుక "లోతైన దురుద్దేశం" ఉందని బుధవారం ఆరోపించారు. గతంలో ఎన్నడూ అడగని విధంగా మతం, పుట్టిన తేదీ, తల్లిదండ్రుల జన్మస్థలం వంటి వివరాలను సేకరించనున్నారని ఆయన పేర్కొన్నారు. 2027 జనాభా లెక్కల్లో తల్లిదండ్రుల మతం, పుట్టిన తేదీ, జన్మస్థలానికి సంబంధించిన వివరాలను గ్రామ స్థాయి వరకు సేకరించనున్నట్లు పేర్కొన్న మీడియా కథనాన్ని జైరాం రమేష్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. జనాభా లెక్కల ప్రశ్నావళిలో కులాన్ని ప్రకటించేందుకు ఓపెన్ ఫీల్డ్ ఆప్షన్‌తో పాటు, "కులాన్ని ప్రకటించదలచుకోలేదు", "కులం లేదు" అనే ఎంపికలు కూడా ఉన్నట్లు ఆ కథనం పేర్కొంది. కుల గణనను అడ్డుకునేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ మంగళవారం విమర్శించింది. 2027 జనాభా లెక్కల్లో కులాల ఎంపిక కోసం 'డ్రాప్‌డౌన్ మెనూ'ను ఎందుకు చేర్చలేదని ఆ పార్టీ ప్రశ్నించింది. 2021 సెప్టెంబర్‌లో సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో కేంద్రం స్వయంగా ఈ విధానాన్ని సిఫార్సు చేసిందని జైరాం రమేష్ గుర్తుచేశారు. 2025 ఏప్రిల్ 30న కుల గణన నిర్వహించనున్నట్లు ప్రకటించడం ద్వారా ప్రధాని మోడీ "పూర్తిగా యూ-టర్న్" తీసుకున్నారని, ఇప్పుడు అదే నిర్ణయంపై మరోసారి యూ-టర్న్ తీసుకుంటున్నారని కాంగ్రెస్ విమర్శించింది. 2021 సెప్టెంబర్ 21న సుప్రీంకోర్టులో దాఖలు చేసిన అఫిడవిట్‌లో కుల గణన నిర్వహించాలన్న డిమాండ్‌ను మోడీ ప్రభుత్వం తిరస్కరించిందని జైరాం రమేష్ పేర్కొన్నారు.

మూడు మేయర్ సీట్లపై కమలం పార్టీకి పట్టు..



విశాఖపట్టణం, : ఇటు టీడీపీ. ఇటు జనసేన. కూటమిలోని ఈ రెండు పార్టీలు.. స్థానిక ఎన్నికలపై ఎవరి లెక్కల్లో వారు బిజీగా ఉన్నారు. బీజేపీ కూడా సైలెంట్‌గా ఉంటూనే పకడ్బందీ ప్లానింగ్స్ చేస్తోందట. కార్పొరేషన్ ఎన్నికల్లో డైరెక్ట్ ఫైట్‌ను దృష్టిలో పెట్టుకొని వ్యూహాలకు పదును పెడుతోందట కమలం పార్టీ. విశాఖ మేయర్ పీఠంపై బీజేపీ స్పెషల్ ఫోకస్ పెట్టిందట. ఏపీ నగర పాలక సంస్థల్లో గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ అతిపెద్దది. 125 డివిజన్ల డీలిమిటేషన్ ప్రాసెస్ కూడా జరగబోతోంది. విశాఖ జిల్లాతో పాటు అనకాపల్లి జిల్లాలో విస్తరించి ఉంది. అందుకే ఇక్కడ మేయర్ పీఠం అంటే దాదాపు క్యాబినెట్ మంత్రితో సమానం అన్నట్లుగా భావిస్తున్నారు.ఆంధ్ర ప్రదేశ్ వార్తలుఏడాదికి ఐదారు వేల కోట్ల బడ్జెట్ ఉండే గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ పీఠం అంటే చాలా పెద్ద పదవి అనే చెప్పొచ్చు. ప్రత్యక్ష ఎన్నికలు జరగబోతుండటంతో తమ పార్టీ అభ్యర్థిని రంగంలోకి దించాలని మూడు పార్టీలు ఆశిస్తున్నాయి. బీజేపీ ఈ మేయర్ పీఠాన్ని తమకు విడిచి పెట్టాలని కోరాలని డిసైడ్ అయిందట.1979లో కాంగ్రెస్ పార్టీతో పోటీపడి మరీ ప్రత్యక్ష ఎన్నికల్లో మేయర్ పీఠాన్ని సొంతం చేసుకుంది బీజేపీ. అప్పుడు జనసంఘ్ రూపంలో ఉన్న బీజేపీ.. తొలిసారి విశాఖ మేయర్ అభ్యర్థిని గెలిపించుకొని హిస్టరీ క్రియేట్ చేసింది. ఇప్పటికీ విశాఖ నగరంలో బీజేపీకి మంచి పట్టు ఉన్నట్లు చెబుతుంటారు. మొన్నటి ఎన్నికల్లో విశాఖ ఎంపీ సీటు బీజేపీకి ఇస్తారని ప్రచారం నడిచింది. కాని పొత్తుల్లో భాగంగా పక్కనున్న అనకాపల్లి స్థానం బీజేపీకి దక్కగా.. అక్కడి నుంచి కమలం పార్టీ ఎంపీ అభ్యర్థిగా సీఎం రమేష్ గెలిచారు. విశాఖ గ్రేటర్ పరిధి అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో కూడా కొంత విస్తరించి ఉంటుంది. దీంతో తమకు గ్రేటర్ పీఠం ఇస్తే ఈజీగా గెలుచుకోవచ్చనే అంచనాల్లో ఉందట కమలం పార్టీ. సేమ్‌టైమ్ గత ఎన్నికల్లో తమకు విశాఖ ఎంపీ సీటు ఇవ్వకపోవడంతో.. ఇప్పుడు మేయర్ పీఠం అయినా వదిలేయాలని రిక్వెస్ట్ చేస్తున్నారు బీజేపీ నేతలు.విశాఖ మేయర్ సీటుతో పాటు.. విజయవాడ, తిరుపతి నగర పాలక సంస్థలపై కూడా బీజేపీ ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. గ్రేటర్ విశాఖ పరిధిలో బీజేపీకి ఓ ఎమ్మెల్యే, మరో ఎంపీ ఉన్నారు. 2014లో కూడా విశాఖ ఎంపీ సీటును బీజేపీ గెలిచింది. దీంతో తమకు పట్టున్న చోట మేయర్ సీటు దక్కించుకొని.. ఇంకా బలం పెంచుకునే ప్లాన్‌లో ఉన్నారట కమలనాథులు. ఇక గత ఎన్నికల్లో విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సీటును గెలుచుకున్న బీజేపీ.. బెజవాడ మేయర్ సీటుకోసం పట్టుబట్టేందుకు రెడీ అవుతోందట. తిరుపతి మేయర్ స్థానం కూడా తమకే ఇవ్వాలని కోరబోతోందట. కూటమి పెద్దల భేటీలో తమ వాదనను బలంగా వినిపించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. స్టేట్ మొత్తంలో అర్బన్ ఏరియాల్లో తమ ప్రాతినిధ్యాన్ని మరింత పెంచుకోవాలని బీజేపీ లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా మేయర్, డిప్యూటీ మేయర్, మున్సిపల్ చైర్మన్ పదవుల్లో పార్టీకి తగిన ప్రాధాన్యం దక్కేలా సీట్ల సర్దుబాట్లపై దృష్టి పెట్టాలని బీజేపీ డిసైడ్ అయిందట.రాష్ట్రంలో 17 మున్సిపల్ కార్పొరేషన్లు, 88 మున్సిపాలిటీలు, 18 నగర పంచాయతీలు ఉన్నాయి. వీటిలో మేయర్, మున్సిపల్ చైర్మన్ పదవుల పంపకంపై ఇప్పటి నుంచే రాజకీయ చర్చలు మొదలైనట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా విశాఖతో పాటు విజయవాడ, తిరుపతి నగరాలు రాజకీయ, ఆర్థిక, ఆధ్యాత్మికంగా కీలకమైనవి కావడంతో ఇక్కడ మేయర్ పీఠాలను దక్కించుకుంటే పార్టీకి సంస్థాగతంగా, రాజకీయంగా మరింత ప్రయోజనం ఉంటుందని బీజేపీ అంచనా వేస్తోందట.పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు, స్థానిక బలాబలాలు వంటి సమీకరణలు మేయర్ అభ్యర్థుల ఎంపికలో కీలకంగా మారే అవకాశం ఉంది. ఉత్తరాంధ్రలో తమకు ఎక్కువ సీట్లు ఇవ్వాలని బీజేపీ నేతలు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌పై ఒత్తిడి తెస్తున్నారట. అసెంబ్లీ ఎన్నికల్లో సర్దుబాట్ల కోసం ఫోలో అయిన విధానం కాకుండా.. ఇప్పుడు స్థానికంగా పార్టీల బలం, అభ్యర్థుల సామర్థ్యం, వార్డుల వారీగా సమీకరణాలను లెక్కలులోకి తీసుకోవాల్సి ఉంటుంది. విశాఖ, విజయవాడ, తిరుపతి మేయర్ పీఠాల కోసం బీజేపీ పట్టుబడితే.. కూటమిలోని టీడీపీ, జనసేన నుంచి స్పందన ఎలా ఉంటుందో.. కమలం పార్టీ ఆశించినట్లు మేయర్ సీట్లు దక్కుతాయో లేదో చూడాలి మరి.

ఏపీలో స్థానిక ఎన్నికలు.. చంద్రబాబు బాటలో జగన్



కడప : వైయస్ జగన్మోహన్ రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికలపై కీలక ప్రకటన చేశారు. ఒకవేళ ఎక్కడైనా ఏకగ్రీవాలు జరిగితే అటుపంటి చోట నియోజకవర్గ ఇన్చార్జి లకు టికెట్లు ఇవ్వనని తేల్చి చెప్పారు. కానీ ఈ ప్రకటన వెనుక భారీ వ్యూహం ఉన్నట్లు అర్థం అవుతోంది. కచ్చితంగా ఈ ప్రకటనతో తెలుగుదేశం కూటమి ముందుగానే పావులు కదుపుతుంది. ముందుగా పులివెందుల నియోజకవర్గం పైనే ఫోకస్ పెడుతుంది. గత ఏడాది పులివెందుల జడ్పిటిసి స్థానం ఏ విధంగా పట్టుబట్టి గెలిచిందో.. కచ్చితంగా పులివెందుల మునిసిపాలిటీని సైతం అలాగే కైవసం చేసుకుంటుంది. ప్రత్యక్ష ఎన్నికలు కావడంతో ఒకరు మున్సిపల్ అభ్యర్థిగా వైసీపీ తరపున బరిలో నిలుస్తారు. కానీ ఆ పార్టీకి కౌన్సిలర్ల అభ్యర్థులు మాత్రం దొరకరు. అంతలా ఉంటుంది టిడిపి వేట అక్కడ. ఇప్పటికే టిడిపి బృందం ఒకటి పులివెందులలో వాలిపోయింది. వారు వార్డుల్లో ఏకగ్రీవాలకు అప్పుడే ప్రయత్నాలు ముమ్మరం అయ్యాయిపులివెందులలో ఏకగ్రీవాలు జరిగితే మాత్రం జగన్మోహన్ రెడ్డి నుంచి మరో ప్రకటన వచ్చే అవకాశం ఉంది. మున్సిపల్ ఎన్నికల్లో కూటమి ఏకపక్షంగా గెలిచి.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి స్థానం దక్కకపోతే మాత్రం జగన్మోహన్ రెడ్డి కచ్చితంగా డిఫెన్స్ లో పడతారు. అయితే కీలక కూటమి నేతలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో చాలా మున్సిపాలిటీలు ఏకగ్రీవాలు జరుగుతాయి. అది జగన్మోహన్ రెడ్డికి కూడా తెలుసు. ఒకవేళ ఏకగ్రీవాలు జరిగి.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి భారీ ఓటమి ఎదురైతే.. జగన్మోహన్ రెడ్డి కచ్చితంగా స్థానిక ఎన్నికలను బహిష్కరిస్తారు. ఇది జరిగే పని అంటూ విశ్లేషకులు సైతం అభిప్రాయపడుతున్నారు.2021లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగాయి. ఆ సమయంలో ముందుగా పంచాయితీల ఎన్నికలు జరిగాయి. తరువాత మున్సిపల్ ఎన్నికలు జరిగాయి. కుప్పం నియోజకవర్గంలో అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మొత్తం మోహరించింది. ఎలాగైనా మున్సిపాలిటీ ని కైవసం చేసుకోవాలని చూసింది. అయినా సరే టిడిపి శ్రేణులు ప్రతిఘటించాయి. కానీ ఫలితం లేకపోయింది. పరిమిత వార్డులకే టిడిపి పరిమితం అయింది. అంతకుముందు పంచాయతీ ఎన్నికల్లో సైతం ప్రలోభాలతో, భయపెట్టి మరి వైసీపీ సానుభూతిపరులు గెలిచారు. కేవలం కుప్పం ఫలితాలతో చంద్రబాబు ఆలోచనలో పడ్డారు. అందుకే తరువాత వచ్చిన మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికలను బహిష్కరించారు చంద్రబాబు. ఇప్పుడు కూడా మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీకి అదే పరిస్థితి ఎదురైన మరుక్షణం.. తరువాత ఆ రెండు స్థానిక ఎన్నికలను జగన్మోహన్ రెడ్డి బహిష్కరిస్తారు. ఇది ఒక వ్యూహం అని తెలుస్తోంది. స్థానిక ఎన్నికలు బహిష్కరించిన చంద్రబాబు స్ట్రాటజీ అప్పట్లో చాలా విమర్శలకు తావిచ్చింది. కానీ సార్వత్రిక ఎన్నికల నాటికి ఆ ప్రయోగమే ఫలించింది. ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి సైతం అదే ఫార్ములాను అనుసరించనున్నారు.

కొత్త పొలిటికల్ పార్టీకి స్పేస్ ఉందా



విజయవాడ, : ఆంధ్రప్రదేశ్ రాజకియాల్లో ఏళ్ల తరబడి కీలక నూత్రధారిగా, వైసీపీకి ఆయువుపట్టులా వ్యవహరించిన విజయసాయిరెడ్డి ఇప్పుడు సొంతంగా పార్టీ పెట్టేందుకు రెడీ అయ్యారు. తాను సీఎంని అవుతా అంటే ఇంకా తేడాగా ఉంటుందని .. జెన్ జీని సీఎంను చేస్తానని వింత మాటలు చెబుతూ ప్రెస్మీట్ పెట్టారు. ఆయన తీరు చూసిన వారికి ఎవరికైనా రాజకీయ ఉత్సాహం గానీ, దూకుడు గానీ కనిపించడం లేదని అనిపిస్తుంది తీవ్రమైన అలసట, ముఖంలో నీరసం స్పష్టంగా కనిపిస్తోంది. ఏదో ఒత్తిడితో ఆయన రాజకీయ ప్రకటన చేస్తున్నట్లుగా కనిపిస్తోంది.విజయసాయిరెడ్డికి ఉన్న ఏకైక బలం ఆర్థిక వనరులు. రాజకీయాల్లో డబ్బు ఉంటే సరిపోదు, దానిని నమ్మివచ్చే నాయకులు, కేడర్ ఉండాలి అనేది ప్రాథమిక సూత్రం. విజయసాయిరెడ్డి వద్ద వనరులకు లోటు లేకపోయినా, కేవలం ఆయన పెట్టే ఖర్చులను చూసి , డిజిటల్ మీడియా ఫండింగ్‌ను ఆశించి వచ్చే అనుచరులు మాత్రమే ఆయన చుట్టూ చేరే అవకాశం ఉంది. ప్రజాదరణ, మాస్ ఇమేజ్ ఉన్న రాజకీయ నేతలెవరూ తమ భవిష్యత్తును ఆయన కొత్త పార్టీకి తాకట్టు పెట్టే సాహసం చేయరు. నియోజకవర్గాల్లో పట్టున్న నాయకులు కాకుండా, కేవలం నిధులు గుంజుకునే అవకాశం కోసమే వచ్చే ద్వితీయ శ్రేణి నేతలు, తాత్కాలిక అవకాశవాదులతో పార్టీ నడపడం ద్వారా ఆయనకు రాజకీయంగా ఒరిగేదేమీ ఉండదు. చివరికి మిగిలేది కేవలం ఖర్చు మాత్రమే.ఈ కొత్త ప్రయోగం వెనుక ఆయన అసలు కారణం ఏమిటన్న ప్రశ్న వస్తోంది. వైసీపీని వీడిన నాటి నుంచి జగన్ వైఖరిపై తీవ్ర అసంతృప్తి ఉన్నప్పటికీ, జగన్ పక్కన తనకు దక్కాల్సిన ప్రాధాన్యత , స్థానం మళ్లీ లభిస్తుందనే ఆశ ఆయనలో లోలోపల ఉందనే సంకేతాలు పదే పదే కనిపిస్తున్నాయి. నేరుగా వైఎస్సార్‌సీపీలోకి వెళ్లలేని పరిస్థితి ఉండటంతో, బయట ఒక మూడో ప్రత్యామ్నాయంగా లేదా ఒక రాజకీయ శక్తిగా తన ఉనికిని చాటుకోవడం ద్వారా.. జగన్ తన ప్రాధాన్యతను గుర్తించేలా చేయాలనే ఒక బార్గేనింగ్ స్ట్రాటజీ కూడా ఇందులో దాగి ఉండవచ్చని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.మరోవైపు, పాత కేసుల నుంచి రక్షణ, రాజకీయ రంగంలో కొనసాగుతున్నామనే ఒక కవచాన్ని కాపాడుకోవడం లేదా ఇతర కేంద్ర పార్టీల ఒత్తిళ్లకు తలొగ్గడమూ ఈ కొత్త పార్టీ వెనుక కారణాలు కావచ్చు. అయితే, సొంతంగా ప్రజాకర్షణ లేని వ్యూహకర్తలు పార్టీలు పెట్టి జనం ముందుకు వెళ్లినప్పుడు ఎదురయ్యే ఆర్థిక, రాజకీయ పరాభవాలు చరిత్రలో చాలానే ఉన్నాయి. సాయిరెడ్డి వంటి సీనియర్ ఆడిటర్, వ్యూహకర్తకు ఈ విషయం తెలియంది కాదు. అయినప్పటికీ, ఆశయం కంటే ఒత్తిళ్లు, వ్యూహాల కంటే ఖర్చులే ఎక్కువగా ఉన్న ఈ కొత్త రాజకీయ ప్రయాణంలో విజయసాయిరెడ్డికి లభించే రాజకీయ మైలేజ్ అతిస్వల్పమే. పార్టీ నిర్మాణం, డిజిటల్ మీడియా నిర్వహణ పేరిట కోట్లాది రూపాయల ఖర్చు మినహా.. క్షేత్రస్థాయిలో ఓటు బ్యాంకు ఏమీ ఏర్పడదు.

జనసైనికుల్లో నెలకొన్న నైరాశ్యం



కాకినాడ, : జనసేనలో స్తబ్ధత నెలకొంది. ఇటు నేతల్లోనూ అటు కార్యకర్తల్లోనూ ఈ నైరాశ్యం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. స్థానిక సంస్థల ఎన్నికలకు సమయం పెద్దగా లేదు. అక్టోబరు చివరలో మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ నైరాశ్యం జనసేనను ఎటు వైపు తీసుకెళుతుందన్న చర్చ ఇటు పార్టీలోనూ, అటు కూటమిలోనూ జరుగుతోంది. పవన్ కల్యాణ్ అస్వస్థతకు గురయి కేరళలో ఆయుర్వేద చికిత్స తీసుకు వచ్చిన తర్వాత కూడా స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రచారంలో పాల్గొంటారా? లేదా? అన్న దానిపై స్పష్టత లేదు. పవన్ ప్రచారానికి రాకుంటే పార్టీ తీవ్రంగా నష్టపోతుందన్న భావన జనసైనికుల్లోనూ, కూటమిలోని మిగిలిన పార్టీల్లోనూ వ్యక్తమవుతుంది. ఈ కారణం వల్లనే జనసైనికుల్లోనూ, నేతల్లోనూ కొంత స్తబ్ధత నెలకొందని చెప్పాలి. జనసేన పార్టీలో ఎప్పుడైనా నైరాశ్యం లేదా స్తబ్ధత నెలకొన్నప్పుడు, ఆ నైరాశ్యాన్ని పారదోలి పార్టీని ముందుకు నడిపేది ముమ్మాటికీ ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ మాత్రమే. రాజకీయాల్లో ఒడిదొడుకులు సహజం. 2019 ఎన్నికల ఓటమి తర్వాత లేదా కూటమి రాజకీయాల నేపథ్యంలో కార్యకర్తలలో అక్కడక్కడా గందరగోళం, నైరాశ్యం ఏర్పడిన ప్రతిసారీ పవన్ కల్యాణ్ తన స్ఫూర్తిదాయక ప్రసంగాలు, వ్యూహాత్మక నిర్ణయాలతో శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతూ వస్తున్నారు. పార్టీలో నైరాశ్యాన్ని పారదోలేందుకు, క్యాడర్‌ను ఉత్తేజపరిచేందుకు కేవలం పవన్ కల్యాణ్ మత్రమే కారణమవుతున్నారు. క్షేత్రస్థాయిలో పర్యటనలు చేయడం, సభ్యత్వ నమోదు కార్యక్రమాలు చేపట్టడం, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సమన్వయ కమిటీలను నియమించి దిశానిర్దేశం చేయడం ద్వారా శ్రేణులకు ఆయన భరోసా ఇస్తున్నారు.2024 ఎన్నికల్లో సాధించిన 100% విజయంతో ప్రస్తుతం జనసేన ఏపీ ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ఉంది. డిప్యూటీ సీఎంగా పవన్ కల్యాణ్ తీసుకుంటున్న నిర్ణయాలు, ప్రజా సమస్యలపై స్పందిస్తున్న తీరు కార్యకర్తల్లో గర్వాన్ని, ఉత్సాహాన్ని నింపుతున్నాయి. నాదెండ్ల మనోహర్, నాగబాబు మరియు ఇతర ముఖ్య నేతలు పార్టీ అంతర్గత వ్యవహారాలను చక్కదిద్దుతూ, స్థానిక నాయకులను సమన్వయం చేస్తూ నైరాశ్యానికి తావులేకుండా చూస్తున్నారు. జనసేన బలం వారి అంకితభావం గల జనసైనికులు, వీరమహిళలు. విపక్షాల విమర్శలను తిప్పికొడుతూ సోషల్ మీడియా వేదికగా పార్టీ సిద్ధాంతాలను వారు బలంగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. పార్టీ ఎదుగుదల క్రమంలో ఇప్పుడు పవన్ కల్యాణ్ ఈ నైరాశ్యాన్ని పారదోలాలంటే స్వయంగా పూనుకోవాలి. అలాగే ఆగస్టు 15వ తేదీ నాటికి నియమిస్తామన్న కమిటీల నియామకాన్ని వెంటనే చేపట్టాలి. నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహించాలన్నఅభిప్రాయం వ్యక్తమవుతుంది.

సజ్జల టార్గెట్ గా విజయసాయి పాలిటిక్స్



విజయవాడ, : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి, కొత్త రాజకీయ పార్టీ స్థాపించే దిశగా అడుగులు వేస్తున్న మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి విడుదల చేసిన రెండు పేజీల ఓపెన్ లెటర్ ఆ పార్టీలో పెద్ద తుఫానునే సృష్టించింది. కేవలం ఆత్మరక్షణ కోసం మాత్రమే కాకుండా, ఏకంగా వైఎస్సార్‌సీపీ మునిగిపోతున్న నౌకగా మారడానికి ప్రధాన కారకుడు సజ్జల రామకృష్ణారెడ్డి అనబడే ఓ శక్తివంతమైన కోటరీనేనని ఆయన నేరుగా నిందించడం సంచలనం రేపింది. కొత్త పార్టీ ఆవిర్భావానికి ముందే సాయిరెడ్డి విసిరిన ఈ సవాలు, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాజకీయ చదరంగంలో సజ్జల పాత్రపై ఉన్న ఆరోపణలను ఒక్కసారిగా క్యాడర్ ముందుకు తీసుకొచ్చింది.గడిచిన కొన్నేళ్ల పరిణామాలను పరిశీలిస్తే, వైఎస్సార్‌సీపీ సాధించిన 2019 ఘనవిజయం తర్వాతి కాలంలో పార్టీలో సజ్జల ప్రభావం అమాంతం పెరిగిపోయిందనేది రాజకీయ వర్గాల్లో బహిరంగ రహస్యమే. అయితే ఆశ్చర్యకరంగా సజ్జల చేతికి తాడేపల్లి పవర్ సెంటర్ వచ్చినప్పటి నుంచే జగన్‌కు వరుస ఎదురుదెబ్బలు తగలడం మొదలయ్యాయి. 2024 ఎన్నికల్లో కేవలం 11 సీట్లకు పరిమితమై ప్రతిపక్ష హోదాను కూడా కోల్పోవడం, ఢిల్లీ స్థాయిలో పార్టీకి సంబంధాలు తెగిపోవడం, కీలకమైన నంబర్-2 నాయకులంతా పక్కకు తప్పుకోవడం, చివరకు వైఎస్ కుటుంబంలోనే చీలిక వచ్చి షర్మిల, విజయమ్మలు దూరమవ్వడం వంటివన్నీ సజ్జల పర్యవేక్షణ కాలంలోనే జరిగాయి. సాయిరెడ్డి లేఖ సజ్జలపై విసిరిన విమర్శ మాత్రమే కాదు. అది జగన్ సొంతంగా నిర్ణయాలు తీసుకోలేరు, కోటరీ చేతిలో బందీ అయ్యారు అన్న సత్యాన్ని పార్టీ కేడర్‌కు నమ్మించేలా వేసిన పక్కా పొలిటికల్ స్కెచ్ 2024 దారుణ ఓటమి తర్వాత కూడా తాడేపల్లి గడప దాటి అసలు నిజాలు జగన్‌కు చేరకపోవడానికి సజ్జల వ్యవహారశైలే కారణమని గ్రామ స్థాయి నాయకుల వరకు తీవ్ర ఆక్రోశంతో ఉన్నారు. సాయిరెడ్డి బహిరంగంగా లేఖ రాయడం ద్వారా, ఆ నిరాశలో ఉన్న కేడర్ మొత్తాన్ని తన వైపు తిప్పుకోవడానికి లేదా వారిలోని అసమ్మతిని బయటకు తేవడానికి బలమైన పునాది వేశారు.జగన్ నమ్మకస్థుడిగా 15 నెలలు జైలు జీవితం గడిపిన సాయిరెడ్డి వంటి నేతను సైతం అవమానించి పంపేశారని చూపించడం ద్వారా, పార్టీ కోసం కష్టపడిన వారిని కాపాడుకోలేక కోటరీని మోసే నాయకుడు " అనే ముద్ర జగన్‌పై పడేలా చేశారు. ఇది భవిష్యత్తులో మిగిలిన ద్వితీయ శ్రేణి నేతలు కూడా పార్టీ మారడానికి మానసిక ధైర్యాన్ని ఇస్తుంది. విజయసాయిరెడ్డి లేఖతో ఇప్పుడు వైఎస్సార్‌సీపీ తాడేపల్లి వర్గాలు రక్షణ ధోరణిలోకి వెళ్లక తప్పదం లేదు. సజ్జలను సమర్థించుకుంటే సొంత పార్టీ శ్రేణులే తిరగబడే పరిస్థితి, ఆయనను పక్కన పెడితే తప్పు ఒప్పుకున్నట్లు అయ్యే పరిస్థితి జగన్‌కు ఎదురైందివిజయసాయిరెడ్డి సృష్టించిన ఈ రాజకీయ అలజడి కేవలం సజ్జల వర్సెస్ సాయిరెడ్డి యుద్ధం మాత్రమే కాదు. వైఎస్సార్‌సీపీ ఎంత త్వరగా తన తప్పులను సరిదిద్దుకోకపోతే అంత వేగంగా ఖాళీ అవుతుందనే హెచ్చరిక. ఢిల్లీ పెద్దలతో సంబంధాలు లేక, రాష్ట్రంలో ప్రజా క్షేత్రంలో నిలబడలేక, కుటుంబం అండ కోల్పోయి, ఇప్పుడు అంతర్గత కోటరీ రాజకీయాల్లో మునిగిపోతున్న వైఎస్సార్‌సీపీ నుంచి క్యాడర్ పక్కకు జరగడానికి సాయిరెడ్డి వేసిన ఈ టైమ్ బాంబ్ ' ప్రధాన కారణం కానుంది. ఈ లేఖ ద్వారా విజయసాయిరెడ్డి జగన్‌ను సజ్జల నుంచి వేరుచేసే ప్రయత్నం చేయలేదు. సజ్జలను నమ్ముకున్న జగన్‌కు పార్టీలో భవిష్యత్తు లేదనే సంకేతాన్ని క్యాడర్‌కు బలంగా పంపించారు. ఈ అగ్గి రాబోయే రోజుల్లో వైఎస్సార్‌సీపీలో ఎలాంటి రాజీనామాలు లేదా గ్రూపు జగడాలకు దారితీస్తుందో చూడాల్సి ఉంది.

ఏపీలో వడివడిగా మెట్రో అడుగులు



విజయవాడ, : దేశంలోని చాలా నగరాలల్లో మెట్రో రైలు సేవలు అందుబాటులోకి వచ్చాయి. మెట్రో సేవలు కలిగిన రాష్ట్రాల జాబితాలోకి త్వరలో ఏపీ కూడా చేరబోతోంది. ఇతర రాష్ట్రాల్లో కేవలం ఒక ఒకటి, అరా నగరాల్లోనే మెట్రో సేవలు కొనసాగుతుంటే.. ఏపీలో ఏకంగా రెండు నగరాల్లో మెట్రో సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ మేరకు ఏపీలోని విజయవాడ, విశాఖపట్నంలలో మెట్రో రైలు ప్రాజెక్టులకు సంబంధించిన డీపీఆర్ లకు కేంద్రం ఆమోద ముద్ర పడే దిశగా వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఈ రెండు ప్రాజెక్టులకు సంబంధించిన ఆర్థిక మదింపును కేంద్రం ప్రారంభించింది. అంటే?ఈ ప్రాజెక్టులకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టేనని చెప్పవచ్చు. తెలుగు నేల విభజన తర్వాత విభజిత ఏపీలో తొలి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన టీడీపీ? 2015లోనే విజయవాడతో పాటుగా విశాఖలో మెట్రో సేవల కోసం కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. ఈ ప్రతిపాదనలపై నాడు ఓ మోస్తరు అడుగులు పడినా? 2019లో టీడీపీ ఓడిపోవడం, వైసీపీ అధికారంలోకి రావడంతో ఆ ప్రాజెక్టులు కాస్తా అటకెక్కేశాయి. అయితే 2024 ఎన్నికల్లో జనసేన, బీజేపీలతో కలిసిన టీడీపీ? తిరిగి అధికారం చేజిక్కించుకుంది. అంతేకాకుండా అటు కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ సర్కారు, ఇటు ఏపీలో టీడీపీ నేతృత్వంలోని కూటమి సర్కారు కొలువు దీరడంతో? సీఎం నారా చంద్రబాబునాయుడు మరోమారు మెట్రో ప్రాజుక్టుల బూజు దులిపారు.విజయవాడ, విశాఖల మెట్రో రైలు ప్రాజెక్టులకు సంబంధించి డీపీఆర్ లను రూపొందించిన కూటమి సర్కారు.. వాటిని కేంద్రం పరిశీలనకు పంపింది. ఈ ప్రతిపాదనలపై దృష్టి సారించిన కేంద్రం? ఇటీవలే ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ఆర్థిక మదింపును ప్రారంభించింది. ఈ ప్రక్రియ పూర్తి కాగానే? ఈ రెండు ప్రాజెక్టులకు కేంద్రం ఆమోద ముద్ర పడనుంది. ఆ వెంటనే విజయవాడ, విశాఖల్లో మెట్రో రైలు ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ కూడా ప్రారంభం కానుంది. వెరసి అతి త్వరలోనే ఈ రెండు నగరాల్లో మెట్రో రైలు సేవలు అందుబాటులోకి రానున్నాయన్న మాట. రెండు నగరాల్లో మొత్తంగా 84.63 కిలో మీటర్ల మేర మెట్రో రైలు సేవలు అందుబాటులోకి వస్తాయి.ఇక విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టు విషయానికి వస్తే..పండిట్ నెహ్రూ బస్టాండ్ నుంచి గన్నవరం, పెనమలూరు దారా తొలి దశ మెట్రో రైలు సేవలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు బందరు రోడ్డు, ఏలూ రోడ్డు, గన్నవరం, పెనమలూరుల్లో భూసేకరణకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. నగరంలో 38.40 కిలో మీటర్ల మేర ఏర్పాటు కానున్న మెట్రో ప్రాజెక్టుకు రూ.10,118 కోట్ల నిధులు అవసరం కానున్నాయి. బస్టాండ్ నుంచి గన్నవరం, పెనమలూరుల వరకు రెండు మార్గాల్లో మెట్రో ఏర్పాటు కానుంది. విశాఖ మెట్రో విషయానికి వస్తే? నగరంలో మూడు మార్గాల్లో 46.22 కిలో మీటర్ల మేర మెట్రో రైలు ప్రాజెక్టు ఏర్పాటు కానుంది.

ట్రాన్స్ జెండర్లకు లోకల్ బాడీస్ లో రిజర్వేషన్



హైదరాబాద్ : హైదరాబాద్‌తో పాటు తెలంగాణవ్యాప్తంగా నకిలీ హిజ్రాలు, క్రాస్ డ్రెస్సర్లు శుభకార్యాలు, వ్యాపార సంస్థల వద్దకు వెళ్లి బరితెగించి దందాలు చేయడం, అసభ్యకర ప్రవర్తనతో బెదిరించి డబ్బులు వసూలు చేయడంపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. అదే సమయంలో, సమాజంలో వివక్షకు గురవుతున్న నిజమైన ట్రాన్స్‌జెండర్లను నేర మార్గం లేదా భిక్షాటన నుంచి బయటకు తీసి, వారిని గౌరవప్రదమైన వ్యవస్థలో భాగస్వాములను చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటోంది. కేవలం పోలీసుల లాఠీలతో శాంతిభద్రతల సమస్యను తీర్చడమే కాకుండా, వారికి రాజకీయ, సామాజిక సాధికారత కల్పించే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం వేస్తున్న అడుగులు ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమవుతున్నాయి.ట్రాన్స్‌జెండర్ల సాధికారతలో భాగంగా తెలంగాణ అసెంబ్లీ ఇటీవల ఒక విప్లవాత్మక బిల్లుకు ఆమోదముద్ర వేసింది. తెలంగాణ మున్సిపాలిటీల చట్టం-2019 కి అవసరమైన కీలక సవరణలు చేస్తూ తెలంగాణ మున్సిపాలిటీల సవరణ బిల్లు ను శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ నూతన చట్ట సవరణ ప్రకారం.. హైదరాబాద్ నగరానికి సంబంధించి కోర్ అర్బన్ రీజియన్ వెలుపల ఉన్న రాష్ట్రంలోని 9 ప్రధాన మున్సిపల్ కార్పొరేషన్లలో వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం, రామగుండం వంటి కార్పొరేషన్లలో ట్రాన్స్‌జెండర్లకు స్థానిక పాలనలో అవకాశం కల్పిస్తారు. ప్రతి మున్సిపల్ కార్పొరేషన్‌లో ఒక ట్రాన్స్‌జెండర్‌ను కో-ఆప్షన్ సభ్యుడిగా ప్రభుత్వం నేరుగా నామినేట్ చేయనుంది.స్థానిక ప్రభుత్వాల చట్టాల్లో ఒక సామాజిక వర్గానికి, అదీ ప్రత్యేకంగా ట్రాన్స్‌జెండర్లకు కౌన్సిల్స్ లేదా కార్పొరేషన్లలో చట్టబద్ధంగా కో-ఆప్షన్ సభ్యత్వాలు కల్పించడం భారతదేశంలోనే ఇది మొదటిసారి. నిర్ణయాధికారం ఉన్న స్థానిక పాలకమండళ్లలో వారు కూర్చోవడం ద్వారా తమ సామాజిక వర్గం ఎదుర్కొంటున్న ఆవాస, విద్యా, ఆరోగ్య సమస్యలను నేరుగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే అవకాశం లభిస్తుంది. ఉనికి కోల్పోయిన వర్గానికి చట్టసభలు, పాలనా వ్యవస్థల్లో భాగస్వామ్యం కల్పించడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని పాలనా నిపుణులు అభిప్రాయపడుతున్నారు.కేవలం రాజకీయ ప్రాతినిధ్యానికే పరిమితం కాకుండా, రేవంత్ రెడ్డి ప్రభుత్వం ట్రాన్స్‌జెండర్లకు ప్రభుత్వ రంగాల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది. ఇటీవల తెలంగాణ హైడ్రా వ్యవస్థలో ట్రాన్స్‌జెండర్లను కమాండోలుగా నియమించడం, నిరసనలు, ఆక్రమణల తొలగింపు వేళ వారి సేవలను వాడుకోవడం నగరంలో పెద్ద ట్విస్ట్‌గా మారింది. అంతేకాకుండా, ట్రాఫిక్ నిర్వహణ కోసం ట్రాఫిక్ వాలంటీర్లు గా కూడా ట్రాన్స్‌జెండర్లను నియమించి వారికి నిలకడైన వేతనాలు అందిస్తున్నారు. ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లుగా, ఇతర ప్రభుత్వ శాఖల్లో ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన అవకాశం కల్పించేందుకు ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి.ఒకవైపు క్రాస్ డ్రెస్సర్లు, నకిలీ హిజ్రాల పేరుతో అమాయక ప్రజలను, నవ దంపతులను వేధిస్తున్న ముఠాలపై ఖాకీలు కఠిన చర్యలు తీసుకుంటుంటే.. మరొకవైపు అర్హులైన ట్రాన్స్‌జెండర్లకు ప్రభుత్వమే అధికారిక గుర్తింపు, ఉద్యోగాలు, రాజకీయ అవకాశాలు ఇవ్వడం వల్ల స్పష్టమైన గీత ఏర్పడుతోంది. కఠినమైన లా అండ్ ఆర్డర్ చర్యలతో పాటు సమాంతరంగా సామాజిక పునరావాసం, ప్రజాస్వామ్య ప్రాతినిధ్యం కల్పించడం తెలంగాణ ప్రభుత్వ దార్శనికతకు అద్దం పడుతోంది. నకిలీ దందాలను అరికడుతూనే, చట్టసభల్లో సవరణల ద్వారా 9 కార్పొరేషన్లలో ట్రాన్స్‌జెండర్లకు కో-ఆప్షన్ సభ్యులుగా చట్టబద్ధమైన స్థానం కల్పించడం తెలంగాణ మోడల్‌ను దేశంలోనే ప్రత్యేకంగా నిలబెట్టింది. ఈ నిర్ణయాలు క్షేత్రస్థాయిలో సంపూర్ణంగా అమలైతే, నగరంలో హిజ్రాల వేధింపుల సమస్య శాశ్వతంగా రూపుమాసిపోవడానికి ఎంతో సమయం పట్టకపోవచ్చునని అంచనా వేస్తున్నారు.

22ఏపై డైరక్ట్ ఫైట్..



హైదరాబాద్, : శాసనమండలి సమావేశాలు నిరవధికంగా వాయిదా పడినప్పటికీ.. శాసనసభను మాత్రం పొడిగించి, రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22ఏ అంశంపై స్వల్పకాలిక చర్చను కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించడం వెనుక కాంగ్రెస్ పక్కా రాజకీయ, వ్యూహాత్మక లెక్కలు ఉన్నట్లు స్పష్టమవుతోంది. సాధారణంగా ఒక సెషన్ ముగింపు దశకు చేరినప్పుడు ఉభయ సభలూ ఒకేసారి నిరవధికంగా వాయిదా పడటం ఆనవాయితీ. కానీ, అసెంబ్లీని ప్రత్యేకంగా కొనసాగించడం ద్వారా.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం భూ వివాదాలు, ధరణి చుట్టూ గత బీఆర్ఎస్ పాలనలో జరిగిన చీకటి ఒప్పందాలను అసెంబ్లీ రికార్డుల్లో అధికారికంగా నమోదు చేయించేందుకు ఒక భారీ రాజకీయ వేదికను సిద్ధం చేసుకుందని భావిస్తున్నారు.ఈ చర్చ కాంగ్రెస్ ప్రభుత్వానికి రెండు విధాలుగా కలిసివచ్చే అస్త్రం. మొదటిది.. అసెంబ్లీలో బీఆర్ఎస్ సభ్యులు సస్పెన్షన్‌కు గురికావడంతో, సభలో ప్రభుత్వ దూకుడును అడ్డుకునే లేదా ప్రతిపక్ష వాణిని బలంగా వినిపించే ప్రధాన ప్రతిపక్ష గొంతు లేకుండా పోయింది. స్పీకర్ వివాదం, అరెస్టులతో వచ్చిన రాజకీయ రగడను పక్కకునెట్టి.. ప్రజలతో నేరుగా ముడిపడి ఉన్న భూ సమస్యల వైపు ప్రజా దృష్టిని మళ్లించేందుకు ఇది అద్భుతమైన అవకాశం. తెలంగాణ సమాజంలో ధరణి పోర్టల్, సెక్షన్ 22ఏ కింద లక్షలాది ఎకరాల పట్టా భూములు నిషేధిత జాబితాలో చిక్కుకుపోయి రైతులు, మధ్యతరగతి ప్రజలు పడిన వేదన అంతా ఇంతా కాదు. ఈ సున్నితమైన అంశంపై రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా వివరాలు బహిర్గతం చేస్తే, అది ప్రజల్లో బీఆర్ఎస్‌పై ఉన్న పాత వ్యతిరేకతను మళ్లీ తాజా పరుస్తుందన్నది ప్రభుత్వ వ్యూహం.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకుని జరిగిన భూ బదలాయింపులు, హైదరాబాద్ శివార్లతో పాటు రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లో విలువైన అసైన్డ్, ఇనాం, వక్ఫ్, దేవాదాయ భూములను సెక్షన్ 22ఏ నుంచి ఎలా తప్పించారు? వాటిని ఎవరి బినామీలకు కట్టబెట్టారు? అన్న రికార్డులను రేవంత్ రెడ్డి సభ ముందు ఉంచే అవకాశాలు మెండుగా ఉన్నాయి. గతంలో ధరణి వ్యవహారాలను నడిపిన ఒకరిద్దరు ఉన్నతాధికారులు, కీలక నేతల కనుసన్నల్లోనే వేల కోట్ల విలువైన భూముల నిషేధాలను ఎత్తివేశారనే ఆరోపణలు ఉన్నాయి. వాటికి సంబంధించిన సర్వే నంబర్లు, రికార్డుల సవరణ తేదీలు, అక్రమ రిజిస్ట్రేషన్ల ఫైళ్లను స్వయంగా ముఖ్యమంత్రి అసెంబ్లీలో ప్రవేశపెట్టి ధరణి బండారాన్ని బట్టబయలు చేయనున్నారన్న ప్రచారం జరుగుతోంది. అదే సమయంలో, కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొస్తున్న భూ భారతి వ్యవస్థ ద్వారా తాము ఆ సమస్యలను ఎలా పరిష్కరిస్తున్నామో ప్రజలకు వివరించడం రేవంత్ రెడ్డి లక్ష్యం. నిషేధిత జాబితాలో అన్యాయంగా చిక్కుకుపోయిన నిజమైన రైతుల భూములను విముక్తి చేసేందుకు విధివిధానాలను, కలెక్టర్లకు ఇచ్చిన అధికారాలను వివరిస్తూ.. తాము పరిష్కారకర్తలు అనే ఇమేజ్‌ను సొంతం చేసుకోవాలని చూస్తున్నారు. మండలిని పక్కనపెట్టి అసెంబ్లీలో 22ఏ చర్చను కొనసాగించడం అనేది బీఆర్ఎస్‌ను పూర్తిగా డిఫెన్స్‌లోకి నెట్టే పక్కా పొలిటికల్ చెక్‌మేట్. స్పీకర్ నిరసనలతో మైలేజ్ సాధించాలనుకున్న గులాబీ పార్టీకి, అసెంబ్లీ సాక్షిగా 'ధరణి స్కామ్' రూపంలో ఎదురుదెబ్బ కొట్టేందుకు రేవంత్ రెడ్డి రంగం సిద్ధం చేశారు.

ఎవరీ ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్



హైదరాబాద్ : ఆగాఖాన్ 5 తెలంగాణ పర్యటన రాష్ట్ర అభివృద్ధి ముఖచిత్రంలో ఒక కీలక మైలురాయిగా నిలిచింది. హైదరాబాద్ పర్యటనకు విచ్చేసిన ఆయనకు తెలంగాణ ప్రభుత్వం ఘన స్వాగతం పలికింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా చారిత్రక ఫలక్‌నుమా ప్యాలెస్‌కు వెళ్లి ప్రిన్స్ రహీమ్‌తో సమావేశమయ్యారు. తెలంగాణను అంతర్జాతీయ స్థాయి పెట్టుబడుల కేంద్రంగా నిలిపే లక్ష్యంతో ప్రభుత్వం నిర్వహించనున్న 'తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'కు ముఖ్య అతిథిగా హాజరు కావాల్సిందిగా ఆహ్వానించారు. మరోవైపు, తెలంగాణ గవర్నర్ సైతం ఆగా ఖాన్ డెవలప్‌మెంట్ నెట్‌వర్క్ అందిస్తున్న సేవలను కొనియాడుతూ, రాష్ట్ర సమగ్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు.ప్రపంచవ్యాప్తంగా దాదాపు 1.5 కోట్ల మందికి పైగా ఉన్న షియా ఇస్మాయిలీ ముస్లింల ఆధ్యాత్మిక గురువుకు ఇచ్చే వంశపారంపర్య గౌరవ నామమే 'ఆగా ఖాన్'. ప్రవక్త ముహమ్మద్ వారసత్వ పరంపరలో ఇస్మాయిలీ ఇమామ్‌ల నాయకత్వం కొనసాగుతోంది. ప్రస్తుతం ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్ 5 ఈ ప్రతిష్టాత్మక బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. ప్రపంచ వేదికలపై పేదరిక నిర్మూలన, విద్య, వైద్యం, పర్యావరణ పరిరక్షణ, చారిత్రక కట్టడాల సంరక్షణలో తన వంశ ప్రతిష్టను చాటుతున్నారు.ఆగా ఖాన్ డెవలప్‌మెంట్ నెట్‌వర్క్ అనేది లాభాపేక్ష లేని ప్రపంచంలోనే అతిపెద్ద ప్రైవేట్ అంతర్జాతీయ అభివృద్ధి సంస్థల్లో ఒకటి. మతం, కులం, జాతితో సంబంధం లేకుండా నిరుపేదలు, అణగారిన వర్గాల జీవన ప్రమాణాలను పెంచడమే దీని ప్రధాన లక్ష్యం. అంతర్జాతీయ స్థాయి విశ్వవిద్యాలయాలు, పరిశోధనా కేంద్రాలు, నాణ్యమైన ఆసుపత్రుల నిర్వహిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో మైక్రోఫైనాన్స్, పర్యావరణ అనుకూల మౌలిక సదుపాయాలను కల్పిస్తోంది. ఆగా ఖాన్ ట్రస్ట్ ఫర్ కల్చర్ ద్వారా ప్రపంచ ప్రఖ్యాత చారిత్రక కట్టడాలు, హెరిటేజ్ ప్రదేశాల పునరుద్ధరణ చేపట్టింది.హైదరాబాద్ నగరంతో ఈ సంస్థకు దశాబ్దాల బంధం ఉంది. కుతుబ్ షాహీ సమాధుల పునరుద్ధరణ ప్రాజెక్టును అత్యంత శాస్త్రీయంగా చేపట్టి, ప్రపంచ స్థాయి వారసత్వ సంపదగా తీర్చిదిద్దడంలో ఆగా ఖాన్ ట్రస్ట్ కీలక పాత్ర పోషించింది. అలాగే శంషాబాద్ సమీపంలో ఏర్పాటైన 'ఆగా ఖాన్ అకాడమీ' ద్వారా ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్య అందుతోంది.తెలంగాణ ప్రభుత్వం ప్రస్తుతం సాంప్రదాయ పారిశ్రామిక అభివృద్ధి మాత్రమే కాకుండా సుస్థిర అభివృద్ధి, హెరిటేజ్ టూరిజం, సామాజిక మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ క్రమంలో భాగస్వామ్యం రాష్ట్రానికి ఎంతో మేలు చేస్తుందని భావిస్తోంది. ఆగా ఖాన్ సంస్థలతో అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు, పరస్పర సహకార వేదికలు 'తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'కు అంతర్జాతీయ విశ్వసనీయతను తెస్తాయి. హైదరాబాద్‌లోని చారిత్రక కట్టడాల పరిరక్షణ, మూసీ నది పునరుజ్జీవనం, అర్బన్ ప్లానింగ్ వంటి ప్రాజెక్టుల్లో ఆగాఖాన్ అనుభవాన్ని ప్రభుత్వం వినియోగించుకోవచ్చు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలన, నాణ్యమైన విద్య, ఆరోగ్య రంగాల్లో పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యాలకు ఇది బాటలు వేస్తుంది. వాతావరణ మార్పులను తట్టుకునే సుస్థిర పట్టణాభివృద్ధి విధానాల్లో సాంకేతిక సహకారం లభిస్తుంది. అందుకే ఆగాఖాన్ ఫౌండేషన్ తో తెలంగాణ బలమైన బంధాన్ని కోరుకుంటోంది.

22న ఏపీ ఎన్నికలకు నోటిఫికేషన్



హైదరాబాద్, : ఏపీలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధత ప్రక్రియ స్పీడందుకుంది. 12 నగరపాలక సంస్థలు, 29 పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో వార్డుల వారీగా ఫొటో ఓటర్ల జాబితాను రూపొందించి, ప్రచురణ చేసేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేసింది. ఈ మేరకు రెండు వేర్వేరు నోటిఫికేషన్లను జారీ చేసినట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేతా ప్రకటించారు. ఫారం-1 నోటీసుతో పాటు వార్డుల వారీ ఫొటో ఓటర్ల జాబితాలను సెప్టెంబర్ 22న ప్రకటించాలని నిర్ణయించారు. ఈ ఏడాది జనవరి 1వ తేదీని అర్హత తేదీగా పరిగణించి, తాజా అసెంబ్లీ ఓటర్ల జాబితా ఆధారంగా ఈ లిస్ట్‌ను రూపొందించాలని సూచించారు. మొత్తం 17 నగర పాలక సంస్థలకు గాను విజయనగరం కార్పొరేషన్‌లో వార్డుల పునర్విభజన ప్రక్రియ ముందుగా పూర్తి చేయనున్నారు. దీంతో అక్కడ సెప్టెంబర్ 3 నాటికే ఓటర్ల లిస్ట్ ప్రచురణ పూర్తి చేయనున్నారు. రాష్ట్రంలోని 106 పురపాలక, నగర పంచాయతీల్లో డిలిమిటేషన్ పూర్తైన 58 చోట్ల సెప్టెంబరు 3నే ఓటర్ల జాబితాలను ప్రకటించారు. మిగిలిన 12 నగర పాలక సంస్థలు, 29 పురపాలక, నగర పంచాయతీల్లో వార్డుల పునర్విభజన ప్రక్రియ సెప్టెంబరు 14 నుంచి 17 మధ్య పూర్తి చేయనున్నారు. దీంతో ఆయా చోట్ల ఓటర్ల లిస్టుల ప్రచురణకు కొత్త తేదీని ఖరారు చేయాలని పురపాలక శాఖ సెప్టెంబరు 13న ఎలక్షన్ కమిషన్‌కు లేఖ రాసింది. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు ఎస్ఈసీ.. సెప్టెంబరు 22న ప్రచురణ తేదీగా ఖరారు చేస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఓటర్ల లిస్టుల ప్రచురణతో ఆయా పట్టణ స్థానిక సంస్థల్లో ఎన్నికల నిర్వహణకు ఎస్ఈసీ రెడీ అవుతోంది. మేయర్లు, పురపాలక ఛైర్మన్లు, వార్డు సభ్యుల స్థానాలకు సంబంధించిన రిజర్వేషన్లు ఖరారు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి మార్గం సుగమం అవ్వనుంది. కార్పొరేషన్ కమిషనర్లు , మున్సిపల్ కమిషనర్లు ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ స్పీడందుకోవడంతో ఇప్పటికే రాజకీయ పార్టీల్లో ఆసక్తి నెలకొంది. పురపాలక ఎన్నికలకు అవసరమైన పాలనా, ఎన్నికలపర ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేసేందుకు ఎస్ఈసీ చర్యలు ప్రారంభించింది. ఓటర్ల జాబితా ప్రక్రియ పూర్తయిన తర్వాత ఎన్నికల నిర్వహణకు అవసరమైన చర్యలపై ఎన్నికల సంఘం దృష్టి సారించనుంది. 12 నగరపాలక సంస్థలు, 29 పురపాలక సంఘాల్లో ఓటర్ల జాబితాల తయారీకి సంబంధించి తాజా నోటిఫికేషన్ల జారీతో పురపాలక ఎన్నికల ప్రక్రియకు ముందడుగు పడింది. ఈ నెల 22న వార్డుల వారీగా లిస్టులు ప్రచురించనున్నారు. పట్టణ ప్రాంతాల్లో రాజకీయ పార్టీల కార్యక్రమాలు ఊపందుకోనున్నాయి.

ఎవరికి వారే యమునా తీరే... బీజేపీ ఎమ్మెల్యేలు రూటే..!

హైదరాబాద్ : తెలంగాణలో అధికారమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నామని చెప్పుకునే భారతీయ జనతా పార్టీని క్షేత్రస్థాయిలో అంతర్గత కుమ్ములాటలు, నమన్వయ లోపం తీవ్రంగా వెంటాడుతున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు ప్రత్యామ్నాయంగా ఎదగడానికి రాజకీయంగా ఎంతో సానుకూల వాతావరణం, ప్రజల్లో ఆదరణ కనిపిస్తున్నప్పటికీ.. పార్టీలోని నేతల వైఖరి మాత్రం అందుకు పూర్తి విరుద్ధంగా ఉంటోంది. ఒకరిపై ఒకరు ఆధిపత్యం ప్రదర్శించుకోవడం, అంతర్గతంగా గోతులు తవ్వుకోవడం వంటి పరిణామాలు పార్టీ ఎదుగుదలకు ప్రధాన అవరోధంగా మారుతున్నాయి. ఇటీవలి అసెంబ్లీ సమావేశాల్లో బీజేపీ ఎమ్మెల్యేల వ్యవహారశైలి ఈ వాదనలకు మరింత బలాన్ని చేకూర్చింది.అసెంబ్లీలో ప్రభుత్వంపై సమష్టిగా పోరాడి, ప్రజా సమస్యలపై గళమెత్తాల్సిన బీజేపీ ఎమ్మెల్యేలు ఎవరికి వారే యమునా తీరే అన్న రీతిలో వ్యవహరించడం చర్చనీయాంశమైంది. ప్రభుత్వ విధానాలను ఎండగట్టడంలో ఉమ్మడి వ్యూహం పూర్తిగా కొరవడింది. ఒకవైపు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని భావిస్తున్న తరుణంలో, కొందరు ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రితో ప్రత్యేకంగా బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్‌లలో పాల్గొనడం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపింది. మరికొందరు సభ్యులు సభ సాక్షిగానే మంత్రులపై బహిరంగంగా పొగడ్తల వర్షం కురిపించడం సొంత పార్టీ శ్రేణులకే విస్మయం కలిగించింది.ముఖ్యంగా విధానపరమైన నిర్ణయాలపై కూడా బీజేపీ ఎమ్మెల్యేల మధ్య ఏకాభిప్రాయం కనిపించలేదు. కీలకమైన డేటా సెంటర్ల ఏర్పాటు విషయంలో ఒక ఎమ్మెల్యే వ్యతిరేక గళం వినిపిస్తే, మరో ఎమ్మెల్యే అదే వేదికపై స్వాగతిస్తూ మాట్లాడటం తీవ్ర సమన్వయ లోపాన్ని బహిర్గతం చేసింది. ప్రజా సమస్యలపై పోరాటాల్లోనూ ఇదే ఒంటెద్దు పోకడ కనిపించింది. ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ పంటల బీమా పథకం అమలు కోరుతూ అసెంబ్లీకి వినూత్నంగా ట్రాక్టర్‌పై ర్యాలీగా రాగా, ఆ నిరసనలో తోటి ఎమ్మెల్యేలెవరూ పాలుపంచుకోకపోవడం పార్టీలోని విభేదాలను స్పష్టం చేసింది.సమావేశాల ప్రారంభం నుంచి ప్రభుత్వం బీజేపీ పట్ల వ్యవహరించిన తీరుపై పార్టీ నాయకత్వంలో అసంతృప్తి వ్యక్తమైంది. మొదటి మూడు రోజుల పాటు బీజేపీ సభ్యులు ఇచ్చిన వాయిదా తీర్మానాలను స్పీకర్ తిరస్కరించడం, ప్రశ్నలకు సరైన సమాధానాలు రాకపోగా ఎదురుదాడి జరగడంతో ఆఖరి రోజు సభను బహిష్కరించాలని పార్టీ నిర్ణయించినట్లు సమాచారం. అయితే, ఈ నిర్ణయంపై ఎమ్మెల్యేలంతా ఏకతాటిపైకి రాలేకపోయారు. పార్టీ వ్యూహాన్ని లెక్కచేయకుండా నాలుగో రోజు కొందరు ఎమ్మెల్యేలు యథావిధిగా సభకు హాజరయ్యారు. ఒక ప్రజాస్వామ్య వేదికపై పార్టీగా నిలబడాల్సిన కీలక సమయంలో ఇలాంటి క్రమశిక్షణా రాహిత్యం బహిర్గతం కావడం రాజకీయంగా బీజేపీని ఆత్మరక్షణలో పడేసింది.తెలంగాణ రాజకీయాల్లో కాంగ్రెస్‌కు దీటైన ప్రతిపక్షంగా అవతరించేందుకు బీజేపీకి విస్తృతమైన అవకాశాలున్నాయి. అయితే, సమర్థవంతమైన నాయకత్వ నిర్మాణం లేకపోవడం, ఉన్న నేతలు కలిసికట్టుగా అడుగులు వేయకపోవడం పార్టీకి శాపంగా మారుతోంది. అసెంబ్లీ వేదికగా ప్రజల పక్షాన నిలబడాల్సిన వేళ.. తమ స్వప్రయోజనాలు, భిన్నాభిప్రాయాలకే ప్రాధాన్యం ఇస్తున్న తీరు క్షేత్రస్థాయి కార్యకర్తలను తీవ్ర గందరగోళానికి గురిచేస్తోంది. అసెంబ్లీ సాక్షిగా బట్టబయలైన ఈ అంతర్గత విభేదాలు, వ్యక్తిగత ఎజెండాలు ఇలాగే కొనసాగితే.. ప్రజల్లో పార్టీపై విశ్వసనీయత సన్నగిల్లే ప్రమాదం ఉందని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.

పొలిటిక్స్ లోకి హైడ్రా రంగనాథ్.. పోటీ అక్కడి నుంచే..?



హైదరాబాద్, : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ నగరంలో చెరువులు.. కుంటలు.. నాలాల ఆక్రమణ లేకుండా హైడ్రా అనే వ్యవస్థను తెరమీదకు తీసుకొచ్చారు. దీనికి కమిషనర్ గా సీనియర్ ఐపీఎస్ అధికారి రంగనాథ్ ను నియమించారు.రంగనాథ్ కు ముక్కుసూటిగా పని చేస్తారు అనే పేరు ఉంది. పైగా ఆయన గతంలో తెలంగాణలో అనేక ప్రాంతాలలో పోలీసు ఉన్నతాధికారిగా పని చేశారు. అనేక కీలకమైన కేసులను సాల్వ్ చేశారు. భూ అక్రమలకు పాల్పడే వ్యక్తుల గుండెల్లో నిద్రపోయారు. అంతటి కేసీఆర్ కూడా వరంగల్ లాంటి నగరానికి కమిషనర్ పోలీస్ గా రంగనాథ్ ను నియమించారు.రంగనాథ్ ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మానస పుత్రిక హైడ్రాకు కమిషనర్ గా వ్యవహరిస్తున్నారు. అనేక చెరువులను రక్షించారు. కుంటలను బాగు చేశారు. నాలాలను పరిరక్షించారు. ఒక ముక్కలో చెప్పాలంటే విప్లవాత్మక విధానాలకు శ్రీకారం చుడుతున్నారు. కోర్టుల ద్వారా కొంతమంది వ్యక్తులు ఆయనకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నప్పటికీ.. రంగనాథ్ కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నుంచి బలమైన సపోర్టు లభిస్తుంది. ఇటీవల హైకోర్టు ఇచ్చిన తీర్పు సవాల్ చేస్తూ మళ్ళీ ప్రభుత్వం హైకోర్టులో వేరే బెంచ్ ను ఆశ్రయించడంతో రంగనాథ్ మీద వచ్చిన వ్యతిరేకత ఒక్కసారిగా పత్తా లేకుండా పోయింది.రంగనాథ్ గురించి ఇప్పుడు ఆసక్తికరమైన విషయం ఒకటి చర్చకు దారి తీస్తోంది. హైదరాబాద్ నగరంలో మున్నూరు కాపుల ఆత్మీయ సమ్మేళనానికి రంగనాథ్ హాజరయ్యారు. ఈ సమయంలో కూటమిలో ఉన్న నాయకులు మొత్తం హాజరు కావడం విశేషం. ఎంపీలు సానా సతీష్.. లక్ష్మణ్.. ఇంకా మున్నూరు కాపు సామాజిక వర్గంలో కీరకమైన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు వంటి వారి హాజరయ్యారు. దానికి రంగనాథ కూడా హాజరయ్యారు. వాస్తవానికి కుల సంఘాల సమావేశాలకు.. ఇతర భేటీలకు రంగనాథ్ హాజరవుతూనే ఉంటారు. ఈ విషయంలో ఆయన మీద విమర్శలు ఉన్నప్పటికీ పట్టించుకోరు. అయితే కూటమిలో ఉన్న ఎంపీలు. ఇతర నాయకులు హాజరైన నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లో రంగనాథ్ ఎంపీగా పోటీ చేస్తారని తెలుస్తోంది.ఏపీలోని ఏదో ఒక నియోజకవర్గం నుంచి ఆయన బరిలో ఉంటారని ప్రచారం జరుగుతోంది. వాస్తవానికి పోలీసు అధికారులు రాజకీయ నాయకులుగా మారిన ఉదాహరణలు అనేక ఉన్నాయి. దీనికి రంగనాథ్ మినహాయింపు కాదు. పైగా రంగనాథ్ కు కూడా పొలిటికల్ లక్ష్యాలు ఉన్నాయని తెలుస్తోంది. ఈ ప్రకారం చేసుకుంటే వచ్చే ఎన్నికల్లో కూటమి లో ఉన్న ఏదో ఒక పార్టీ నుంచి ఆయన పోటీ చేసే అవకాశం ఉంది. గతంలో ఆయన పవన్ కళ్యాణ్ ను కలిశారు. చిరంజీవి కుటుంబానికి అత్యంత ఆప్తుడిగా ముద్రపడ్డారు. ఈ నేపథ్యంలో జనసేనలో చేరి.. ఎంపీగా పోటీ చేసే అవకాశాలు ఉన్నాయి తెలుస్తోంది. అయితే ఇది ప్రచారమేనా.. ఊహగానామా అనేది త్వరలోనే తేలనుంది.

ఇరుకురోడ్ల విస్తరణ పనులు షురూ...

హైదరాబాద్, : హైదరాబాద్ కేబీఆర్ పార్క్ చుట్టూ అమలు చేస్తున్న వన్‌వే ట్రాఫిక్ విధానం 15 రోజులు పూర్తయిన నేపథ్యంలో హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనర్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించారు. ఫిల్మ్‌నగర్, జర్నలిస్ట్ కాలనీ, రోడ్ నంబర్ 45, జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు, కేబీఆర్ పార్క్ మెయిన్‌గేట్ ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను గమనించారు. బాటిల్‌నెక్స్ తొలగించేందుకు రోడ్ల విస్తరణ, మరమ్మతులు, డ్రైనేజీ సమస్యల పరిష్కారం, యుటిలిటీల తరలింపునకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు చుట్టూ వన్‌వే విధానం అమలవుతున్న సంగతి తెలిసిందే. కొత్త అండర్‌పాసులు, బ్రిడ్జిల నేపథ్యంలో ఈ మార్గంలో వన్‌వే విధానం అమలు చేస్తున్నారు. అయితే వన్ వే తీరుతెన్నులను హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వన్ వే అమల్లోకి వచ్చి దాదాపు 15 రోజులు పూర్తయిన నేపథ్యంలో ఇప్పటివరకు గమనించిన అంశాలు, ఆ మార్గంలోని వాహనదారుల నుంచి వచ్చిన సూచనలను పరిగణనలోకి తీసుకుంటూ వివిధ విభాగాల ఉన్నతాధికారులతో కలిసి వారు క్షేత్రస్థాయిలో పర్యటించారు.

కొండా కు దారెటు..?



తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం అత్యంత హాట్ టాపిక్‌గా మారిన పేరు కొండా సురేఖ. మంత్రివర్గం నుంచి అనూహ్య పరిణామాల నేపథ్యంలో బర్తరఫ్ అయిన తర్వాత ఆమె రాజకీయ భవిష్యత్తు ఎటు వైపు పయనిస్తుందనే దానిపై తీవ్ర చర్చ జరుగుతోంది. కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతానని, పార్టీ మారే ప్రసక్తే లేదని ఆమె బహిరంగంగానే స్పష్టం చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలో చోటుచేసుకుంటున్న పరిణామాలు మాత్రం ఇందుకు భిన్నమైన సంకేతాలను ఇస్తున్నాయి. పార్టీలో ఆమె పాత్ర, తీసుకుంటున్న నిర్ణయాలు పలు అనుమానాలకు తావిస్తున్నాయి.మంత్రి పదవిని కోల్పోయిన తర్వాత కొండా సురేఖ అసెంబ్లీ సమావేశాలకు పూర్తిగా దూరంగా ఉంటున్నారు. అంతేకాకుండా, అత్యంత కీలకమైన సీఎల్పీ సమావేశానికి కూడా ఆమె హాజరుకాకపోవడం రాజకీయ వర్గాల్లో అనేక అనుమానాలకు తావిచ్చింది. ఒక మంత్రిగా చక్రం తిప్పిన వ్యక్తి, అదే సభలో సాధారణ ఎమ్మెల్యేగా అడుగుపెట్టడం మానసికంగా కాస్త ఇబ్బందికరంగా ఉండడం సహజం. కానీ, ఇది కేవలం వ్యక్తిగత ఇబ్బంది మాత్రమే కాదని, పార్టీ నాయకత్వం అవలంబిస్తున్న వైఖరిపై, తనను బర్తరఫ్ చేసిన తీరుపై ఆమె నిరసన గళం వినిపిస్తున్నారనేది రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. పార్టీ తీరుపై అలిగినందుకే ఆమె సభకు, పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారనే వాదన బలపడుతోంది.మరోవైపు, మాజీ ఓఎస్డీకి సంబంధించిన వ్యవహారం కొండా సురేఖను మరింత ఇబ్బందికర పరిస్థితులోకి నెట్టింది. ఈ అంశానికి సంబంధించి పోలీసులు తనను, తన అనుచరులను అనవసరంగా వేధిస్తున్నారంటూ ఆమె తీవ్ర ఆవేదన చెందుతున్నట్లు సమాచారం. అధికార పార్టీలో ఉంటూనే ఇలాంటి పోలీసు వేధింపులను ఎదుర్కోవాల్సి రావడం, సొంత పార్టీ నుంచి తగిన రక్షణ లేకపోవడం ఆమెను తీవ్ర మనస్తాపానికి గురిచేసినట్లు తెలుస్తోంది. ఈ పరిణామాలు ఆమెను పార్టీ అధిష్టానానికి దూరం చేస్తున్నాయా లేక మరింత ఒంటరి చేస్తున్నాయా అనేది ప్రశ్నార్థకంగా మారింది.ఈ వివాదాల నేపథ్యంలో, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్ చార్జ్ మీనాక్షి నటరాజన్ స్వయంగా కొండా సురేఖకు ఫోన్ చేశారని, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని సూచించారంటూ పెద్ద ఎత్తున వార్తలు గుప్పుమన్నాయి. అయితే ఇవన్నీ కేవలం ఊహాగానాలేనని, సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారం మాత్రమేనని పార్టీ వర్గాలు కొట్టిపారేస్తున్నాయి. అధిష్టానం నుంచి ఎలాంటి అధికారిక జోక్యం లేకపోవడం లేదా ఈ అంశంపై హైకమాండ్ మౌనం వహించడం వెనుక వ్యూహం ఏమిటనేది అంతుచిక్కడం లేదు.ఒకవైపు కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతానని చెబుతూనే, మరోవైపు కీలక సమావేశాలకు, అసెంబ్లీకి పూర్తిగా దూరంగా ఉండడం అనుమానాలకు బలం చేకూరుస్తోంది. సురేఖ అనుసరిస్తున్న ఈ వ్యూహం భవిష్యత్తులో ఎలాంటి సంచలన నిర్ణయాలకు దారితీస్తుందోనని ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మంత్రి పదవి కోల్పోయిన బాధ, మాజీ ఓఎస్డీ వ్యవహారంలో ఎదురవుతున్న ఒత్తిళ్లు, పార్టీ అంతర్గత సర్దుబాట్ల మధ్య కొండా సురేఖ భవిష్యత్తు ఎలా ఉంటుందనేది అత్యంత ఆసక్తిగా మారింది.

శంకర్ పై మళ్లీ రౌడీషీట్...!?



హైదరాబాద్ : హైదరాబాద్‌లోని పాతబస్తీ, సెంట్రల్ జోన్ పరిధిలో ఒకప్పుడు సంచలనం సృష్టించిన చిన్నబోయిన శంకర్ అలియాస్ అంబర్‌పేట శంకర్ పేరు నగరంలో మళ్లీ హాట్ టాపిక్‌గా మారింది. గతాన్ని మరిచిపోయి మంచివాడిగా మారినట్లుగా నటిస్తున్న ఈ పాత నేరస్తుడిపై అంబర్‌పేట పోలీసులు తాజాగా మరోసారి రౌడీషీట్ రీఓపెన్ చేశారు. గతంలో ఇతనిపై ఉన్న కేసుల తీవ్రత తగ్గడం, కొత్త నేరాలకు దూరంగా ఉన్నాడనే నెపంతో 2019లో రౌడీషీట్‌ను ఎత్తివేసినప్పటికీ.. ఇటీవల కాలంలో వరుసగా వివాదాస్పద సెటిల్మెంట్లు, బెదిరింపులకు పాల్పడుతుండటంతో పోలీసులు మళ్లీ ఫోకస్ పెట్టారు.అంబర్‌పేట శంకర్ నేర చరిత్రను పరిశీలిస్తే.. నగరంలో ల్యాండ్ సెటిల్‌మెంట్లు, కబ్జాలు, బెదిరింపులు , రౌడీయిజంలో ఇతని పేరు ప్రముఖంగా వినిపించేది. అంబర్‌పేట, మలక్‌పేట్, కాచిగూడ తదితర పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇతనిపై డజనుకు పైగా తీవ్రమైన కేసులు నమోదయ్యాయి. స్థానిక భూవివాదాల్లో జోక్యం చేసుకుంటూ, తమ వర్గాన్ని బెదిరించి సెటిల్మెంట్లు చేయడం ఇతని ప్రధాన శైలి. ఈ క్రమంలోనే గతంలో ఇతనిపై పోలీసులు రౌడీషీట్ తెరిచి, నగర సరిహద్దుల నుండి బహిష్కరించడం లాంటి కఠిన చర్యలు కూడా తీసుకున్నారు.అయితే ఇటీవల కాలంలో జూబ్లీహిల్స్, బంజారా హిల్స్, మేడిపల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో అంబర్‌పేట శంకర్ మళ్లీ పాత దందాలను ప్రారంభించినట్లు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. గాజులరామారం ప్రాంతంలో బిల్డర్లకు తెలియకుండా స్థలాలను విక్రయించడం, ఓ ప్రముఖ బిల్డర్‌ను నేరుగా బెదిరించి రూ. కోట్లలో డీల్ కుదుర్చుకోవడానికి ఒత్తిడి తెచ్చాడనే ఆరోపణలపై బంజాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. అలాగే ఒక ప్రముఖ న్యూస్ ఛానెల్ నిర్వహకుడు, మధ్యవర్తులతో కలిసి సెటిల్‌మెంట్ పేరిట వ్యాపారులను బెదిరించిన ఘటనల్లోనూ ఇతని పాత్ర బయటపడింది.వరుసగా ఫిర్యాదులు రావడం, మళ్లీ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నాడని నిర్ధారించుకున్న పోలీసులు.. శంకర్‌ను మళ్లీ పోలీస్ రాడార్‌లోకి తీసుకువచ్చారు. ఇందులో భాగంగానే అంబర్‌పేట పోలీసులు అధికారికంగా అతడిపై రౌడీషీట్‌ను పునరుద్ధరించారు. ఇకపై ప్రతి రోజు రాత్రి పోలీస్ స్టేషన్‌కు వచ్చి హాజరు పడటంతో పాటు, అతడి ఆర్థిక మూలాలు, ల్యాండ్ సెటిల్‌మెంట్ల వెనుక ఉన్న నెట్‌వర్క్‌పై ప్రత్యేక నిఘా ఉంచనున్నట్లు ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. నేర చరిత్రను వీడకుండా మళ్లీ రౌడీయిజానికి దిగితే గుండా యాక్ట్ ప్రయోగిస్తామని పోలీసులు తీవ్రంగా హెచ్చరించారు.

రూ. 2 కోట్లు దాటేసిన ఇళ్లు...

హైదరాబాద్: హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో కొనుగోలుదారుల ప్రాధాన్యతలు వేగంగా మారుతున్నాయి. ఇటీవల క్రెడాయ్, క్రే మ్యాట్రిక్స్ విడుదల చేసిన నివేదికల ప్రకారం.. నగరంలో ఇళ్ల విక్రయ సంఖ్య కంటే విక్రయాల వ్యాపార విలువ గణనీయంగా పెరిగింది. గత ఏడాదితో పోలిస్తే సగటు ఇంటి కొనుగోలు ధర ఏకంగా 10 శాతం మేర పెరిగి, రూ.1.85 కోట్ల నుంచి రూ.2.03 కోట్లకు చేరింది. ఏటా సుమారు 2,300 చదరపు అడుగుల సగటు విస్తీర్ణం కలిగిన పెద్ద ఇళ్లకు డిమాండ్ ఉండటమే ఈ సగటు ధర పెరుగుదలకు ప్రధాన కారణంగా నిలిచిందిప్రస్తుత మార్కెట్ ట్రెండ్‌ను పరిశీలిస్తే.. చిన్న సైజు ఫ్లాట్లు లేదా 2ఃఊఐ అపార్ట్‌మెంట్ల కంటే పెద్ద విస్తీర్ణం కలిగిన 3ఃఊఐ, 4ఃఊఐ లగ్జరీ అపార్ట్‌మెంట్లు, విల్లాల కొనుగోలుకే నివాసదారులు మొగ్గు చూపుతున్నారు. కరోనా మహమ్మారి తదుపరి ఏర్పడిన వర్క్ ఫ్రమ్ హోమ్ సంస్కృతి, జీవనశైలి మార్పులు , ఐటీ, /కార్పొరేట్ ఉద్యోగుల ఆర్థిక స్థిరత్వం కారణంగా ప్రీమియం, గేటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్టులకు డిమాండ్ పెరిగింది. విశాలమైన హాల్స్, హోమ్ ఆఫీస్ స్పేస్, క్లబ్ హౌస్ వసతులు ఉన్న లగ్జరీ గృహాలనే కొనుగోలుదారులు ఎంచుకుంటున్నారు.ఈ ఏడాది మొదటి అర్ధభాగంలో నగరవ్యాప్తంగా సుమారు 26,000 పైచిలుకు ఇళ్లు అమ్ముడుపోగా, వాటి మొత్తం వ్యాపార విలువ రూ.52,913 కోట్లు దాటాయి. విక్రయించిన మొత్తం ఇళ్ల విస్తీర్ణంలో సుమారు 60 మిలియన్ చదరపు అడుగులను నమోదు చేసి దేశంలోనే హైదరాబాద్ అగ్రస్థానంలో నిలిచింది. గచ్చిబౌలి, కొండాపూర్, కోకపేట్, తెల్లాపూర్ , నార్సింగి వంటి వెస్ట్ హైదరాబాద్‌లోని ప్రధాన ఐటీ కారిడార్లలోని లగ్జరీ ప్రాజెక్టుల విక్రయాలే ఈ రికార్డు స్థాయి విక్రయాల విలువను నడిపించాయని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.కొనుగోలుదారుల మైండ్‌సెట్‌లో వచ్చిన ఈ ఊహించని మార్పుకు అనుగుణంగా రియల్ ఎస్టేట్ బిల్డర్లు, డెవలపర్లు కూడా తమ సరికొత్త ప్రాజెక్టులను ప్లాన్ చేస్తున్నారు. చిన్న ఫ్లాట్ల నిర్మాణం తగ్గించి, ఆధునిక సదుపాయాలు మరియు ప్రాక్టికల్ డిజైన్‌తో కూడిన పెద్ద ఇళ్ల నిర్మాణానికే పెద్దపీట వేస్తున్నారు. మౌలిక వసతుల విస్తరణ, కనెక్టివిటీ మరియు మెట్రో కారిడార్ల పనులతో ముడిపడి ఉన్న హైదరాబాద్ ప్రాపర్టీ మార్కెట్.. కేవలం విక్రయాల సంఖ్యలోనే కాకుండా విలువ పరంగా కూడా ప్రపంచ స్థాయి గ్లోబల్ సిటీ స్థాయికి ఎదుగుతోందని భావిస్తున్నారు.

172 దేశాలకు ఈ-వీసా వ్యవస్థ!



న్యూఢిల్లీ, : భారత్‌ను సందర్శించే అంతర్జాతీయ ప్రయాణికులకు ప్రయాణ సౌలభ్యాన్ని మరింత పెంపొందించే దిశగా కేంద్ర ప్రభుత్వం అత్యంత కీలకమైన నిర్ణయం తీసుకుంది. పంజాబ్‌లోని భారత్-పాకిస్థాన్ సరిహద్దులో ఉన్న ప్రముఖ అట్టారీ ల్యాండ్ పోర్టుతో పాటు మరో 10 అంతర్జాతీయ కేంద్రాలోకి ఈ-వీసా హోల్డర్లకు ప్రవేశాన్ని కల్పిస్తూ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నూతన నోటిఫికేషన్ విడుదల చేసింది. తొమ్మిది ల్యాండ్ పోర్టులు, రెండు విమానాశ్రయాలను ఈ జాబితాలో చేర్చడంతో.. దేశవ్యాప్తంగా ఈ-వీసా ద్వారా భారత్‌లోకి ప్రవేశించడానికి అనుమతి ఉన్న అంతర్జాతీయ కేంద్రాల సంఖ్య ఏకంగా 88కి చేరింది.కేంద్రం తాజాగా విడుదల చేసిన సవరించిన నిబంధనల ప్రకారం.. విదేశీ ప్రయాణికులకు ప్రవేశం కల్పించే మొత్తం 88 కేంద్రాలలో 37 విమానాశ్రయాలు, 38 ఓడరేవులు, 13 ల్యాండ్ పోర్టులు ఉన్నాయి. అయితే కొత్తగా మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్, ఆంధ్రప్రదేశ్‌లోని ఆధ్యాత్మిక నగరం తిరుపతి విమానాశ్రయాలను కొత్తగా ఈ-వీసా జాబితాలో చేర్చారు. అలాగే కొత్తగా పంజాబ్‌లోని అట్టారీతో పాటు రక్సాల్, రూపైడిహా, జోగ్బానీలతో పాటు దర్రంగా, గెడే, ఘోజాదంగా, హరిదాస్‌పూర్, జైగావ్, డావ్కీ, మోరే సరిహద్దు ప్రాంతాలను ఈ-వీసా చెక్‌పోస్టులుగా గుర్తించారు.విదేశీయులకు ఈ-వీసా నిబంధనలను ఎంతగా సడలించినప్పటికీ.. పాకిస్థాన్ పౌరులకు మాత్రం ఈ సదుపాయాన్ని దూరంగా ఉంచారు. పాకిస్థానీ పాస్‌పోర్టు కలిగిన వ్యక్తులకు లేదా పాకిస్థానీ మూలాలు ఉన్న ప్రయాణికులకు భారత్ ఎలాంటి ఈ-వీసాలను మంజూరు చేయడం లేదు. అలాంటివారు సాధారణ పద్ధతిలోనే విదేశాల్లోని భారత రాయబార కార్యాలయాలు లేదా కాన్సులేట్ ద్వారా నేరుగా రెగ్యులర్ వీసాకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని ఈ-పోర్టల్ స్పష్టం చేసింది.భారత వీసా నిబంధనలను సులభతరం చేస్తూ 2014లో కేవలం 43 దేశాల పౌరుల కోసం ప్రారంభించిన ఈ-వీసా సేవలు.. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 172 దేశాల పౌరులకు అందుబాటులోకి వచ్చాయి. టూరిస్ట్, బిజినెస్, మెడికల్, స్టూడెంట్, గ్రూప్ ట్రావెల్, క్రూయిజ్, ట్రాన్సిట్, పర్వతారోహణతో సహా మొత్తం 17 వేర్వేరు సబ్-కేటగిరీలకు ఈ-వీసా సౌకర్యాన్ని వర్తింపజేస్తున్నారు. ఈ-వీసాల కోసం దాఖలయ్యే దరఖాస్తుల్లో దాదాపు 95 శాతానికి పైగా అప్లికేషన్లను కేవలం 72 గంటల వ్యవధిలోనే ప్రాసెస్ చేసి అధికారులు క్లియరెన్స్ ఇస్తున్నారు. ప్రస్తుతం అట్టారీ వంటి కీలక ల్యాండ్ పోర్టులతో పాటు భోపాల్, తిరుపతి విమానాశ్రయాలకు ఈ-వీసా ఎంట్రీ హోదా దక్కడంతో విదేశీ పర్యాటకులు, వ్యాపారవేత్తలకు రవాణా మరింత సులభతరం కానుంది.

టీపీసీసీ కొత్త ఇంచార్జీ ఎవరు...



హైదరాబాద్ : తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో మరోసారి సంస్థాగత మార్పులు జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న మీనాక్షి నటరాజన్ త్వరలోనే ఆ బాధ్యతల నుంచి తప్పుకోనున్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఉన్నత చదువులకోసం విదేశాలకు వెళ్లాలని ఆమె నిర్ణయించుకోవడంతో, ఆమె స్థానంలో మరొకరికి బాధ్యతలు అప్పగించేందుకు హైకమాండ్ ఆలోచిస్తున్నట్టు తెలుస్తోంది.కొంతకాలంగా ఉన్నత విద్యను అభ్యసించాలనే లక్ష్యంతో మీనాక్షి నటరాజన్ ఉన్నారు. ఇప్పటికే ఆమె విదేశీ విశ్వవిద్యాలయాల్లో చదువుకునేందుకు అప్లై చేసుకున్నట్టు సమాచారం. గతంలో కూడా ఆమె విదేశాల్లో చదువుకునేందుకు ప్రయత్నించారు. అయితే పార్టీ హైకమాండ్, రాహుల్ గాంధీ సూచనల మేరకు ఆ నిర్ణయాన్ని వాయిదా వేసుకున్నారు. అయితే, ఉన్నత చదువుల కోసం వచ్చిన సువర్ణావకాశాన్ని వదులుకోవడం ఇష్టం లేక ఆమె మరోసారి హైకమాండ్‌కు తన పరిస్థితిని వివరించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఆమె విదేశీ ప్రయాణానికి పార్టీ నాయకత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. మరో రెండు నెలల పాటు ఆమె ఇంచార్జ్‌గా కొనసాగే అవకాశం ఉంది. ఈ లోపు ఆమె స్థానంలో పూర్తి స్థాయి బాధ్యతలను మరొకరికి అప్పగించేందుకు హైకమాండ్ ఆలోచిస్తున్నట్టు కనిపిస్తోంది.మీనాక్షి నటరాజన్ స్థానంలో తెలంగాణ బాధ్యతలను ఎవరికి అప్పగించాలనే దానిపై ఏఐసీసీ స్థాయిలో కసరత్తు ప్రారంభమైంది. ఈ పోస్టు కోసం పార్టీ హైకమాండ్ కొంతమంది సీనియర్ల పేర్లను పరిశీలిస్తోంది. ముఖ్యంగా దక్షిణాది రాజకీయాలపై పట్టున్న నేతలకు ప్రాధాన్యత ఇవ్వాలని భావిస్తున్నట్లు సమాచారం. ఈ రేసులో తమిళనాడుకు చెందిన ఇద్దరు కీలక నేతల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. తమిళనాడుతో పాటు జాతీయ స్థాయిలోనూ గుర్తింపు ఉన్న ఎంపీ ఒకరు ఈ రేసులో ముందున్నట్టు సమాచారం. అలాగే తమిళనాడుకు చెందిన మరో సీనియర్ నేత, మాజీ ఎంపీ చల్లకుమార్ పేరు కూడా పరిశీలనలో ఉన్నట్లు పార్టీ వర్గాలు అంటున్నాయి.మరోవైపు పార్టీలో సుదీర్ఘ అనుభవమున్న సీనియర్ నాయకుడు ముకుల్ వాస్నిక్ పేరు కూడా ప్రచారంలో ఉంది. తెలంగాణ కాంగ్రెస్‌లోని పలువురు సీనియర్ నాయకులతో ముకుల్ వాస్నిక్‌కు దశాబ్దాలుగా మంచి సంబంధాలున్నాయి. రాష్ట్రంలో పార్టీ అంతర్గత సమీకరణాలను చక్కదిద్దడంలో ఆయన అనుభవం ఉపయోగపడుతుందని అధిష్టానం భావిస్తున్నట్లు తెలుస్తోంది.

రూ.2,000 వరకు యూపీఐ చెల్లింపులపై బ్యాంక్ ఛార్జీలు ఉండవు

న్యూఢిల్లీ: యూపీఐ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం కీలక స్పష్టత ఇచ్చింది. రూ.2,000 వరకు జరిగే యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ లావాదేవీలపై బ్యాంకులు ఎలాంటి ఛార్జీలు విధించకూడదని ప్రభుత్వం స్పష్టం చేసింది. అలాగే రూ.2,000 వరకు ఖీబీఖజీఎ డెబిట్ కార్డుల ద్వారా జరిగే చెల్లింపులపైనా బ్యాంకులు ఛార్జీలు వసూలు చేయడానికి వీలు లేదని పేర్కొంది.కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తాజాగా జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో ఈ విషయాన్ని స్పష్టం చేసింది. ఖజీఎవనిబి జీనిట ూవబిబిశ్రీవఎవనిబి ూఎబబివఎబ ంఞబి కింద నిబంధనల్లో మార్పులు చేస్తూ ఈ నోటిఫికేషన్‌ను జారీ చేశారు.రూ.2,000 వరకు యూపీఐ రూపీ డెబిట్ కార్డు ద్వారా చెల్లింపులు చేసే వ్యక్తుల నుంచి బ్యాంకులు, సిస్టమ్ ప్రొవైడర్లు ఎలాంటి ప్రత్యక్ష లేదా పరోక్ష ఛార్జీలు వసూలు చేయకూడదని ప్రభుత్వం తెలిపింది. చెల్లింపు చేసే వ్యక్తితో పాటు చెల్లింపు స్వీకరించే వ్యక్తిపై కూడా ఇలాంటి ఛార్జీలు విధించకూడదని స్పష్టం చేసింది.ఈ లావాదేవీలను ప్రభుత్వం అధికారికంగా "ఎలక్ట్రానిక్ మోడ్ ఆఫ్ పేమెంట్"గా వర్గీకరించింది. చెల్లింపులపై ఛార్జీలు విధించే అవకాశం ఉందంటూ చర్చ జరుగుతున్న నేపథ్యంలో కేంద్రం ఈ స్పష్టత ఇచ్చింది. వినియోగదారులు యూపీఐ ద్వారా చెల్లింపులు చేసేందుకు ఎలాంటి ఛార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదని గత నెలలోనే ప్రభుత్వం వెల్లడించింది. ముఖ్యంగా లావాదేవీలు పూర్తిగా ఉచితంగానే కొనసాగుతాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. వ్యాపారులపై కూడా అన్ని యూపీఐ లావాదేవీలకు వర్తించే విధంగా ఎలాంటి విధించబోమని స్పష్టం చేసింది.భవిష్యత్తులో నిర్దిష్ట పరిమితికి మించిన కొన్ని యూపీఐవ్యాపార లావాదేవీలపై మాత్రమే ఎండీఆర్ విధించే అవకాశం ఉంటుందని ప్రభుత్వం తెలిపింది. అయితే ఈ ఛార్జీలు డెబిట్ లేదా క్రెడిట్ కార్డు లావాదేవీలపై ప్రస్తుతం వర్తించే పోలిస్తే గణనీయంగా తక్కువగా ఉంటాయని పేర్కొంది.దేశవ్యాప్తంగా రోజువారీ చెల్లింపులకు వినియోగం భారీగా పెరిగిన నేపథ్యంలో కేంద్రం తాజా స్పష్టత వినియోగదారులకు ఊరటనిచ్చే అంశంగా మారింది. ముఖ్యంగా చిన్న మొత్తాల చెల్లింపుల్లో అదనపు ఛార్జీల భారం ఉండదని ప్రభుత్వం స్పష్టం చేయడంతోయూపీఐ వినియోగం మరింత సులభంగా కొనసాగనుంది.

8 కోట్లతో భారీ సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ప్రారంభించిన: మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ : కరీంనగర్ పిల్లలకు ప్రభుత్వం ఇవ్వగలిగే గొప్ప ఆస్తి విద్య మాత్రమేనని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. విద్యార్థులు ఉదయం ఆకలితో తరగతి గదులకు రాకుండా.. వారికి నాణ్యమైన, పోషకాహారంతో కూడిన అల్పాహారం అందించి ఆకలిని తరిమి అక్షరానికి అండగా నిలవడమే స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమం ఉద్దేశమని పేర్కొన్నారు.కరీంనగర్ మార్కెట్‌యార్డులో తెలంగాణ ప్రభుత్వం, హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఇండియా ఇంప్లిమెంటేషన్ పార్ట్‌నర్‌గా కలిసి సుమారు రూ.8 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన భారీ సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌ను బుధవారం మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాతో కలిసి ప్రారంభించారు. అనంతరం కిచెన్‌లో ఏర్పాటు చేసిన అధునాతన సాంకేతిక పరికరాలను పరిశీలించారు.విద్యే పిల్లలకు గొప్ప ఆస్తిఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ. గతంలో విద్యార్థుల ఎదుగుదలకు భూములు, నిధులు వంటి ఆస్తులు ఉండేవని, ఇప్పుడు పిల్లలకు ప్రభుత్వం ఇవ్వగలిగే గొప్ప ఆస్తి విద్య మాత్రమేనని అన్నారు. ఇటీవల జరిగిన సిప్ సర్వేలో ఉన్నత స్థాయిలో ఉన్న కుటుంబాలను పరిశీలించినప్పుడు ఉన్నత చదువులు చదివిన కుటుంబాలే మెరుగైన స్థాయిలో ఉన్నట్లు గుర్తించిన విషయాన్ని ప్రస్తావించారు. అందుకే ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో అనేక మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని, శిక్షణ పొందిన ఉపాధ్యాయులను అందుబాటులో ఉంచుతున్నామని, ఇప్పుడు విద్యార్థులకు ఉదయమే నాణ్యమైన అల్పాహారం అందించే కార్యక్రమాన్ని కూడా చేపట్టామని మంత్రి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి తల్లిదండ్రులు మద్దతు ఇవ్వాలని కోరారు.ఆకలితో చదువుకు ఆటంకం ఉండొద్దు:ఆకలితో ఉన్న పిల్లవాడు చదువుపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టలేడని మంత్రి అన్నారు. విద్యార్థులకు ఉదయమే పోషకాహారంతో కూడిన అల్పాహారం అందించడం ద్వారా వారి ఏకాగ్రత, జ్ఞానాత్మక సామర్థ్యం, తరగతి గది భాగస్వామ్యం మెరుగుపడేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. విద్యార్థుల హాజరు, సమయపాలన, విద్యా పనితీరు మెరుగుపడేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు, ముఖ్యంగా ఉదయమే ఉపాధి కోసం వెళ్లే తల్లిదండ్రులకు ఈ కార్యక్రమం ఆర్థికంగా, సమయపరంగా ఉపశమనం కల్పిస్తుందని అన్నారు. ఉపాధ్యాయులు వంట, ఆహార నిర్వహణ బాధ్యతల నుంచి విముక్తి పొంది బోధనపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.కరీంనగర్‌లో 49,025 మందికి అల్పాహారం:కరీంనగర్‌లో సుమారు రూ.8 కోట్లతో ఏర్పాటు చేసిన ఈ సెంట్రలైజ్డ్ కిచెన్‌కు రోజుకు 50 వేల మంది విద్యార్థులకు అల్పాహారం అందించే సామర్థ్యం ఉందని మంత్రి తెలిపారు. 17 మండలాల్లోని 669 ప్రభుత్వ పాఠశాలలు, 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు ఈ బ్రేక్‌ఫాస్ట్ సేవలు అందుతాయని చెప్పారు. మొత్తం 49,025 మంది విద్యార్థులు ప్రతిరోజూ ప్రయోజనం పొందుతారని వివరించారు. కరీంనగర్, హుస్నాబాద్, చొప్పదండి, మానకొండూర్ నియోజకవర్గాల విద్యార్థులకు ఈ కిచెన్ ద్వారా అల్పాహారం అందుతుందని తెలిపారు. నియోజకవర్గాల వారీగా హుస్నాబాద్‌లో 16,544 మంది, మానకొండూర్‌లో 8,645 మంది, చొప్పదండిలో 7,481 మంది, కరీంనగర్‌లో 16,355 మంది విద్యార్థులు లబ్ధి పొందుతారని చెప్పారు. రాష్ట్రంలో ఇది ఆరవ కమ్యూనిటీ కిచెన్ అని మంత్రి తెలిపారు. ఇక్కడి నుంచి 17 మండలాల్లో దాదాపు 50 వేల మంది విద్యార్థులకు అల్పాహారం పంపిణీ జరుగుతుందని చెప్పారు.అధునాతన యంత్రాలతో ఆహార తయారీ:కిచెన్‌లో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఇడ్లీ, దోశ, పూరీ, బోండా, సాంబార్ తయారు చేసే మిషన్లు ఏర్పాటు చేశారని మంత్రి తెలిపారు. పాత్రలు శుభ్రం చేసే మిషన్లు, పాల కేంద్రం, ఆహార పదార్థాల టెస్టింగ్ ల్యాబ్, కూరగాయలు కట్ చేసే మిషన్లు, కూరగాయలు కడిగే మిషన్లు, చట్నీ పౌడర్ తయారీ మిషన్లు కూడా ఏర్పాటు చేశారని చెప్పారు. వాటి పనితీరును స్వయంగా పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్ అశ్వినీ తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఇండియా ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కౌంటియా దాస స్వామీజీ, కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న, ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

రక్తపోటు సరిగ్గానే చెక్ చేసుకుంటున్నారా?



రక్తపోటు తరచూ ఇంట్లోనో లేక ఆస్పత్రికి వెళ్లో చెక్ చేసుకోవడం నేటి కాలంలో సాధారణం అయిపోయింది. ముఖ్యంగా బీపీ చెకింగ్‌కి చాలా మంది ఇంట్లోనే చెక్ చేసుకోవడానికి ప్రయత్నిస్తుంటారు. అధిక రక్తపోటుతో బాధపడుతున్న వ్యక్తులు రక్తపోటును తనిఖీ చేయడంలో కొన్ని తప్పులు చేస్తుంటారు. దీని వల్ల తప్పుడు రీడింగ్ వస్తుంది. నేటి జీవన శైలి కారణంగా చిన్న వయసులోనే బీపీ, డయాబెటిస్ పలకిరిస్తున్నాయి. దీంతో తరచూ వీటిని ఇంట్లోనో లేక ఆస్పత్రికి వెళ్లో చెక్ చేసుకోవడం పరిపాటై పోయింది. ముఖ్యంగా బీపీ చెకింగ్‌కి చాలా మంది ఇంట్లోనే చెక్ చేసుకోవడానికి ప్రయత్నిస్తుంటారు. అధిక రక్తపోటుతో బాధపడుతున్న వ్యక్తులు రక్తపోటును తనిఖీ చేయడంలో కొన్ని తప్పులు చేస్తుంటారు. దీని వల్ల తప్పుడు రీడింగ్ వస్తుంది. జనరల్ ప్రాక్టీషనర్ డాక్టర్ విశాఖ ఖచ్చితమైన రీడింగ్ పొందడానికి అనుసరించే పద్ధతి గురించి చెబుతున్నారు. సాధారణంగా రక్తపోటును తనిఖీ చేసేటప్పుడు తెలిసో.. తెలియకో.. చేసే తప్పులు రీడింగ్‌ను ఎలా పెంచుతాయో లేదా తగ్గిస్తాయో ఆమె ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో వివరించారు. శారీరక శ్రమ లేదా భావోద్వేగ ఒత్తిడి తర్వాత వెంటనే రక్తపోటును కొలవడం సాధారణంగా అందరూ చేసే తప్పు. ఇది సిస్టోలిక్ రక్తపోటును తప్పుగా పెంచుతుంది. ఇటువంటి రీడింగ్‌లు వ్యక్తి వాస్తవ బేస్‌లైన్ స్థాయిలను వెల్లడించదు. బీపీ చెకప్ చేసుకునే ముందు ఐదు నిమిషాలు నిశ్శబ్దంగా కూర్చోవడం మంచిది. చెకప్ సమయంలో కూర్చునే తప్పుడు భంగిమ కూడా రీడింగ్‌ను ప్రభావితం చేస్తుంది. కాళ్ళు అడ్డంగా పెట్టుకుని, వేలాడిస్తూ.. తగినంత వీపు మద్దతు లేకుండా కూర్చున్నప్పుడు రక్తపోటు రీడింగ్‌లు 10 ఎంఎంహెచ్ నుంచి 15 ఎంఎంహెచ్ వరకు పెరుగుతాయి. రీడింగ్ సమయంలో వీపు భాగం కుదురుగా ఉంచాలి. రెండు పాదాలు నేలపై ఉంచాలనే విషయాలు నిర్ధారించుకోవాలి. ఇలా చేస్తే చెకప్ సక్రమంగా ఉంటుంది. చేయి వేలాడదీయడం లేదా సపోర్ట్ లేకుండా ఉండటం మరొక సాధారణ తప్పు. చేయి గుండె స్థాయి కంటే తక్కువగా ఉంచినట్లయితే తప్పుగా అధిక రక్తపోటు రీడింగ్ వస్తుంది. అదేవిధంగా చేయి చాలా ఎత్తుగా పైకి లేపినా తప్పుగా తక్కువ రీడింగ్ వస్తుంది. చేయి గుండె స్థాయిలో సౌకర్యవంతంగా ఉండేలా ఉంచాలి. ఇది రక్తపోటును కొలవడానికి సరైన భంగిమ. కఫ్ సైజు అనేది రక్తపోటు రీడింగ్‌లను ప్రభావితం చేసే మరో ముఖ్యమైన అంశం. చాలా చిన్నగా ఉన్న కఫ్ తప్పుగా రీడింగ్‌లను పెంచుతుంది. అలాగే పెద్దగా ఉన్న కఫ్ కూడా తప్పుగా తక్కువ రీడింగ్‌కు దారితీస్తుంది. ఖచ్చితమైన కొలత కావాలంటే చేయి చుట్టుకొలతకు తగిన కఫ్‌ను మాత్రమే ఉపయోగించాలి.

కాలేయం ఆరోగ్యానికి వ్యాయామాలు....



శరీరంలోని ప్రతి భాగం చాలా ముఖ్యమైనది. కానీ ఈ యంత్రం ఇంజిన్ బలహీనంగా మారితే ఏం జరుగుతుంది? మన శరీరంలో కాలేయం ఎంతో ముఖ్యమైది. ఇది శరీరంలోని అతి ముఖ్యమైన, కష్టపడి పనిచేసే అవయవాలలో ఒకటి.

కాలేయం ఆహారాన్ని జీర్ణం చేయడంలో సహాయపడటమే కాకుండా శరీరం నుండి విషపూరిత అంశాలను తొలగించడానికి కూడా పనిచేస్తుంది. వేయించిన ఆహారాలు, ఒత్తిడి క్రమంగా కాలేయాన్ని బలహీనపరుస్తాయని చెబుతున్నారు నిపుణులు. మందుల సహాయం తీసుకునే ముందు కాలేయాన్ని లోపలి నుండి బలోపేతం చేసే కొన్ని వ్యాయామాల గురించి తెలుసుకుందాం. ఇది కాలేయానికి అత్యంత ప్రభావవంతమైన యోగా ఆసనం అని భావిస్తారు. ఈ ప్రాణాయామంలో వేగంగా గాలి వదులుతూ కడుపు లోపలికి, బయటకు కదిలిస్తూ ఉంటుంది. ఇది కాలేయాన్ని శుభ్రపరుస్తుంది. కొవ్వు పేరుకుపోకుండా నిరోధిస్తుంది. రోజూ 5-10 నిమిషాలు కపలాభతి చేయడం వల్ల కాలేయ పనితీరు మెరుగుపడుతుంది.

భోజనం తర్వాత తాంబూలం అలవాటు ఉందా?

పూజ అయినా, వివాహ వేడుక అయినా లేదా మరే ఇతర వేడుక అయినా ప్రతి శుభకార్యంలోనూ తమలపాకులు తప్పనిసరిగా ఉండాల్సిందే. వీటికి మతపరమైన ప్రాముఖ్యతతో పాటు ఆరోగ్య ప్రయోజనాలు కూడా ఉన్నాయి. తమలపాకులలో సహజంగా యాంటీ బాక్టీరియల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీఆక్సిడెంట్ లక్షణాలు.. భారతీయ సంస్కృతిలో తమలపాకులకు విశేష ప్రాముఖ్యత ఉంది. పూజ అయినా, వివాహ వేడుక అయినా లేదా మరే ఇతర వేడుక అయినా ప్రతి శుభకార్యంలోనూ తమలపాకులు తప్పనిసరిగా ఉండాల్సిందే. వీటికి మతపరమైన ప్రాముఖ్యతతో పాటు ఆరోగ్య ప్రయోజనాలు కూడా ఉన్నాయి. తమలపాకులలో సహజంగా యాంటీ బాక్టీరియల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీఆక్సిడెంట్ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి. ఇవి ఆరోగ్యకరమైన జీర్ణవ్యవస్థను నిర్వహించడానికి, దుర్వాసనను తొలగించడానికి, శరీరాన్ని నిర్విషీకరణ చేయడానికి సహాయపడతాయి. అందుకే ఇంట్లో పెద్ద వాళ్లు భోజనం తర్వాత తమలపాకులను నమలుతారు. తమలపాకులలో ఉండే పోషకాలు జీర్ణక్రియకు చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. వీటిని తినడం వల్ల జీర్ణవ్యవస్థ బలపడుతుంది. అజీర్ణం, గ్యాస్, మలబద్ధకం, ఉబ్బరం, ఆమ్లత్వం వంటి సమస్యల నుండి బయటపడటానికి కూడా ఇది సహాయపడుతుంది. ప్రతిరోజూ భోజనం తర్వాత తమలపాకు తినడం వల్ల మానసిక స్థితి మెరుగుపడుతుంది. ఇది మీ మనసును ప్రశాంతంగా ఉంచి మానసిక ఒత్తిడిని తగ్గిస్తుంది. భోజనం తర్వాత తమలపాకు తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. ఇది డయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. అల్సర్ వంటి తీవ్రమైన సమస్యల నుంచి మిమ్మల్ని రక్షిస్తుంది.



నోటి దుర్వాసన అనేది చాలా మంది ఎదుర్కొనే ఒక సాధారణ సమస్య. తమలపాకులను నమలడం వల్ల దుర్వాసన తొలగిపోతుంది. దీని యాంటీ బాక్టీరియల్ లక్షణాలు నోటిలో దుర్వాసనకు ప్రధాన కారణమైన హానికరమైన బ్యాక్టీరియా పెరుగుదలను తగ్గిస్తాయి. ఇది అద్భుతమైన సహజ మౌత్ ఫ్రెషనర్‌గా పనిచేస్తుంది.పంటి నొప్పి, చిగుళ్ళలో రక్తస్రావం వంటి సమస్యలకు తమలపాకులు చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. తమలపాకులలో విటమిన్ సి ఉంటుంది. ఉదయం ఖాళీ కడుపుతో నమలడం వల్ల చిగుళ్ళు బలపడతాయి. దంత సమస్యలు తొలగిపోతాయి. తమలపాకులలో టానిన్లు, ప్రొపేన్ ఉంటాయి. ఇవి శరీరం నుంచి విషాన్ని తొలగించి ఆరోగ్యకరమైన శరీరాన్ని నిర్వహించడంలో సహాయపడతాయి.

మెంతులు.. ఆరోగ్యానికి అద్భుతం కానీ!



మెంతులు తెలుగు ఇంటి వంటల్లో దాదాపు తప్పనిసరి పదార్థం. జీర్ణక్రియ మెరుగుపరచడం, రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడం, జుట్టు ఆరోగ్యం, చర్మ సౌందర్యం – ఇలా అనేక ఆయుర్వేద గుణాలకు ప్రసిద్ధి చెందిన ఈ చిన్న గింజలు రోజువారీ ఆహారంలో భాగమే. కానీ ఇటీవలి అధ్యయనాలు, నిపుణుల హెచ్చరికలు ఈ మెంతుల వాడకం గురించి కొత్త కోణాన్ని చూపుతున్నాయి. గర్భిణీ స్త్రీలు మెంతులను అధికంగా తీసుకుంటే గర్భస్థ శిశువుపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా మొదటి త్రైమాసంలో మెంతుల్లోని కొన్ని సమ్మేళనాలు గర్భాశయ సంకోచాలను ప్రేరేపించి అకాల గర్భస్రావం రిస్క్‌ను పెంచుతాయని అనేక అధ్యయనాలు సూచిస్తున్నాయి. అంతేకాదు, అతి తక్కువ సందర్భాలలో అరుదైన జన్యు వ్యాధి అయిన మాపుల్ సిరప్ యూరిన్ డిసీజ్ బిడ్డకు వచ్చే ప్రమాదం కూడా లేదని అనిపించదు. ఇక రొమ్ము క్యాన్సర్ ఉన్న లేదా రిస్క్‌లో ఉన్న మహిళల విషయంలో మెంతులు మరింత జాగ్రత్త అవసరం చేస్తాయి. మెంతుల్లో ఫైటోఈస్ట్రోజెన్స్ అనే సమ్మేళనాలు ఉంటాయి, ఇవి శరీరంలో ఈస్ట్రోజెన్ హార్మోన్‌ను అనుకరిస్తాయి.

అందుకే పిల్లలను వద్దనుకున్నా....



చిత్ర పరిశ్రమలో తనదైన నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి అనుపమ పరమేశ్వరన్, ఇటీవల తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన అత్యంత చేదు అనుభవాలను బయటపెట్టి సంచలనం సృష్టించారు. గతంలో తాను ఒక వ్యక్తితో ప్రేమలో ఉన్న సమయంలో అనుభవించిన తీవ్రమైన మానసిక క్షోభను గుర్తుచేసుకుంటూ ఆమె ఎంతో ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న అనుపమ మాట్లాడుతూ.. ఒక మహిళగా, ఒక నటిగా సమాజంలో ఎంతో ధైర్యంగా నిలబడాలని ప్రయత్నించిన తనకు, తన మాజీ ప్రియుడి ప్రవర్తన వల్ల తనపై తనకే సిగ్గుచేటుగా అనిపించే పరిస్థితి వచ్చిందని ఆమె తెలిపారు. ప్రతి నెలా ఒక స్త్రీగా సహజంగా జరిగే పీరియడ్స్ ప్రక్రియను కూడా అతడు చాలా చులకనగా చూసేవాడని వెల్లడించారు. తాను ఏ రోజైనా అతని తప్పులను ప్రశ్నించడానికి ప్రయత్నిస్తే, వెంటనే నీకు పీరియడ్స్ సమయమా లేక ఇంకా రాలేదా అని ప్రశ్నిస్తూ, ఇదంతా కేవలం మూడ్ స్వింగ్స్ వల్ల మాత్రమే అని చాలా తేలిగ్గా కొట్టిపడేసేవాడని చెప్పారు. ప్రతిసారీ ఆ రకమైన వ్యాఖ్యలు విన్నప్పుడు ఒక మహిళగా పుట్టినందుకే కదా ఇలాంటి మాటలు అనిపించుకోవాల్సి వస్తోందని, తన ఉనికిపై తనకే అసహ్యం వేసేదని ఆమె స్పష్టం చేశారు. ఈ విషపూరితమైన రిలేషన్‌షిప్ వల్ల తన జీవిత లక్ష్యాలు, ఆలోచనలు కూడా పూర్తిగా మారిపోయాయని అనుపమ ఆవేదన చెందారు. చిన్నప్పటి నుంచి తనకు 11 మంది పిల్లలు ఉండాలని ఎంతో ఆశగా కలలు కనేదాన్ని అని, కానీ ఆ వ్యక్తితో గడిపిన రెండేళ్ల కాలం తర్వాత, భవిష్యత్తులో అసలు పిల్లలే వద్దు అనే తీవ్రమైన నిర్ణయానికి వచ్చేలా తన ఆలోచనలను దిగజార్చాడని తెలిపారు. అతడి ప్రవర్తన వల్ల తాను తీవ్రమైన డిప్రెషన్‌లోకి వెళ్లిపోయానని, ఆ చేదు జ్ఞాపకాల నుంచి బయటపడటానికి చాలా సమయం పట్టిందని చెప్పారు. ప్రస్తుతం అనుపమ చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి.

పెళ్లి అయిన హీరోయిన్ల కెరీర్‌ను తొక్కేస్తున్నారు



టాలీవుడ్ స్టార్ బ్యూటీ కాజల్ అగర్వాల్ సెకండ్ ఇన్నింగ్స్‌లోనూ వరుస ఆఫర్లతో ఫుల్ బిజీగా గడుపుతున్నారు. ఇటీవల ఆమె నటించిన సినిమాలు ఆశించిన స్థాయిలో బాక్సాఫీస్ వద్ద రాణించలేకపోయినా, ఈ చందమామకున్న క్రేజ్, డిమాండ్ మాత్రం రవ్వంతైనా తగ్గడం లేదు. ప్రస్తుతం దర్శకుడు నితీష్ తివారీ అత్యంత భారీ బడ్జెట్‌తో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న పాన్-ఇండియా విజువల్ వండర్ 'రామాయణ'లో కాజల్ మండోదరి పాత్రలో కనిపించబోతున్నారు. ఈ బిగ్ ప్రాజెక్ట్ షూటింగ్ పనులు ప్రస్తుతం శరవేగంగా జరుగుతుండగా, దీపావళి పండుగ కానుకగా గ్రాండ్‌గా విడుదల చేయడానికి చిత్ర బృందం ఏర్పాట్లు చేస్తోంది.

అయితే ఈ సినిమా షూటింగ్ హడావుడిలో ఉన్న కాజల్, తాజాగా ఓ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సినీ ఇండస్ట్రీలో నటీమణులు ఎదుర్కొంటున్న పరిస్థితులపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా పెళ్లి తర్వాత హీరోయిన్ల పట్ల పరిశ్రమ చూపే వివక్షను బయటపెడుతూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సాధారణంగానే సినిమా రంగంలో పురుషులతో పోలిస్తే నటీమణులే ఎక్కువ సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తుందని, ఈ విషయంలో తనకు కొంత అసంతృప్తి కూడా ఉందని కాజల్ స్పష్టం చేశారు. పరిశ్రమలో ఒక నటికి పెళ్లి కాగానే ఆమె లైఫ్ లేదా కెరీర్ అక్కడితో ముగిసిపోయిందని చాలామంది భావిస్తుంటారని కాజల్ అన్నారు. నటీమణులకు మార్కెట్‌లో మంచి డిమాండ్, క్రేజ్ ఉన్నప్పటికీ.. పెళ్లయ్యాక వారిని ఉద్దేశపూర్వకంగానే పక్కనపెట్టి, వారి కెరీర్‌ను అణచివేయడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని సంచలన నిజాలు వెల్లడించారు. ఇటువంటి వివక్షతతో కూడిన పరిస్థితులు పరిశ్రమలో త్వరలోనే మారాలని కోరారు. ప్రతిభ ఉన్న నటీమణులకు వయస్సు లేదా పెళ్లి అనేవి ఎప్పటికీ అడ్డంకి కాకూడదని, నిజమైన టాలెంట్ ఉన్న నటీమణులు ఏ వయసులోనైనా అద్భుతంగా నటించగలరని కాజల్ పేర్కొన్నారు. ప్రస్తుతం కాజల్ చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో తీవ్ర చర్చకు దారితీశాయి.

నిజాయితీనే ప్రేక్షకులు గుర్తిస్తారు!



"సోషల్ మీడియా ట్రెండ్‌లను పాటిస్తూ.. ఇతరుల అంచనాలను అందుకోవాలని చేసే ప్రయత్నాలు మనల్ని మనం కోల్పోయేలా చేస్తాయ"ని అంటున్నారు కథానాయిక రష్మిక. ఇటీవల ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. "నా వ్యక్తిగత ప్రయాణంలో ఉన్నది ఉన్నట్లు పంచుకోవడానికి ఎప్పుడూ ఇష్టపడతాను. సామాజిక మాధ్యమాల్లో ప్రేక్షకులు నన్ను చూసేది నిజజీవితంలో నేను ఎలా ఉంటానో దానికి దగ్గరగా ఉంటుంది. ట్రెండ్‌ల ప్రభావానికి లోనవకుండా ఒక నిర్దిష్టమైన ఇమేజ్‌లో ఇమడటానికి ఎక్కువగా ప్రయత్నించనప్పుడు ఇలాంటి సహజమైన వ్యక్తిత్వం వస్తుంది.

బహుశా అదే నేనిలా ఉండడానికి సహాయపడుతుందని భావిస్తున్నా. మనం ఎలా ఉండాలో నిరంతరం చెబుతూ ఉండే ప్రపంచంలో బతుకుతున్నాం. ఇతరుల అంచనాలను అందుకోవడానికి ప్రయత్నిస్తున్నప్పుడు సోషల్ మీడియా, ట్రెండ్‌లు, అభిప్రాయాలు మనల్ని మనం కోల్పోయేలా చేస్తాయి. అందుకే నా దృష్టిలో సక్సెస్ అంటే ఫర్‌ఫెక్ట్ ఇమేజ్ కాదు.. ఎంత ఎదుగుతున్నా సరే మనం మనలా ఉంటూ ప్రేక్షకులతో నిజాయతీగా ఉండడమే. అలాంటి నిజాయతీని ఎప్పటికైనా ప్రేక్షకులు గుర్తిస్తారు. నటిగా ఉండడం వల్ల అంచనాలు, విమర్శలనేవి సహజం. అందరి అభిప్రాయాలను నియంత్రించలేమని, కానీ వాటికి ఎలా స్పందిస్తామన్నది మాత్రం మన చేతుల్లోనే ఉంటుందని కాలక్రమేణా తెలుసుకున్నా. నా పనిపై దృష్టి పెట్టడం. వ్యక్తిత్వానికి కట్టుబడి ఉండడం, నా ప్రయాణమే నా గురించి చెప్పేలా చేసుకోవడం నాకు ఇష్టమ"ని అన్నారు. ఇటీవలే 'మైసా' చిత్రీకరణలో గాయపడిన రష్మిక విశ్రాంతి తీసుకుంటున్నారు. ప్రస్తుతం ఆమె ఖాతాలో 'రణబాలి', 'మైసా' చిత్రాలున్నాయి

మోహన్‌లాల్ జోరు మామూలుగా లేదుగా..

మలయాళ స్టార్ సీనియర్ నటుడు మోహన్ లాల్.. ఇండియా వ్యాప్తంగా ఉన్న ఇతర సీనియర్ స్టార్ హీరోలతో పోలిస్తే అద్భుతమైన జోష్ చూపిస్తున్నారు. ఏకకాలంలో ఏడు సినిమాలకు ఓకే చెప్పి చాలామంది సీనియర్ హీరోలకు షాక్ ఇచ్చారు. మోహన్ లాల్ ఒకే రోజు ఏకంగా ఏడు సినిమాలకు కమిట్ అయ్యారు. వాటిలో జీతూ జోసఫ్ దర్శకత్వంలో తెరకెక్కనున్న సినిమాతో పాటు ప్రియదర్శన్, విష్ణు మోహన్, దిలీశ్ పోతన్, సత్యన్, జూడ్ ఆంథనీ దర్శకత్వంలో తెరకెక్కనున్న సినిమాలు ఉన్నాయి. ఇలా ఏకకాలంలో ఏడు సినిమాలకు ఓకే చెప్పడంతో మోహన్ లాల్ తన అభిమానులను వరుస సినిమాలతో అలరించబోతున్నారని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఏకకాలంలో ఏడు సినిమాలకు ఓకే చెప్పి చాలామంది సీనియర్ హీరోలకు షాక్ ఇచ్చారు. మోహన్ లాల్ ఒకే రోజు ఏకంగా ఏడు సినిమాలకు కమిట్ అయ్యారు.ఇక మోహన్ లాల్ తాజాగా తన సోషల్ మీడియా ఖాతాలో 'ఎగ్జైటింగ్ స్టోరీలతో ఆసక్తికరమైన జర్నీకి సిద్ధమవుతున్నాను' అంటూ పోస్ట్ చేశారు. దీంతో ఆయన నుంచి రాబోయే తదుపరి చిత్రాలపై ప్రేక్షకుల్లో ఆసక్తి మరింతగా పెరిగింది.



Edited, Printed, Published & Owned by PUSALA SRINIVAS, Printed at D.K. Publications,2-3-691/1/A CPL Main Road, Amberpet, Hyderabad and Published # Do.No. 2-2-1075/20/E/1, Opp. Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13. Editor : PUSALA SRINIVAS, RNI. NO. APTEL/2008/26737. Cell: 9603754136, 9949653944 E-mail: dkchaatimpu80@gmail.com